అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 04-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 349 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



ఆరు గ్యారంటీల అమలుకు

మరో ఉద్యమం

రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి స్థాయి అమలుకు డిమాండ్

ఆత్మీయ భరోసాను ఉపాధిహామీతో లింక్ చేయొద్దు

మున్సిపల్ ఏరియాల్లోనూ ఈ పథకాన్ని వర్తింపజేయాలి

రాష్ట్ర ప్రయోజనాలపై బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజీ ధోరణి సరికాదు :

సీపీఐ(ఎం) ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు పూనుకోవాలని, లేకపోతే మరో ఉద్యమం తప్పదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డీ జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వీరితో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి. పోతినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని, జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో అధికారంలోకి ...3లో



కుంభమేళా తొక్కిసలాటపై గరంగరం

మృతుల జాబితా వెల్లడించాలని ప్రతిపక్షాల ఆందోళన

సమాధానం చెప్పాల్సిందేనంటూ వెల్‌లోకి దూసుకెళ్లిన విపక్షం

వామపక్ష ఎంపీల వాకౌట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మూడో రోజైన సోమవారం ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష ఎంపీలు కుంభమేళా విషాదంపై లోక్‌సభలో చర్చకు పట్టుబట్టారు. ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నోత్తరాలను సస్పెండ్ చేసి గత నెల 29న ...11లో





ట్రంప్ చిచ్చులకు రూపాయి చిత్తడి

డాలర్ రూ.87.17 | చరిత్రలోనే రికార్డ్ కనిష్టం

అయినా ఆందోళనేమీ లేదంటున్న కేంద్ర ఆర్థికశాఖ

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చిచ్చులకు రూపాయి చిత్తడి అవుతోంది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు అధ:పాతాళానికి పడిపోతోంది. సోమవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 55 పైసలు క్షీణించి 87.17కు దిగజారి.. ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం, చైనాపై 10 శాతం చొప్పున ట్రంప్ టారిఫ్‌ల పెంపు ప్రకటనతో భారత కరెన్సీ తీవ్రంగా ప్రభావితమయ్యింది. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వ వర్గాలకు ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 87 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.29కి పడిపోయింది. తుదకు 55 పైసలు కోల్పోయి 87.17 వద్ద ముగిసింది. ఇది భారత రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవమైన ప్రదర్శన. ఇంత జరుగుతున్నా భయపడాల్సిందేమీ లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే పేర్కొనడం గమనార్హం. భారత స్టాక్ మార్కెట్ల నుంచి భారీగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ)ల తరలిపోవడానికి తోడు అమెరికా టారిఫ్‌ల భయాలు, డాలర్‌కు విలువ పెరగడం తదితర పరిణామాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేశాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ముడి చమురు బ్యారెల్ ధర 1.41 శాతం పెరిగి 76.74 వద్ద ముగిసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే డాలరుతో రూపాయి విలువ 90కి చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, వచ్చే 6-8 వారాల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని ఆర్‌బీఎల్ బ్యాంక్ ట్రెజరీ హెడ్ అన్షుల్ చెందక్ పేర్కొన్నారు.

నోరువిప్పని ప్రధాని

ట్రంప్ ప్రసంగాలు, చర్యలు, సుంకాలు, బెదిరింపుల పర్యవసానాలతో రూపాయి నేల చూపులు చూస్తోంటే ప్రధానీ మోడీ నోరు విప్పకపోవడం గమనార్హం. మరోవైపు ఆర్థిక శాఖ భయపడాల్సిందేమీ లేదంటూ మేకపోతు గంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే అన్నారు. కరెన్సీ విలువ క్షీణతపై ఆర్బీఐ చూసుకుంటుందన్నారు. రూపాయి విలువ అనేది ఎవరూ నియంత్రించేది కాదన్నారు. దానికంటూ ఒక స్థిరమైన ధర అంటూ ఉండదన్నారు. విదేశీ మదుపర్ల నిధులు తరలిపోవడం రూపాయి విలువ పడిపోవడానికి ఓ కారణమన్నారు. చైనా, మెక్సికో, కెనడా దేశాలపై ట్రంప్ సుంకాల పెంపు పరిణామాల నేపథ్యంలో తుహిన్ కాంత పాండే స్పందించారు. భారత ప్రభుత్వం దిగుమతులపై సుంకాలు పెంచి ఎల్లప్పుడూ ఇండియన్ కంపెనీలకు అండగా ఉంటుందని భావించొద్దని తుహిన్ కాంత పాండే అన్నారు. బడ్జెట్‌లో చాలా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించామన్నారు.

బాధ వున్నా అమెరికన్లూ భరించాల్సిందే

● టారిఫ్ చర్యలపై ట్రంప్ వ్యాఖ్యలు ● మరిన్ని దిగుమతి సుంకాలు వుంటాయని హెచ్చరిక



పామ్ బీచ్ : కెనడా, మెక్సికో, చైనాలపై తాను విధించిన అదనపు టారిఫ్‌ల వల్ల తలెత్తిన వాణిజ్య యుద్ధంతో అమెరికన్లకు కొంచెం బాధ కలుగుతుందని, కానీ వారు ఆ భారాన్ని మోయక తప్పదని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. 'బాధ వుంటే వుండొచ్చు, కానీ అమెరికాను మళ్ళీ మహత్తర దేశంగా మేం తీర్చి దిద్దుతాం. చెల్లించాల్సిన ధరకు ఇది పూర్తి విలువను కలిగి వుంటుంది. అని ట్రంప్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య మిగులు లేకుండా కెనడా ఉనికిలో వుండబోదని వ్యాఖ్యానించారు. మంగళవారం నుండే ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఆ మూడు దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ ట్రంప్ తీసుకున్న చర్యలతో దశాబ్దాలుగా ఉత్తర అమెరికాలో సాగుతున్న వాణిజ్య బంధాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. తీవ్రమైన ఆగ్రహావేశాలు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. చైనాతో సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఇంకా తీవ్రమైన దిగుమతి సుంకాలు విధించే అవకాశం వుందని హెచ్చరించారు. యురోపియన్ యూనియన్‌పై కచ్చితంగా దిగుమతి సుంకాలు వుంటాయని, బ్రిటన్‌తో కూడా వుండే అవకాశం లేకపోలేదని ఆయన విలేకర్లతో అన్నారు. కెనడా నుండి ప్రతీకార చర్యలు ఎదురయ్యే అవకాశాలను తోసిపుచ్చారు. "వారు ఆట ఆడాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. వారు కావాలనుకునే ఆటలన్నింటినీ మేం ఆడగలం." అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఫ్లోరిడా నుండి వాషింగ్టన్‌కు తిరిగి వచ్చిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, టారిఫ్‌లను ఎత్తివేయడానికి గానూ కెనడా, మెక్సికోలతో వాణిజ్య అసమాతనలను కూడా తుడిచిపెట్టాల్సిన అవసరం వుందని అన్నారు. తాజాగా తాను తీసుకున్న చర్యల వల్ల తలెత్తే ద్రవ్యోల్బణం గురించి వివరణ ఇస్తూ, స్వల్ప కాల వ్యవధిలో మనకు కొంత బాధ వుండొచ్చు, కానీ ప్రజలు దాన్ని అర్థం చేసుకుంటారు, కానీ, దీర్ఘకాలంలో అమెరికాను దాదాపు ప్రపంచంలోని ప్రతీ దేశమూ మోసగించిందని ఆయన ...11లో

మోడీ బడ్జెట్ ప్రజల కోసం కాదు..

కేంద్రం రాష్టానికి అన్యాయం చేసినా బాబు మౌనం..జనం కోసం పోరాడేది ఎర్రజెండానే

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

పార్టీ 27వ మహాసభ సందర్భంగా నెల్లూరులో భారీ ర్యాలీ, బహిరంగసభ

నెల్లూరు : మనువాద, కార్పొరేట్ బీజేపీని ప్రతిఘటించేది. జనం కోసం పోరాడేది ఎర్రజెండానేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ చెప్పారు. బీజేపీపై పోరాటంలో ఇతర వామపక్షాలతో పాటు, ప్రజాతంత్ర శక్తులను సమీకరిస్తామని, ఉద్యమ బలోపేతానికి ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక, ధనికుల అనుకూలమని, అటువంటి వంచక బడ్జెట్‌ను నిరసించాలని కోరారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మోడీ సర్కార్ అన్యాయం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకుండా నోరు మూసుకున్నారన్నారు. మూడు రోజులుగా ఇక్కడ జరుగుతున్న



సీపీఐ(ఎం) 27వ ఏపీ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని చివరి రోజు సోమవారం నెల్లూరు నగరంలో భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించారు. ర్యాలీ ఆత్మకూర్ బస్టాండ్ నుంచి సభా ప్రాంగణం విఆర్ కాలేజి గ్రౌండ్ వరకు సాగింది. విఆర్‌సి గ్రౌండ్‌కు మల్లు స్వరాజ్యం ప్రాంగణంగా నామకరణ చేశారు. సీపీఐ(ఎం) నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షత వహించిన సభలో బృందా కరత్ ప్రసంగిస్తూ... మనువాద, కార్పొరేట్ బీజేపీ విధానాలు రాజ్యాంగ విలువలను భక్షిస్తున్నాయి. మైనార్టీల లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. అమాయక ముస్లిం యువకులను టార్గెట్ చేస్తున్నాయి. సమాజాన్ని చీల్చి విద్వేషాలు రగిలిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాపై నడుస్తోంది. బీజేపీ సర్కార్ భుజానేసుకొని ప్రచారం చేస్తున్న కుంభ మేళా ...2లో

సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు

50 మందితో నూతన కమిటీ

15 మందితో కార్యదర్శివర్గం

వివరాలు 2లో

విద్యార్థులపై అభ్యంతరాల భారం

ప్రాథమిక 'కీ'లో సందేహాలకు ఫీజు కట్టాల్సిందే...

ఒక్కో ప్రశ్నకు రూ.500 ఫీజు వసూలు

తొలిసారిగా ప్రవేశ పరీక్షలకు అమలు

ఉన్నత విద్యామండలి నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల ప్రాథమిక కీపై అభ్యంతరాలు చెప్పాలంటే ఇక నుంచి ఫీజు కట్టాల్సిందే. లేదంటే ఆ అభ్యంతరాలను ప్రభుత్వం స్వీకరించబోదు. ఇప్పటి వరకు ఉచితంగా ఉన్న ఈ పద్ధతిని మార్చాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై భారం మోపేందుకు సిద్ధమైంది. ప్రాథమిక కీపై అభ్యంతరం చెప్పాలంటే ఒక్కో ప్రశ్నకు రూ.500 ఫీజు వసూలు చేయనుంది. అంటే ఒక విద్యార్థి రెండు ప్రశ్నలకు అభ్యంతరాలు పంపిస్తే రూ.వెయ్యి చెల్లించాలి. ఐదు ప్రశ్నలకు రూ.2,500, పది ప్రశ్నలకు అభ్యంతరాలుంటే రూ.ఐదు వేలు కట్టాల్సి ఉంటుంది. ఇలా విద్యార్థులపై అభ్యంతరాల పేరుతో ఉన్నత విద్యామండలి భారం మోపనుంది. ఒకవేళ ఫీజు చెల్లించకుంటే వాటిని స్వీకరించబోరు. ఎన్ని ప్రశ్నలకు అభ్యంతరాలుంటే అంత సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ), జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) వంటి పరీక్షల్లో ప్రశ్నాపత్రంపై సవాల్ చేస్తే ఒక్కో ప్రశ్నకు రూ.200 వసూలు చేస్తున్నారు. కానీ రాష్ట్రంలో ఒక్కో ప్రశ్నకు రూ.500 ఫీజుగా నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది.

పోటీ పరీక్షలకు వర్తించే ప్రమాదం

ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలుంటే ప్రస్తుతం ఒక్కో ప్రశ్నకు రూ.500 వసూలు చేయాలన్న నిర్ణయం ప్రవేశ పరీక్షలకే ఉన్నత విద్యామండలి వర్తింపజేసింది. రాష్ట్రంలో తొలిసారిగా అమలుచేయాలని నిర్ణయం తీసుకున్నది. ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్, ...10లో

20న ఎప్‌సెట్ నోటిఫికేషన్

25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

సమర్పణకు తుది గడువు ఏప్రిల్ 4

ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు రాతపరీక్షలు

షెడ్యూల్ విడుదల

వివరాలు 11లో

నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

ఉభయసభల్లో కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చ

10 గంటలకు క్యాబినెట్, 11 గంటలకు శాసనసభ, మండలి భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై మంగళవారం శాసనసభ, శాసనమండలిలో చర్చించనున్నారు. ఇందుకోసం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రత్యేకంగా భేటీ కానున్నాయి. అంతకు ముందు ఉదయం 10 గంటలకు క్యాబినెట్ సమావేశమై కులగణన, ఎస్సీ వర్గీకరణపై ...11లో



రాష్టానికి రైల్వే బడ్జెట్ కేటాయింపులు

రూ.5,337 కోట్లు

కవచ్ 4.0 కోసం ట్రయల్స్

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల కోసం 2025-26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో రూ.5,337 కోట్లు కేటాయించినట్టు రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధిక కేటాయింపు ఇదేనని వివరించారు. సోమవారంనాడాయన ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల రైల్వే ఉన్నతాధికారులతో వర్చువల్‌లో మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఇతర సీనియర్ అధికారులు ...11లో

ఏదీ పింఛన్..?

2019 నుంచి కొత్త దరఖాస్తులకు లభించని మోక్షం

● మంజూరుపై తేల్చని గత ప్రభుత్వం ● ఇప్పుడూ అదే నిరీక్షణ?

● ఆసరా కోసం అభాగ్యుల ఎదురుచూపులు ● కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపైనే ఆశలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ గ్రామానికి చెందిన ఈమె పేరు బొజ్జ ముత్తమ్మ. ఈమె భర్త నాలుగేండ్ల కిందట చనిపోయారు. 2019లో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అధికారులు పింఛన్ మంజూరు జాబితాలో చేర్చారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయని కారణంగా ఈమెకు ఇప్పటి వరకు ఆసరా పింఛన్ రావడం లేదు. ఇలాంటి వారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లు గీత, బీడీ కార్మికులకు ప్రతి నెలా పింఛన్లు అందజేస్తోంది. గత ప్రభుత్వ హయాం నుంచి వికలాంగులకు రూ.3వేలు అందించగా.. మిగతా అందరికీ రూ.2వేల చొప్పున అందజేస్తోంది. వీటితో కనీస అవసరాలు తీర్చుకునేందుకు కొంత అవకాశం లభిస్తోంది. కానీ కొత్తగా దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పింఛన్‌దారులకు ప్రభుత్వం మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఫలితంగా వారికి ఆర్థికంగా ఎలాంటి ఆసరా లభించక అవస్థలు పడాల్సి వస్తోంది. చిన్న చిన్న అవసరాలు కూడా తీర్చులేని పరిస్థితి కనిపిస్తోంది. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పింఛన్ మంజూరులో జాప్యం జరగ్గా.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వీటిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోవడం లేదు. ఫలితంగా అర్హులైన అనేక మంది ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 43.12 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇంకా 25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 20లక్షలు ఉంటే..



ఇప్పుడు మరో 5లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఆదిలాబాద్ జిల్లాలో 74,159మందికి పింఛన్ అందుతోంది. కొత్తగా మరో 4168మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఎక్కువ మంది వితంతువులే ఉన్నారు. అప్పటి ప్రభుత్వం పింఛన్ వయసును 57సంవత్సరాలకే కుదించడంతో అనేక మంది దరఖాస్తులు అందించారు. కానీ అప్పటి ప్రభుత్వం కొత్త వాటిని మంజూరు చేయలేదు. 2019 నుంచి దరఖాస్తులు చేసిన ఎవరికీ పింఛన్లు మంజూరు కాకపోవడంతో ఐదేండ్లుగా ఎదురు చూస్తున్నారు. వీరి పేర్లు మంజూరు జాబితాలో ఉన్నప్పటికీ నిధులు విడుదల చేయకపోవడం మూలంగా లబ్దిదారుల చేతికి అందడం లేదు. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన వారితోపాటు వికలాంగత్వం కారణంగా ఏ పనీ చేయలేని వారు, భర్తలు చనిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వితంతవులు, ఏ తోడూ లేని ఒంటరి మహిళలు ఇలా అనేక మంది ఆర్థిక భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం నెలకు రూ.2వేలు అయినా వస్తే దీర్ఘకాలిక వ్యాధులకు మందుల కొనుగోలు, వంట సామగ్రి, పిల్లల చదువులకు కొంత ఆసరాగా ఉంటుంది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేయడం.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఎవరిని అడిగినా.. ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని సమాధానం చెబుతున్నారని పలువురు ...11లో

హామీ అమలు ఎప్పుడు?

ఐదేండ్లుగా కొత్త పింఛన్ల మంజూరు నిలిచిపోవడంతో వేలాది మంది అభాగ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క చేయూత పథకం కింద పింఛన్లను రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీనిచ్చింది. కానీ సర్కారు ఏర్పడి ఏడాది గడిచినా వీటిపై నిర్ణయం తీసుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పింఛన్ డబ్బులు పెరుగుతాయని వేలాది మంది లబ్దిదారులు ఆశతో ఉన్నారు.

మోడీ బడ్జెట్ ప్రజల కోసం కాదు..



(మొదటిపేజీ తరువాయి)

తొక్కిసలాటలో జనం చనిపోయారు. ఆర్ఎస్ఎస్ అంటే... రాష్ట్రీయ సర్వనాశన్ సమితి. ఫాసిస్టు ఆర్ఎస్ఎస్, దాని హిందూత్వ భావజాలానికనుగుణంగా పని చేసే బీజేపీని నికరంగా ముందుండి వ్యతిరేకించేది సీపీఐ(ఎం), కమ్యూనిస్టులే. కొన్ని పార్టీలు బీజేపీని పైకి తిడుతూ వెనుక చేతులు కలుపుతున్నారు. మేం అలా కాదు. ప్రతికూల పరిస్థితులున్నా, ఒడుదుడుకులు ఎదురైనా బీజేపీపై పోరాడే విషయంలో ఎర్ర జెండా వెనకడుగు వేయదు...

ధనికులకు అనుకూలం

మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ ధనికులకు అనుకూలం, ప్రజలకు వ్యతిరేకమని బృందా కరత్ అన్నారు... ప్రజల సంక్షేమానికి బడ్జెట్‌లో ఏమీ లేదు. అన్నీ కోతలే. లక్ష కోట్లకు పైగా నిధులు తగ్గించారు. స్కీం వర్కర్లకు, కార్మికుల సంక్షేమానికి, ఉపాధి హామీకి ఒక్క రూపాయి అదనంగా ఇవ్వలేదు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోరుతూ ఒక వైపు రైతులు ఆందోళన చేస్తుండగా ఒక్క రూపాయి కూడా అందుకు కేటాయించలేదు. ఇదే సమయంలో ధనికులపై ఒక్క రూపాయి పన్ను పెంచలేదు. అదానీ, అంబానీలను బడ్జెట్ ప్రోత్సహిస్తోంది. ధనికులపై పన్నులేసి ప్రజలకు ఖర్చు చేయమని మేం అడుగుతున్నాం. ఆర్థిక సర్వేలో ప్రజల స్థితిగతులు దిగజారుతున్నాయని తేలింది. నిరుద్యోగం పెరుగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. ప్రజల జేబుల్లో డబ్బుల్లేవు. ఈ విషయంపై మోడీ ప్రభుత్వానికి కనీస స్పృహ లేదు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలు నిరసించాలి...

బాబు నోటిని కట్టేసుకున్నారు

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసినా, నిధులు కేటాయించకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు కట్టేసుకున్నారని బృందా కరత్ అన్నారు... బాబు ఢిల్లీ ఎందుకు వెళ్లినట్లు? ప్రత్యేక హెూదా కోసమా, పోలవరం నిధుల కోసమా, విభజన హామీలు అడిగారా, విశాఖ ఉక్కుపై మాట్లాడారా? తమపై కేసులు, స్వప్రయోజనాల కోసం కేంద్రాన్ని ఒక్క మాట అడగలేదు. పెదాలకు ఫెవికాల్ రాసుకున్నారు. చంద్రబాబు అంటే సిగ్గులేని బాబు... అని బృందా కరత్ విమర్శించారు.

సుందరయ్య పురిటిగడ్డ

నెల్లూరు పోరాటాల నేల అని, పుచ్చలపల్లి సుందరయ్య పురిటిగడ్డ అని చెప్పారు. తాను యువ నాయకురాలుగా నెల్లూరులో డాక్టర్ల బృందంతో పర్యటించానని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఎర్రజెండా నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా, కష్ట జీవుల తరపున పోరాటాలు జరిగాయని, ఎందరో త్యాగాలు చేశారని, ఉద్యమంలో అమరులయ్యారని, రెడ్‌సెల్యూట్ అని అన్నారు. పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వి శ్రీనివాసరావుకు సభా సమక్షంలో విప్లవాభినందనలు తెలిపారు. తొలుత తెలుగులో 'సోదర సోదరీ మణులారా... ' అని ప్రసంగాన్ని ప్రారంభించి సభికులను ఉత్సాహపరిచారు. బహిరంగసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, ఎస్ పుణ్యవతి, కె హేమలత, ఆర్ అరుణ్ కుమార్, బి వెంకట్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మహాసభ ఆహ్వానసంఘం నుంచి వితపు బాల సుబ్రమణ్యం, మాదాల వెంకటేశ్వర్లు, చంద్ర రాజగోపాల్, డాక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యామ్నాయ ప్రణాళికను నాయకులు విడుదల చేశారు. సీపీఐ(ఎం)ఏపీ సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య స్వగ్రామం దామరమడుగు నుంచి తెచ్చిన అమర జ్యోతిని నాయకులు అందుకున్నారు. మహాసభ ప్రారంభానికి ముందు ప్రజా కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు.

రోడ్డు ప్రమాదంలో చేవెళ్ల ఎమ్మెల్యే గన్‌మెన్ మృతి

- శంకర్‌పల్లి మండలంలో ఘటన
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50వేల సాయం

నవతెలంగాణ-శంకర్‌పల్లి


(ఫైల్)


రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గన్‌మెన్ శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన శంకర్‌పల్లి మండల పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బుల్కాపూర్ గ్రామానికి చెందిన ముత్తంగి శ్రీనివాస్(28) వికారాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేశారు. ప్రస్తుతం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గన్‌మెన్‌గా ఉన్నారు. ఆదివారం రాత్రి కొండకల్ గ్రామం నుంచి వెలిమెలకు బైక్‌పై వెళ్తుండగా.. వెలిమెల తండా గ్రామ శివారు వద్ద అకస్మాత్తుగా అడవి పంది రోడ్డుకు అడ్డంగా వచ్చింది. శ్రీనివాస్ బైక్‌ను అడవి పంది ఢీకొట్టడంతో అతను కిందపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాస్ మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే నివాళి

ఎమ్మెల్యే కాలే యాదయ్య సోమవారం ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ మృతదేహానికి నివాళి అర్పించారు. శ్రీనివాస్ తన వద్ద నాలుగేండ్ల నుంచి పని చేస్తున్నాడని ఎమ్మెల్యే చెప్పారు. అందరితో సన్నిహితంగా ఉంటూ తన డ్యూటీ తాను చేసుకునేవాడని, శ్రీనివాస్ మృతి చాలా బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కుటుంబానికి తక్షణ సాయంగా రూ.50వేలు అందజేశారు.

ఆ హంతకులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లాలో జనవరి 30న దళిత యువతిపై అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడి హత్య చేయటం దుర్మార్గమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆ కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయోధ్య జిల్లాకు చెందిన 22 ఏండ్ల యువతి భజన కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటన వెలుగులోకొచ్చిందని తెలిపారు. యువతిని తాళ్లతో కట్టేసి దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె కనుగుడ్లు పీకి చేతులు విరిచి దుర్మార్గంగా ప్రవర్తించారని తెలిపారు. స్థానిక ఎంపీ అవదేశ్ ప్రసాద్ కూతుళ్ళను రక్షించలేక పోతున్నామంటూ భావోద్వేగానికి గురై పదవికి రాజీనామా చేస్తానని అన్నారంటే ఘటన తీవ్రతను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు, బాలికలకు భద్రత లేక క్షణక్షణం భయం భయంగా బ్రతుకుతున్నారని పేర్కొన్నారు. స్త్రీలకు రక్షణ కల్పించలేని యూపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనీ, హత్యకు కారకులైన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని

ప్రాణాలు తీస్తున్న కులదురహంకారం

నీరుగారుతున్న చట్టాలు

ప్రేమ పెండ్లిండ్లకు అడ్డుగోడగా కులం మతం

కొనసాగుతున్న అంటరానితనం

ఒకరినొకరు ప్రేమించుకుని ఇష్టపడి పెండ్లి చేసుకునే సమయంలో కులం, మతం అడ్డుగోడగా నిలుస్తోంది. అయినప్పటికీ వాటిని ఎదిరించి పెండ్లి చేసుకున్న తర్వాత వారిని కులదురహంకార హత్యలు వెంటాడుతున్నాయి. కుల వ్యవస్థ నిర్మూలించాలని, అంటరానితనం రూపుమాపాలని పోరాడి సాధించుకున్న చట్టాలు నీరుగారుతున్నాయి. ఇప్పటికీ మెజార్టీ ప్రాంతాల్లో నిచ్చెనమెట్ల వ్యవస్థ, రెండు గ్లాసుల పద్ధతి, గుళ్లోకి రానివ్వకపోవడం లాంటి దురాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. టెక్నాలజీ పెరుగుతున్నా ఈ వివక్ష మాత్రం ఉంటూనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ వీటి నియంత్రణ జరగడం లేదు. ఈ క్రమంలో ప్రేమ వివాహాలు చేసుకుంటున్న జంటల విషయంలో కుల చిచ్చు రేగి హత్యలకు దారితీస్తోంది.



నవతెలంగాణ-సూర్యాపేట

కొన్ని సంవత్సరాల కిందట మిర్యాలగూడలో జరిగిన ప్రణయ్ హత్యోదంతం తర్వాత సూర్యాపేట జిల్లాలో మరోటి జరిగింది. గత నెల 26న అర్ధరాత్రి వడ్లకొండ కృష్ణ అలియాస్ బంటిని దారుణంగా హత్య చేయడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉలిక్కిపడింది. దళిత సామాజిక తరగతికి చెందిన బంటి, బీసీ సామాజిక తరగతికి చెందిన భార్గవి ఆరు నెలలు కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టం లేని భార్గవి తండ్రి, నాయనమ్మ, అన్నలు కక్ష కట్టి పథకం ప్రకారం హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్యను పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

జిల్లాలో నెలకు రెండు, మూడు ప్రేమ వివాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ పలు చోట్ల కులాంతర, మతాంతర వివాహాలు జరుగుతున్నాయి. కొందరు తల్లిదండ్రులు అంగీకరిస్తుండగా, మరికొందరు విభేదిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబీకులు ఒప్పుకోని జంటలు ఇతర ప్రాంతాల్లోనో, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనో పెండ్లి చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ఈ ప్రేమ జంటలను విడగొట్టి కూతురు లేక కుమారుడిని తమ చెంతకు తెచ్చుకుంటున్నారు. వినని పక్షంలో హత్యలకు దిగుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2000 సంవత్సరంలో కులాంతర వివాహం చేసుకున్న ఓ గిరిజన యువకుడిని పట్టణ వ్యాపారి కక్షగట్టి హత్య చేసిన సంఘటన తెలిసిందే. పోలీసులు కేసును ఛేదించారు. అయినప్పటికీ కేసు నిలబడలేదు. ధన ప్రవాహంలో నిర్వీర్యమైంది. 2012లో తమ కుమార్తెను ప్రేమించాడని ఓ వ్యక్తి యువకున్ని హత్య చేశారు. ఈ కేసు విషయంలో పోలీసు ఉన్నతాధికారి కూడా బదిలీ అయ్యారు. అదేవిధంగా ఒక నగల వ్యాపారి కూతురు విషయంలో కూడా బెదిరింపులు ఎదురయ్యాయి. అబ్బాయిపై పోలీసులతో ఒత్తిడి చేయించారు. అయినా యువతి యువకుడి వైపు ఉండటంతో ఒత్తిడులు పనిచేయలేదు. రెండు సంవత్సరాల కిందట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్‌లో అదృశ్యమై అనుమానాస్పదంగా మృతిచెందిన దరావత్ నిఖిల్ కేసు నేటికీ మిస్టరీగానే మిగిలింది. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. కొన్ని కేసులు అంతర్గతంగానే రాజీ చేసుకొని బయటకి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన కులదురహంకార హత్యలు, సంఘటనలు చూసిన కొన్ని ప్రేమ జంటలు పెద్దలను ఎదిరించి వివాహాలు చేసుకోవడానికి భయపడుతున్నాయి. ప్రధానంగా కేసుల నమోదులో సెక్షన్లు పటిష్టంగా ఉండకపోవడంతో ఇరు గ్రూపులు స్టేషన్ బయట రాజీ చేసుకుంటున్నాయి. ఇలాంటి కేసులు పోలీస్ స్టేషన్లలో



నిత్యకృత్యంగా మారాయి.

కుల దురహంకార వ్యవస్థ నిర్మూలన కోసం "అంబేద్కర్" చూపిన బాటల్లో సీపీఐ(ఎం), కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో దాదాపుగా 50 మంది జంటలకు పైగా కులాంతర, మతాంతర వివాహాలు జరిపించారు. కులం, మతం అనేవి మనుషులు పెట్టుకున్న కట్టుబాట్లని, అవి ప్రేమ పెండ్లికి అడ్డుకాదని ఆ సంఘ నాయకులు తెలిపారు. తమ ఆధ్వర్యంలో వివాహాలు చేసుకున్న జంటలు పిల్లాపాపలతో ఎంతో అన్యోన్యంగా సంతోషంగా ఉంటున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా, వారి తల్లిదండ్రులు కూడా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.

కుల వివక్ష నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి



అంబేద్కర్ ఆశించిన కుల వివక్ష నిర్మూలన అమలుకు నోచుకోవడం లేదు. కులం, మతం నేడు ప్రేమికులకు అడ్డుగోడలుగా మారాయి. దీంతో హత్యలు పెరుగుతున్నాయి. చట్టాలు నీరు కారుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కులాంతర వివాహాలకు బలం చేకూర్చేందుకు ప్రత్యేక చట్టాలు రావాలి. హత్యలకు పాల్పడినవారిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలి. ప్రేమ జంటలకు రక్షణ కల్పించాలి. ఇప్పటికే కేవీపీఎస్ ఆధ్వర్యంలో 50కి పైగా కులాంతర, మతాంతర వివాహాలు జరిపించాం. నేడు వారంతా సంతోషంగా ఉన్నారు. నేటి తరానికి అనుగుణంగా పెద్దలు ఆచారాలను పక్కకు పెట్టి ప్రేమ పెళ్లిలను ఆశీర్వదించాలి, ఆదరించాలి.

ఎక్సైజ్‌కు మంత్రి ఉన్నడు

ఎడ్యుకేషన్‌కు మంత్రి అవసరం లేదా?



- ఆ శాఖ సీఎం వద్దే ఉన్నా పర్యవేక్షణ సున్నా..!
- గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు
- పెంచిన మెస్‌చార్జీలు సరిగా అమలు కాని వైనం
- పెండింగ్‌లోనే స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్
- విద్యా కాషాయీకరణ దిశగా బీజేపీ అడుగులు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు
- అట్టహాసంగా ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా 18వ మహాసభ ప్రారంభం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'మార్పు కోసం రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే.. ఆ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. మద్యం అమ్మకాల కోసం పక్కా ప్రణాళికలు రూపొందిస్తూ ఎక్సైజ్ శాఖకు మంత్రిని నియమించి మరీ ఆదాయం గడిస్తున్న ప్రభుత్వం భావితరాలను అందించే విద్యాశాఖకు మంత్రి అవసరం లేదా? రాష్ట్రంలో వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదు. మెస్‌చార్జీలు పెంచామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారు. ఇంకోవైపు కేంద్రంలో బీజేపీ సర్కారు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా విద్య కాషాయీకరణ చేసే దిశగా అడుగులు వేస్తోంది' అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంఘం కరీంనగర్ జిల్లా 18వ మహాసభ సోమవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. ఉదయం నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి కళాభారతి వరకు విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాభారతి భవన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తాళ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించకుండా, ఆ శాఖను తన దగ్గరే పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికే పాఠశాల విద్య మొదలుకుని ఉన్నత విద్య వరకూ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు టీసీ, ఇతర సర్టిఫికెట్లు కోసం ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు వేధిస్తున్నాయని, వాళ్లను ప్రశ్నిస్తే నిధులు రాకుండా తాము కాలేజీలు ఎలా నిర్వహించేదంటూ బదులిస్తున్నారని అన్నారు. ఈ విషయమై గతంలోనే ప్రయివేటు కాలేజీల బంద్‌కు పిలుపునిస్తే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడతలవారీగా పెండింగ్‌లోని రూ.8200కోట్లు నిధులు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చారని, కానీ వాటి సంగతే మరిచిపోయారని అన్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాలో ఓ విద్యార్థి పీజీ కోర్సులో చేరేందుకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలిసిందేనన్నారు. బకాయిలు రానందున మరికొద్ది రోజుల్లో కాలేజీలు బంద్‌కు సిద్ధమవుతున్నాయని, ఇదే కొనసాగితే భవిష్యత్‌లో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అయి 50 మంది విద్యార్థులు చనిపోయారని, ఎంతోమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. మెస్‌చార్జీలు పెంచామని చెబుతున్న ప్రభుత్వం ఈ మరణాలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జైల్లో ఉండే ఖైదీకి రోజుకు రూ.87.30పైసలు ఇస్తుంటే విద్యార్థులకు మాత్రం రూ.57.30మాత్రమే ఇస్తోందని వివరించారు.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలను అవలం బిస్తూ విద్యా కాషాయికరణను ప్రోత్సహిస్తూ మతకల్లోలాలు సృష్టిస్తోందన్నారు. నూతనంగా తీసుకొస్తున్న యూనివర్సిటీలలో మార్గదర్శకాలను రద్దు చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలున్నాయని వివరించారు. కనీసం కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించక పోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ జిల్లా మహాసభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు అభిలాష్, రోహిత్, ఈశక్, సహాయ కార్యదర్శులు బోగేశ్, శ్రీజ, నాయకులు రాజు, సన్నీ, రిషికేశ్, ఆకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగని 'మంచు' పంచాయితీ..!

- రంగారెడ్డి కలెక్టరేట్‌కు తండ్రీకొడుకులు
- ఇరువురిని విచారించిన అదనపు కలెక్టర్
- కొడుకుగా తండ్రి ఆస్తిలో వాటా వస్తుందని మనోజ్ వాదన
- మనోజ్‌తో ప్రాణ భయం ఉంది.. రక్షణ కల్పించాలని మోహన్‌బాబు వేడుకోలు
- మేజిస్ట్రేట్ ఎదుటే తండ్రీకొడుకుల వాగ్వివాదం?
- ఆవేశం వద్దు.. కూర్చోని మాట్లాడుకోవాలని సర్దిచెప్పిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి



సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ పంచాయితీ ఇప్పట్లో తెగేలా కనిపించడం లేదు. ఆస్తి విషయంలో తండ్రీకొడుకులకు గొడవలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. వీరి కేసు విచారణ నేపథ్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు తండ్రీకొడుకులు రావడంతో వీరి కుటుంబ వ్యవహారం మరోసారి తెర మీదికి వచ్చింది. వీరిని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ విచారించారు. గత నెలలో మోహన్‌బాబు వయో వృద్ధుల చట్టం కింద జిల్లా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. మోహన్‌బాబు ఫిర్యాదు దృష్ట్యా జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి.. మోహన్‌బాబు కుమారుడు మంచు మనోజ్‌కు నోటీసులు ఇచ్చారు. కలెక్టర్ నోటీసులు అందుకున్న మనోజ్.. జనవరి 18న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. ఈ క్రమంలో మనోజ్ వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని అడిగారు. అతను అడిగిన సమయం ముగియడంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రెండోసారి మంచు కుటుంబ సభ్యులు విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో తండ్రి, కొడుకు ఇద్దరూ వేర్వేరు వాహనాల్లో తమ న్యాయవాదులతో కలిసి రంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. ఇరువురిని మొదట విడివిడిగా విచారించారు. తరువాత ఇద్దరిని కుర్చోపెట్టి సుమారు రెండు గంటల పాటు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఇరువురు కలెక్టర్ ఎదుటే వాగ్వాదానికి దిగినట్టు విశ్వసనీయ సమాచారం. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా.. విన్పించుకోకపోవడంతో రక్షణ కోసం పోలీసులను లోపలికి పిలిపించారు. 'ఇండ్లు, ఇతర ఆస్తులన్నీ నా కష్టార్జితం. వాటి నుంచి ఖాళీ చేయించాల్సిందే' అంటూ మోహన్‌బాబు విచారణ అధికారి ఎదుట పట్టుబట్టగా, కొడుకు మనోజ్ ఇందుకు నిరాకరించినట్టు తెలిసింది. కూర్చొని మాట్లాడుకోవాలని, నాన్నకు ఇండ్లు ఒక్కటే కాదని, చాలా ఆస్తులు ఉన్నాయని, వారసత్వంగా తనకు ఆస్తిలో వాటా ఉందని, విద్యా సంస్థల్లో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించినందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, తాను ఏనాడు కూడా నాన్నపై చేయి చేసుకోలేదని మనోజ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. 'అతను నా కొడుకే కాదు.. అతని నుంచి నాకు ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పించండి' అంటూ మోహన్ బాబు మేజిస్ట్రేట్‌కు విన్నవించినట్టు సమాచారం. ఇదిలా ఉంటే పలు ఆస్తులకు సంబంధించిన దస్తావేజులను మనోజ్ విచార.ణాధికారికి అందజేశారు. అనంతరం తండ్రి మోహన్‌బాబు వెనుక వైపు నుంచి వెళ్లిపోగా, కుమారుడు మనోజ్ ముందు వైపు నుంచి ఆవేశంగా బయటికి వెళ్లిపోయాడు. ఇది ఉంటే విచారణ జరుగుతున్న సమయంలో మీడియా సహా ఇతర వ్యక్తులను అటు వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం గమనార్హం. మరో పది రోజుల్లో మూడో విచారణ నిర్వహిస్తామని, ఇరువురు మళ్లీ హాజరు కావాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వారికి సూచించినట్టు తెలిసింది.



సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు

- 50 మందితో నూతన కమిటీ
- 15 మందితో కార్యదర్శివర్గం

నెల్లూరు : సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఇక్కడ జరుగుతున్న పార్టీ 27వ రాష్ట్ర మహాసభ చివరి రోజు సోమవారంనాడు 50 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. నూతన రాష్ట్ర కమిటీ సమావేశమై వి.శ్రీనివాసరావును కార్యదర్శిగాను, 15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. వి.శ్రీనివాసరావు కార్యదర్శిగా ఎన్నిక కావడం వరుసగా ఇది రెండోసారి. కార్యదర్శివర్గంలోకి ఈసారి కొత్తగా ఇద్దరు ఎన్నికయ్యారు. ఏప్రిల్ 2 నుంచి 6 వరకూ తమిళనాడులోని మదురైలో జరగనున్న పార్టీ 24వ అఖిల భారత మహాసభకు రాష్ట్రం నుంచి 22 మంది ప్రతినిధులను, ఐదుగురు ప్రత్యామ్నాయ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శివర్గం :

01. వి.శ్రీనివాసరావు
02. వై.వెంకటేశ్వరరావు
03. సిహెచ్.బాబూరావు
04. కె.ప్రభాకరరెడ్డి
05. డి.రమాదేవి
06. బి.తులసీదాస్
07. వి.వెంకటేశ్వర్లు
08. కె.లోకనాథం
09. మూలం రమేష్
10. కె.సుబ్బరావమ్మ
11. కిల్లో సురేంద్ర
12. వి.రాంభూపాల్
13. వి.ఉమామహేశ్వరరావు
14. బి.బలరాం
15. ఎవి నాగేశ్వరరావు

ఆహ్వానితులు :

జి.చంద్రశేఖర్
వి.నాగరాజు
జివి కొండారెడ్డి
ఎం.హరిబాబు
జి.రామన్న
ఎస్.అర్జున్
యువి రామరాజు

ప్రత్యేక ఆహ్వానితులు :

పి.మధు
సిహెచ్ నర్సింగరావు
బిఆర్.తులసీరావు
వి.బాలసుబ్రహ్మణ్యం
పిన్నమనేని మురళీకృష్ణ

కంట్రోల్ కమిషన్ :

మంతెన సీతారాం (ఛైర్మెన్)
వి.లక్ష్మి (విజయనగరం)
ఎస్ వెంకటేష్ (రాష్ట్ర కేంద్రం)
బి.గంగారావు (విశాఖపట్నం)
లోతా రామారావు (ఎఎస్ఆర్ రంపచోడవరం)

రాష్ట్రకమిటీ :

16. వి.కృష్ణయ్య
17. దడాల సుబ్బారావు
18. జె.జయరాం
19. కె.ధనలక్ష్మి
20. ఆంద్ర మాలాద్రి
21. యం.సూర్యారావు
22. వై.అచ్యుతరావు
23. లక్ష్మణరావు
24. కె.హరికిషోర్
25. ప్రసాద్
26. కె.ఉమామహేశ్వరరావు
27. కె.శ్రీదేవి
28. యం.జగ్గునాయుడు (విశాఖపట్నం)
29. పి.అప్పలనర్స (అల్లూరి జిల్లా)
30. ఎ.రవి (ఏలూరు)
31. వై.నర్సింహారావు (కృష్ణా)
32. డివి కృష్ణ (ఎన్‌టిఆర్)
33. డి.కాశీనాథ్ (ఎన్‌టిఆర్)
34. జి.విజయ్ కుమార్ (పల్నాడు)
35. డి.గౌస్ దేశాయ్ (కర్నూలు)
36. పి.నిర్మల (కర్నూలు)
37. టి.రమేష్ కుమార్ (నంద్యాల)
38. యం.భాస్కరయ్య (రాష్ట్ర కేంద్రం)
39. ఎ.అశోక్ (రాష్ట్ర కేంద్రం)
40. బి.కిరణ్ (ఎఎస్ఆర్ రంపచోడవరం)
41. వి.సావిత్రి (అనంతపురం)
42. కె.గంగునాయుడు (పార్వతీపురం మన్యం)
43. బి.పద్మ (విశాఖపట్నం)
44. జి.కోటేశ్వరరావు (అనకాపల్లి)
45. జెఎన్‌వి.గోపాలన్ (పశ్చిమ గోదావరి)
46. మొడియం నాగమణి (ఏలూరు)
47. వై.నేతాజీ (గుంటూరు)
48. ఎస్‌కె మాబు (ప్రకాశం)
49. ఒ.నల్లప్ప (అనంతపురం)
50. కో ఆష్షన్ (నెల్లూరు)

ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెన్షన్

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయునితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదులు రావడంతో సదరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఎం.కిషన్‌రావు, ఇద్దరు ఉపాధ్యాయులు ఎ.మనోహర్‌రెడ్డి, ఎ.మోహన్‌రావును సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని, ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.



శ్రామికులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

ఖమ్మం ఆందోళనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ సిటీబ్యూరో/ విలేకరులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా.. శ్రామిక, బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రూ.55.60లక్షల కోట్లకు పైగా రూపొందించిన బడ్జెట్‌లో రూ.12లక్షల కోట్లు కేవలం వడ్డీ చెల్లించడానికే పోతాయని తెలిపారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం సీపీఐ(ఎం) దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, బడ్జెట్ ప్రతులను దహనం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం, మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కోట్లాది మంది ఉపాధి కూలీలు పొట్టగడవడానికి నిధులు కేటాయించాలని రూ.2 లక్షల కోట్లు అడిగితే రూ.85 వేల కోట్లకు దాన్ని పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక, అసంఘటిత రంగాలకు నిధులు కేటాయించలేదన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి కావాల్సిన ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్‌లో లేవన్నారు. వ్యవసాయ సబ్సిడీలకు కోత పెట్టారని, ఎరువుల రాయితీలో రూ.11వేల కోట్లు కోతపెట్టారని తెలిపారు. శ్రామికులు, దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. 16 శాతంగా ఉన్న దళిత జనాభాకు 5శాతం, 7శాతంగా ఉన్న గిరిజనులకు 2శాతం నిధులు కూడా కేటాయించలేదని చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి కేవలం రూ.3వేల కోట్ల నిధులనే పరిమితం చేశారన్నారు. విద్యావైద్యానికి కలిపి 25శాతం నిధులు కావాలని కోరుతుంటే దాన్ని 4 శాతానికే పరిమితం చేసి వాటిని వ్యాపారమయంగా మార్చేందుకు పూనుకుంటున్నారని అన్నారు. సంక్షేమ పథకాలన్నింటినీ కుదించి వేసిందని, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే సంక్షేమ పథకాలకూ నిధులే కేటాయించటం లేదని విమర్శించారు. తెలంగాణ పై కేంద్రం బడ్జెట్‌లో వివక్ష చూపిందని అన్నారు. రాష్ట్ర విభజన ఒప్పందాలకు ఎలాంటి చర్యలు తీసుకో లేదన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో లైన్‌కు నిధులు కేటాయించలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదని అన్నారు. పార్టీలకు అతీతంగా కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించాలన్నారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రం నుంచి 8 మంది, వారిలో ఇద్దరు మంత్రులున్నా రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ఎలాంటి ప్రయత్నం జరగలేదన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పున:సమీక్షించి తెలంగాణకు ఇవ్వాల్సిన నిధులను కేటాయించాలని తెలిపారు. సరైన కేటాయింపులు జరిగే వరకు ఆందోళన, పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, మల్లులక్ష్మి, జహంగీర్, నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మధిరలో పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం సెంటర్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఎర్రుపా లెంలోని రింగ్ సెంటర్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బూర్గం పాడులో వ్యవసా య కార్మిక సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. మణుగూరు, టేకులపల్లి, ఇల్లందులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులు దహనం చేశారు.

హైదరాబాద్‌లో..



సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, రైతులకు, కార్మికులకు, పేద ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉందన్నారు. బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐలు తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు తక్షణమే నిధులు తెస్తారా లేక రాజీనామా చేస్తారా ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా కార్పొరేట్ సంస్థలను కాపాడే విధంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కమిటీ చైర్మెన్ డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడి పోరాటాలు కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయం మీద సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తెలంగాణ బంద్ నిర్వహించి ఢిల్లీలోని మోడీ ప్రభుత్వం కండ్లు తెరిపించాలన్నారు.నిజామాబాద్, బోధన్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన చేపట్టారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్, చండూరు, వేములపల్లి, తిప్పర్తి మండలకేంద్రాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గరిడేపల్లి మండలం వెలిదండ బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కాటేదాన్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కందుకూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నిర్మల్‌లో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి

రెండు రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం స్పష్టత

సాధ్యమైతే సీఎంల స్థాయిలో పరిష్కరించుకోవాలి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపీ, తెలంగాణ మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ అంశాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తే సమస్యలు మరింత జటిలమై ఆలస్యమవుతుందని సూచించింది. రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం కేంద్ర హెూం శాఖ సెక్రెటరీ గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక భేటీ జరిగింది. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ భేటీలో.. కీలకంగా విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో ప్రధానంగా అప్పులు, ఆస్తులపై సవివరంగా చర్చ చేసినట్టు సమాచారం. అయితే.. ఈ రెండు షెడ్యూల్‌లకు సంబంధించిన 20 సంస్థల నిధుల పంపకంపై సానుకూలంగా ఉండాలని కేంద్రం సూచించింది. వీటిపై రెండు రాష్ట్రాలు సానుకూల వాతావరణంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్ర హెూం శాఖ సెక్రెటరీ సూచించారు.

విదేశీ అప్పుల పంపకంపై చర్చ

విదేశీ అప్పుల పంపకంపై రెండు రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం సూచనలు చేసింది. ఈ అప్పులపై న్యాయసలహాతో ముందుకెళ్లాలని దిశా నిర్దేశం చేసింది. ఇందుకు ఇరు రాష్ట్రాలు అంగీకారం చెబుతూనే అడ్వకేట్ జనరల్‌తో (ఏజీ)లతో చర్చించి, అభిప్రాయం తీసుకుంటామని బదులిచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఏజీ అభిప్రాయాల తర్వాత మరోసారి భేటీ అయి, నిర్ణయం తీసుకుందామని కేంద్ర సెక్రెటరీ చెప్పారని తెలిసింది.

ఆరు గ్యారంటీల అమలుకు మరో ఉద్యమం

రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి స్థాయి అమలుకు డిమాండ్



(మొదటిపేజీ తరువాయి)

వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలులో మొండిచేయి చూపిస్తున్నదని అన్నారు. ఎటువంటి షరతులతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి రూ.12 వేలు తక్షణమే ఇవ్వాలని కోరారు. గ్రామస్థాయిలో దరఖాస్తులు తీసుకొని, అమలుకు వచ్చే సరికి ఉపాధి హామీ పనికి లింకు చేయడాన్ని ఖండించారు. ఉపాధిహామీ పనులతో సంబంధం లేకుండా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాలు, మున్సిపల్ ఏరియాల్లో భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. 'ఏరు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఏరు దాటాక బోడ మల్లయ్య' అన్న చందంగా కాంగ్రెస్ తీరుందని విమర్శించారు. గత ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాల అమలులో ఇదే తీరున వ్యవహరించి ఓటమి చవిచూసిందని గుర్తు చేశారు. రైతు భరోసా ద్వారా ఎకరానికి ఇస్తామన్న రూ.15 వేల వాగ్దానం నిలబెట్టుకోవాలని కోరారు. రెండు పడకల గదులను లబ్దిదారులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయలేదన్నారు. అయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ మొక్కుబడిగా కార్యక్రమాలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీ ధోరణి, అలసత్వం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపైన పోరాటానికి ముందుకు రావాలని, దీనికి సీపీఐ(ఎం) పూర్తిగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, మల్లు లక్ష్మి, నున్నా నాగేశ్వరరావు, జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లాల కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, ఎం.సుధాకర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు మోకు కనకారెడ్డి, సాదుల శ్రీనివాస్, బంధు సాయిలు, బీరెడ్డి సాంబశివ, జి.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాన్‌వెస్లీ.. రాష్ట్ర కార్యదర్శివర్గానికి ఘనస్వాగతం

సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీతో పాటు రాష్ట్ర నూతన కార్యదర్శి వర్గానికి సీపీఐ(ఎం) ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, మల్లు లక్ష్మి, అబ్బాస్, జహంగీర్‌తో పాటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉభయ జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ యర్రా శ్రీనివాస్, మాదినేని రమేష్, భూక్యా వీరభద్రం తదితరులు స్వాగతించారు. ప్రజాసంఘాల నేతలు సైతం రాష్ట్ర కమిటీ నేతలకు ఘన స్వాగతం పలికారు.



వెల్లివిరిసిన మత సామరస్యం

కుంభమేళాలో ముస్లింల సేవలు



ప్రయాగ్‌రాజ్ : దేశంలో కుల, మత రాజకీయాలు విషం చిమ్ముతున్న వేళ.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో మత సామరస్యం వెల్లివిరిసింది. పుణ్య స్నానాల కోసం కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తుండగా అక్కడి యోగి సర్కార్ ఏర్పాటు చేసిన(మరుగుదొడ్లు, ఇతర) సహాయక కార్యక్రమాలు ఆశించిన మేర సరిపోవడం లేదు. దీంతో ఇది ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలోనే అక్కడి ముస్లింలు ముందుకొచ్చి సాయమందిస్తున్నారు. సుదూర ప్రాంతాలనుంచి కుంభమేళాకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగడానికి గుక్కెడు నీళ్లు ఎవరిస్తారా..? అని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కాలకృత్యాలు తీర్చుకోవటం పెద్ద సమస్యగా మారింది. ఇక మహిళల అవస్థలైతే చెప్పలేనివి. ఇవన్నీ గుర్తించిన ప్రయాగ్‌రాజ్‌లోని ముస్లింలు.. తామున్నామంటూ ముందుకొచ్చారు. తమ వంతు సహాయ సహకారాలందిస్తున్నారు.

సాధారణంగా హిందూ ఆలయాల్లో ముస్లింలను అనుమతించరు. కానీ ఇక్కడ సీన్ మరోలా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన కార్యక్రమం జరుగుతుంటే.. సర్కారు అందించే సేవలు మాత్రం అంతంతగానే ఉండడంతో ముస్లింలు .. మసీదుల్లో, తమ ఇండ్లల్లో హిందు భక్తులకు ఆశ్రయమిస్తున్నారు. శీతాకాలం కావటం... మంచుకురుస్తుండడంతో పిల్లలు, మహిళలు వణికిపోతున్నారు. కాస్తంతా చోటు దొరికితే చాలు అనుకుంటున్న భక్తులకు.. తమ స్థోమతకు తగ్గట్టు ముస్లింలు వసతి సౌకర్యం కల్పించడంతో పాటు భోజనాలు, దుప్పట్లు, కంబలి ఇలా ఏది ఉంటే అది ఇచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. వీరి ఆతిథ్యానికి భక్తులు పులకరించిపోతున్నారు. దేశమంతటా మతరాజకీయాల చిచ్చు పెడుతున్నా.. మాకు ఇంతలా సేవలందిస్తారని ఊహించలేదని పలువురు భక్తులు పేర్కొనటం గమనార్హం. అక్కడ ముస్లింలు అందిస్తున్న ఈ సేవలను స్థానిక కార్పొరేట్ మీడియా మరుగునబెడితే.. బీబీసీ, ఇతర అంతర్జాతీయ మీడియా హైలెట్ చేయటం విశేషం.



మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్‌కు షాక్


ఆడియో క్లిప్స్‌లోని వాయిస్.. ఆయన గొంతు 93 శాతం సరిపోలుతున్నాయి

సుప్రీంకోర్టుకు 'ట్రూత్ ల్యాబ్' నివేదిక

మూడువారాల సమయమివ్వండి

న్యాయస్థానాన్ని కోరిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అంగీకరించిన కోర్టు.. సీల్డ్ కవర్‌లో సీఎఫ్ఎస్ఎల్ నివేదిక అందించాలని ఆదేశం



న్యూఢిల్లీ : మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్‌కు షాక్ తగిలింది. రాష్ట్రంలో నెలకొన్న జాతి హింసలో ఆయన పాత్రకు సంబంధించి కొన్ని ఆడియో క్లిప్స్ ఇప్పటికే బయటకు వచ్చాయి. హింసను ప్రేరేపించేలా అందులో ఆయన మాట్లాడారని ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఈ ఆడియో క్లిప్స్, బీరెన్ సింగ్ స్వర నమూనాలు 93 శాతం మ్యాచ్ అయ్యాయని ప్రయివేటు ఫోరెన్సిక్ ల్యాబోరేటరీ అయిన 'ట్రూత్ ల్యాబ్' వివరించింది. ఆ రెండూ ఒకే గొంతు అనటానికి 'అధిక అవకాశం' ఉన్నదని పేర్కొన్నది. ఈ మేరకు దీనికి సంబంధించి సుప్రీంకోర్టుకు నివేదిక అందింది. జ్యుడిషియల్ కమిషన్‌కు సమర్పించిన క్లిప్‌లలో బీరెన్‌సింగ్‌కు చెందినదిగా చెప్పబడుతున్న గొంతు ప్రామాణికతను ధృవీకరించటానికి ఈ ప్రయివేటు ల్యాబ్ పని చేసింది. జాతిహింసలో బీరెన్‌సింగ్ పాత్రను ఈ ఆడియో క్లిప్స్ బయటకు తీసుకొచ్చాయి. మణిపూర్‌లో ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులే ఉన్నాయి. రాష్ట్రంలో చోటు చేసుకున్న జాతి హింసలో వంద మందికి పైగా మరణించారు. చాలా మంది గాయపడ్డారు. దాదాపు 70 వేల మంది కుకీ, మెయిటీ కమ్యూనిటీలకు చెందినవారు తరలించబడ్డారు. బీరెన్‌సింగ్‌కు చెందిన అధికారిక ప్రాంతాల నుంచే తాము వీటిని రికార్డు చేసినట్టు ఆడియో రికార్డింగ్‌లను అందించినవారు తెలిపారు. దీనికి సంబంధించి ఒక కాపీని మణిపూర్ హింసపై ఏర్పాటైన జ్యుడిషియల్ కమిషన్ చైర్‌పర్సన్ రిటైర్డ్ జస్టిస్ అజయ్ లంబాకు అందించామని చెప్పారు. ఈ కమిటీని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ గతేడాది మే, 3న ఏర్పాటు చేసింది. దీని తర్వాతే, ఆడియో టేప్ విషయంలో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తును కోరుతూ కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (కేఓహెచ్‌యూఆర్) సుప్రీం కోర్టును ఆశ్రయిం చింది. దీంతో ఆడియో టేప్‌లోని గొంతు ప్రామాణ కతను వెరిఫై చేసి, కోర్టుకు నివేదిక సమర్పించాలని గతేడాది నవంబర్ 8న పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పిటిషనర్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్ తరఫున న్యాయవాది అయిన ప్రశాంత్ భూషన్ ట్రూత్ ల్యాబ్ సేవలను కోరారు. దీంతో ట్రూత్ ల్యాబ్ సర్టిఫికేషన్ నివేదిక కాపీని అటాచ్ చేస్తూ ప్రశాంత్ భూషన్ గతనెల 22న సుప్రీంకోర్టులో సప్లిమెంటరీ అఫిడవిట్‌ను దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణను కోర్టు సోమవారం చేపట్టింది.

ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్-ఎల్) ద్వారా ఆడియో టేప్‌ను వెరిఫై చేయించటానికి మూడువారాల సమయం కావాలని మణిపూర్, కేంద్ర ప్రభుత్వాల తరఫున కోర్టు ముందు హాజరైన సొలిసిటర్ జనరల్(ఎస్‌జీ) మెహతా న్యాయస్థానాన్ని కోరారు. ఇందుకు సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లు ఓకే చెప్పారు. సీఎఫ్ఎస్ఎల్ రిపోర్టును మూడువారాల్లోగా సమర్పించాలని ఆదేశించారు. తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేశారు.

ట్రూత్ ల్యాబ్‌కు విశ్వసనీయత ఎక్కువ : ప్రశాంత్ భూషణ్

ప్రభుత్వ ల్యాబొరేటరీ కన్నా.. ట్రూత్ ల్యాబ్‌కు విశ్వసనీయత ఎక్కు అని ప్రశాంత్ భూషన్ అన్నారు.సీబీఐ వంటి ప్రభుత్వ ఏజెన్సీలతో పాటు సీఎఫ్ఎస్ఎల్ కూడా వెరిఫికేషన్ పని కోసం ట్రూత్ ల్యాబ్‌ను ఆశ్రయిస్తాయని చెప్పారు. ట్రూత్ ల్యాబ్.. సుప్రీంకోర్టు మాజీ సీజేఐ ఎం.ఎన్. వెంకటాచలయ్య చైర్మెన్‌షిప్‌లో ఏర్పాటు చేయబడిందని వివరించారు. సుప్రీంకోర్టు గతంలో ట్రూత్ ల్యాబ్ ఇచ్చిన పలు నివేదికలను ఆమోదించిందని ఆయన గుర్తు చేశారు.

గ్రూప్ 1 ఫలితాలకు లైన్ క్లియర్

ఈ సమయంలో జోక్యం చేసుకోలేం : పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో గ్రూప్ 1 ఫలితాలకు లైన్ క్లియరైంది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంతో న్యాయపరంగా ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. జీవో-29ని రద్దు చేయాలని కోరుతూ బి.శృతి, పి.రాంబాబు, మంజుల, సుధాకర్‌లతో పాటు పలువురు గత నెల 22న సుప్రీంకోర్టు తలుపుతట్టారు. ఇందుకు సంబంధించి స్పెషల్ లీవ్ పిటిషన్లు(సివిల్) దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై సోమవారం జస్టిస్ పామిడిఘంటమ్ శ్రీ నరసింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి, మోహిత్ రావు, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత ఆదిత్య సోంధి, మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో వేలాది మంది విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని బెంచ్‌కు నివేదించారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థులు కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్-రిజర్వుడుగానే పరిగణిస్తుండటంతో దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని అభ్యర్థించారు. అందువల్ల జీవో 29ని రద్దు చేయాలని, గ్రూప్ -1 పరీక్షలను మరోసారి నిర్వహించాలని కోరారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకొని ధర్మాసనం.. ఈ సమయంలో గ్రూప్-1 అంశంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది.



ఢిల్లీలో ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో హోరాహోరీగా సాగిన శాసనసభ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. 70 స్థానాలున్న అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం జరిగే పోలింగ్‌లో 1.56 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. వీరిలో 83.76 లక్షల మంది పురుషులు కాగా 72.36 లక్షల మంది మహిళలు, 1,267 మంది ఇతరులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో అధికార అమ్‌ఆద్మీ, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు జరుగు తోంది. ఒపీనియన్ పోల్స్, పలు సర్వేలు మాత్రం అమ్‌ఆద్మీ పార్టీకే మరోసారి విజయం చేకూరుతుందని అంచనా వేశాయి. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని అమ్‌ఆద్మీ పార్టీ 2015, 2020 ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ గెలుపు కోసం ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు బీజేపీ గత 27 సంవత్సరాలుగా అధికారానికి దూరంగానే ఉంటోంది. 2015లో 67, 2020లో 62 శాసనసభ స్థానాలు గెలుచుకున్న ఆప్ ఈసారి కూడా అదే దూకుడు ప్రదర్శించగలమన్న ధీమాతో ఉంది. గత ఎన్నికల్లో బీజేపీ కేవలం ఎనిమిది సీట్లతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఒకప్పుడు దేశ రాజధానిలో అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్‌కు ఓటర్లు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. 2015 ఎన్నికల్లో బీజేపీకి కేవలం మూడు స్థానాలు మాత్రమే దక్కాయి. కాగా ఢిల్లీ శాసనసభ ఎన్నికలతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్, తమిళనాడులోని ఎరోడ్ (ఈస్ట్) అసెంబ్లీ స్థానాలకు కూడా బుధవారమే పోలింగ్ జరుగుతుంది. ప్రచారానికి చివరి రోజున ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సంయుక్తంగా కల్కా జీ శాసనసభ స్థానంలో రోడ్‌షో నిర్వహించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పార్టీ అభ్యర్థికి మద్దతుగా జంగ్‌పురాలో ఇంటింటి ప్రచారం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో మధ్య తరగతి ఓటర్లే కీలకం కాబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పేదలు, మధ్య తరగతి ప్రజానీకంపై వరాల జల్లులు కురిపించాయి. ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకుంటామని, కనీసం ఒక్క అసెంబ్లీ స్థానాన్ని అయినా గెలుస్తామని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఆదాయపన్ను రాయితీలు తమకు ఓట్ల వర్షం కురిపిస్తాయని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా నిర్వహించిన ఓ ఒపీనియన్ పోల్ ప్రకారం ఢిల్లీలో అమ్‌ఆద్మీ పార్టీ మరోసారి విజయం సాధించబోతోంది. ఆప్‌కు 37-40, బీజేపీకి 20-25, కాంగ్రెస్‌కు 0-2 స్థానాలు లభిస్తాయని దాని అంచనా. ఇటీవల నిర్వహించిన సీ-ఓటర్ సర్వే ప్రకారం 51 శాతం ఓట్లతో ఆప్ స్పష్టమైన ఆధిక్యత సాధించబోతోంది. నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ దళిత్ అండ్ ఆదివాసీ ఆర్గనైజేషన్స్ కేవలం దళిత ఓటర్లను దృష్టిలో పెట్టుకొని సర్వే జరిపింది. దీని ప్రకారం దళితులు 35 స్థానాల్లో ఆప్‌కు, 28 స్థానాల్లో బీజేపీకి, 7 స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. ఆప్‌కు 44 శాతం, బీజేపీకి 32 శాతం, కాంగ్రెస్‌కు 21 శాతం మంది దళితులు ఓటు వేయాలని భావిస్తున్నారు. ఫాలోడీ సత్తా బజార్ సర్వే కూడా ఆప్ వైపే మొగ్గు చూపింది. ఆప్‌కు 39-41, బీజేపీ 29-31 స్థానాలు వస్తాయని అది అంచనా వేసింది.

సంపాదకీయం

కేంద్ర పద్దుపై పోరు



ఏదైనా ఒక పని మంచిదా? కాదా? అని బేరీజు వేయాల్సి వచ్చినప్పుడు అది అత్యధిక మందికి మేలు చేస్తే మంచిదని చెబుతుంటారు పెద్దలు. ఆ రకంగా చూస్తే 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర విత్తమంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ మనదేశంలో అసంఖ్యాకంగా ఉన్న కార్మికులు, కష్టజీవులు, కర్షకులు, పేదలకు ఉపయోగపడేదిగా లేదని పెదవి విరుస్తున్నారు ఆర్థిక విశ్లేషకులు. పద్దులోని కేటాయింపులను బట్టి ఇది ఫక్తు ఎన్నికలు జరగబోయే ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉందే తప్ప మొత్తం దేశానికి, తెలంగాణకు ఎంతమాత్రమూ ప్రయోజనకరంగా లేదన్నది నిర్వివాదాంశం. అంకెల గారడీ, కాకిలెక్కలు అని సాధారణంగా విమర్శలు చేయకుండా లోతుగా పరిశీలిస్తే ఈ బడ్జెట్ ఎవరికోసమనేది తేలుతుంది. జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)ని పెంచాలన్న సదుద్దేశంలో పన్ను మినహాయింపు లిచ్చామంటూ మంత్రి సూత్రీకరించారు. కానీ జీడీపీ పెరగాలంటే పన్ను మినహాయింపు లివ్వటం కాదు.. దేశంలో అట్టడుగునున్న కార్మికుల కనీస వేతన స్థాయి పెరగాలి, అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు, వృత్తిదారులు, రైతుల ఆదాయాలు పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్న మౌలిక సూత్రాన్ని కేంద్రం విస్మరించటం దాని ఆర్థిక విధానాలకు నిదర్శనం. ఈ సూత్రానికి విరుద్ధంగా కార్పొరేట్, ప్రయివేటు పెట్టుబడులను ఇంకా ప్రోత్సహించటం ద్వారా సంపన్నులు మరింత సంపన్నులుగా, శతకోటీశ్వరులు మరింత శతకోటీశ్వరులుగా మారేందుకు సర్కారు ఊతమిస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తూ అంతో ఇంతో వారి పొట్ట నింపుతున్న 'నరేగా'కు ఎక్కువ నిధులు కేటాయించాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా కేవలం రూ.86 వేల కోట్లే ఇచ్చి చేతులు దులుపుకోవటం పేదల పట్ల మోడీ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధికి ప్రత్యక్ష ఉదాహరణ. దేశ స్వయం సమృద్ధిలో ఇప్పటి వరకూ కీలక పాత్ర పోషించిన ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నూటికి నూరు శాతం ఆహ్వానించటం ద్వారా ఆ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్‌కు ధారాదత్తం చేశారు. ఆర్థిక మాంద్యం గురించి సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో దాన్నుంచి గట్టెక్కేందుకు తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయాలను ఆర్థిక మంత్రి విస్మరించారు. అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు కేంద్రం నిర్దిష్ట చర్యలను ప్రకటించకపోవటంతో పేదలు, మధ్యతరగతిపై మరిన్ని భారాలు పడనున్నాయి.

> ఇక మన రాష్ట్రానికి ఈ బడ్జెట్‌ను అన్వయించి చూసుకుంటే... ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు దక్కింది గుండుసున్నా. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల కోసం రూ. 1.63 లక్షల కోట్ల సాయం చేయాలంటూ రేవంత్ సర్కారు... కేంద్రాన్ని కోరుతూ వస్తోంది. వాటిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా వెక్కిరించటం 'బడేభాయ్'కే చెల్లింది. వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ఇచ్చే నిధులను ఆరేండ్ల నుంచి తొక్కిపట్టిన కేంద్రం... ఈసారి కూడా వాటికి కేటాయింపులు చేయకుండా 'సారీ' చెప్పింది.

ఇక మన రాష్ట్రానికి ఈ బడ్జెట్‌ను అన్వయించి చూసుకుంటే... ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు దక్కింది గుండుసున్నా. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల కోసం రూ. 1.63 లక్షల కోట్ల సాయం చేయాలంటూ రేవంత్ సర్కారు... కేంద్రాన్ని కోరుతూ వస్తోంది. వాటిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా వెక్కిరించటం 'బడేభాయ్'కే చెల్లింది. వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ఇచ్చే నిధులను ఆరేండ్ల నుంచి తొక్కిపట్టిన కేంద్రం... ఈసారి కూడా వాటికి కేటాయింపులు చేయకుండా 'సారీ' చెప్పింది. తన ప్రసంగాల్లో ప్రతీసారి 'మిత్రోన్...' అంటూ సంబోధించే ప్రధాని మోడీ, తెలంగాణను మాత్రం తన మిత్రుల జాబితాలో చేర్చుకోలేదు. అందుకే కాబోలు... పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించి, తెలంగాణకు 'గాడిద గుడ్డు'ను ఇచ్చారు. తెలంగాణ కంటే ముందు ఏర్పడిన రాష్ట్రాలను పరిశీలిస్తే...వాటికి సంబంధించిన ఏ ఒక్క విభజన హామీలను నెరవేర్చలేదంటూ సీపీఐ(ఎం) ఏనాడో హెచ్చరించింది. అదే కత ఇప్పుడు మన రాష్ట్రం విషయంలో నిజమైంది. విభజన హామీల్లో ఏ ఒక్కదాన్నీ అమలు చేయని కేంద్రం... ఇప్పుడు వాటిని పూర్తిగా అటకెక్కించింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాపై బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్క ముక్క లేకపోవటం గమనార్హం. కాకపోతే ఈ పద్దులో మోడీ సర్కార్... అన్ని రాష్ట్రాలతోపాటు తెలంగాణకు కూడా 'ఓ బంపర్ ఆఫర్' ఇచ్చింది. విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తే ఎఫ్ఆర్‌బీఎమ్ చట్టం కింద మరో 0.5 శాతం అప్పులిస్తామంటూ రాష్ట్రాలకు ఆశపెట్టారు. ఈ ఆశకు మనం అర్రులు చాస్తే గతంలో వినిపించిన 'మోటార్లకు మీటర్లు' అనే పదాన్ని మళ్లీ వినాల్సి వస్తుంది. అదే జరిగితే తెలంగాణ వ్యవసాయం కుదేలవుతుంది. తన రాజకీయ ప్రయోజనాలరీత్యా అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి విద్యుత్ సంస్కరణలను అమలు చేయబోమని ప్రకటించింది. అందువల్ల అత్యంత ప్రమాదకరమైన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను నేటి కాంగ్రెస్ సర్కారు సైతం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయని కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) ఇప్పటికే నిరసనలు చేపట్టింది. అధికార కాంగ్రెస్ గళమెత్తి, ఆందోళనలకు పిలుపునివ్వటం హర్షణీయం. అయితే ఇక్కడితో ఆగిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం తన పోరాటాన్ని హస్తిన దాకా కొనసాగించాలి. అన్ని పార్టీలనూ కలుపుకుని ఢిల్లీని 'ఢీ' కొట్టాలి.

మెయిల్ @ నవతెలంగాణ

బంజార భాషకు గుర్తింపేది?

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఒకవైపు ప్రపంచీకరణ, సరళీకృత, ఆర్థిక విధానాలు, మరోవైపు సామ్రాజ్యవాద సంస్కృతి తాకిడికి బలవుతున్న మాతృభాషల ఉనికే లేకుండా పోతున్నది. భారత దేశంలో గల ప్రాచీన భాషల్లో బంజారభాష ఒకటి. ఈ భాషకు లిపి లేని కారణంగా నిర్లక్ష్యానికి గురవుతూ అంతరించిపోయే దశలో ఉన్నది. ఈరోజు ఆంగ్లం నేడు అంతర్జాతీయంగా రూపాంతరం చెందుతున్నది. అవసరమే కానీ, మాతృభాషపై రోజురోజుకూ మమకారం తగ్గుతున్నది. ఆంగ్లభాషపై పట్టు సాధించుకునే క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. కనుమరుగయ్యే భాషల్లో బంజారాలు మాట్లాడే గోర్-బోలి భాష కూడా ఒకటి. లంబాడీ (గిరిజన) భాషకు నేటికీ గుర్తింపు లేదు, లిపి లేదు. వీరు మాట్లాడే భాషలు మౌఖికంగా నోటికే పరిమితమవడం మూలాన అత్యంత నిరాధారణకు గురవుతున్నది.



పర్యవసానంగా లంబాడీ (బంజారా) తెగల ప్రత్యేక సాంస్కృతిక సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది.

భారత రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్‌లో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన పది కోట్ల మంది జనాభా వుంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికి 22 భాషలు అధికారికంగా గుర్తించబడగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, డోంగ్రీ, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటుదక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, లాంటి రాష్ట్రాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజారాలు దాదాపుగా 18 కోట్ల జనాభా కలిగి దేశంలో హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్ బోలిని మాట్లాడుతున్నారు. కానీ అతి పెద్ద సమూహం ఉన్న లంబాడీ భాషకు రాజ్యాంగబద్ధ గుర్తింపు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నవి. ప్రస్తుతం బంజారాలు భాష ద్వారానే సంస్కృతీ, సాంప్రదాయాలు, ఆచారాలతో తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. కానీ పాలక వర్గాలు బంజారాలతో పాటు కొన్ని రకాల తెగల భాషలకు లిపి లేదన్న సాకుతోనే ఇతర భాష లను వారిపై రుద్దడం వల్ల వారు విద్యకు, సమగ్రాభివృద్ధికి దూరమవుతున్నారు.

1956లో హైదరాబాద్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు బలవంతంగా రుద్దబడిందనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్‌విఎం)ద్వారా బంజార భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి ఆయా భాషాసంబంధ బోధకులను కూడా నియమించింది. ఇలా కొంత ప్రయత్నం చేసినా, కాని కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పనిచేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్-బోలిని భాషను చేర్చలన్నా ఈ డిమాండ్ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండీ ఉంది. భాషను బతికించుకోవడానికి బంజారాలు వివిధ రూపాల్లో పోరాడుతున్నా సమస్య పరిష్కారానికి నోచలేదు. బంజారా తెగ గుర్తింపు పరిరక్షణకు కీలకమైనది గోర్-బోలి భాష. అది భాష మాత్రమే కాదు అది బంజారాలకు ఆత్మవంటిది. ఒక జాతి ఎప్పుడు అయితే తన భాషను పరంపరలో మరచిపోతుందో, తదనంతర కాలంలో భాషతో పాటు జాతి కూడా అంతరించిపోతుంది.

స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా బంజారాల భాష పట్ల పాలకులు తగిన శ్రద్ధ వహించడం లేదనేది బంజారాల భాషను చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటికైనా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 344(1), 351 ప్రకారం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గోర్-బోలి భాషను చేర్చాల్సిన అవసరం ఉన్నది. కనుమరుగవుతున్న భాషకు తగిన ప్రోత్సాహమిచ్చి దాన్ని బతికించాలని బంజారాలు కోరుతున్నారు.

- జటావత్ హనుము, 8519836308

కేంద్రీకరణ వల్ల ప్రమాదాలు



ప్రభాత్ పట్నాయక్

ఆధునిక భారతదేశంలో ప్రజల మనస్సుల్లో రెండురకాల జాతీయ చైతన్యం ఉంటుందని, అందులో ఒకటి భాషా- ప్రాంతీయ జాతీయత-అంటే ఒక బెంగాలీగానో, తమిళుడిగానో, ఒక గుజరాతీగానో, ఒక ఒడియాగానో-రెండవది యావత్ భారతదేశానికీ చెందిన భారత జాతీయతగా ఉంటాయని ప్రముఖ మార్క్సిస్టు పండితుడు లేటు అమలేందు గుహ ఎవ్వరూ కాదనలేని విధంగా వాదించారు. ఈ ద్వంద్వ స్వభావాన్ని గుర్తించి, ఆమోదించడం అవసరమని, ఈ రెండింటిలో ఏ ఒక్కదానిపైనో అతిగా నొక్కి రెండవదాన్ని విస్మరిస్తే చాలా ప్రమాదకరంగా ప్రతిస్పందనలు వస్తాయని ఆయన చెప్పాడు. అతిగా కేంద్రీకరణకు పూనుకోవడం అంటే విశాల భారత జాతీయత మీదనే ఎక్కువగా నొక్కడం అవుతుంది. అది దానికి వ్యతిరేకంగా ప్రతిచర్యలకు దారితీస్తుంది. అది ప్రాంతీయ వేర్పాటువాదానికి, ఒక్కోసారి ఈ దేశం నుండే విడగొట్టుకోవాలనే ధోరణికి దారితీసి దేశ సమైక్యతకే ముప్పు తెస్తుంది. ఇందిరాగాంధీ హయాంలో జరిగిన కేంద్రీకరణ-అందులో హిందూత్వ-నయా ఫాసిస్టు లక్షణాలేమీ లేవు-1980లలో అస్సాం వేర్పాటువాదానికి దారితీసిన నేపథ్యంలో అమలేందు గుహ తన వ్యాసాన్ని రచించారు. ఇప్పుడు నయా ఫాసిస్టు కేంద్రీకరణ మన ముందు అత్యంత దిగ్భ్రాంతికర వేగంతో ఆవిష్కరించబడుతున్న నేపథ్యంలో మళ్లీ అటువంటి వేర్పాటువాద ప్రమాదమే దాని వెనుక పొంచివుంది.

ఫాసిజం ఎక్కడ ఏయే ప్రత్యేకతలతో ఉన్నప్పటికీ, అనివార్యంగా కేంద్రీకరణతో ముడిపడి వుంటుంది. నిజానికి నాయకుని పట్ల భక్తితో వ్యవహరించే దాని స్వభావం వలన అధికారం యొక్క మూలాలు తల్లకిందులౌతాయి. మామూలుగా ప్రజాస్వామ్యంలో అధికార మూలాలు ప్రజల దగ్గర మొదలౌతాయి. నాయకులంటే ఆ ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరించేవారుగా ఉంటారు. కాని ఫాసిస్టు పాలన ఉన్నచోట నాయకుడు తానే యావన్మంది ప్రజలకీ ప్రతినిధిని అని ప్రకటించుకుంటాడు. ఇక్కడ ప్రజలు అంటే వాస్తవ ప్రజానీకం కాదు. ఒక ఊహాజనితమైన ఉనికి (అది కూడా మొత్తం ప్రజలలో ఒక భాగం మాత్రమే) కలిగి వుంటారు. అంటే ఇక్కడ హిందువులు లేదా ఇంకొక దేశంలో మెజారిటీ జాతిగా ఉండేవారు ఎవరైనప్పటికీ, ప్రజల్లో కొంతమందిని 'పరాయివారు'గా చిత్రించి వారిని మినహాయించి తక్కిన వారందరికీ ఏకైక ప్రతినిధి నాయకుడే అవుతాడు. ఆ నాయకుడే అధికారానికి మూలమూ, కేంద్రమూ కూడా అవుతాడు. ఈ విధంగా నిజమైన అధికారం ఎక్కడి నుంచి పుట్టుకొస్తుందో, ఆ వాస్తవాన్ని తల్లకిందులు చేసేసిన పుడు అనివార్యంగా అది కేంద్రీకరణ రూపంలో వ్యక్తం అవుతుంది. అందుచేత ఎన్డీయే ప్రభుత్వం ముందెన్నడూ లేని విధంగా చాలా ఎక్కువగా వనరులను, అధికారాన్ని కేంద్రీకరించడం ఆశ్చర్యాన్ని కలిగించదు.

నయా ఉదారవాదంతోబాటే కేంద్రీకరణ కూడా సాగుతుంది. స్వల్ప సంఖ్యలో ఉండే కార్పొరేట్-ఫైనాన్స్ గుత్తాధిపతులు నయా ఉదారవాద వ్యవస్థలో పెత్తనాన్ని చెలాయిస్తారు. తమకు అన్ని విధాలా లొంగివుండే ప్రభుత్వం చేతుల్లో అధికారాలు, వనరులు అన్నీ కేంద్రీకరించబడి వుండాలని వారు కోరుకుంటారు. అయితే కార్పొరేట్-నయా ఫాసిస్టు కూటమి ఏర్పడడంతో, నయా ఉదారవాదం సంక్షోభంలో పడినప్పుడు, ఈ కేంద్రీకరణ క్రమం మరింత ఎక్కువగా బలపడుతుంది.

ఇక్కడ ఎక్కువ వివరాల్లోకి పోనవసరం లేదు. పాత అమ్మకపు పన్ను స్థానంలో ప్రవేశపెట్టిన జీఎస్‌టి వనరుల కేంద్రీక రణకు స్పష్టమైన ఉదాహరణ. రాజ్యాంగంలో ఈ అమ్మకపు పన్ను అనేది రాష్ట్రాలకు ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించబడింది. రాష్ట్రాలకు వచ్చే ఆదాయంలో దాదాపు ఎనభై శాతం అమ్మకపు పన్ను ద్వారానే సమకూరేది. దాని స్థానంలో జీఎస్‌టి విధించినప్పుడు ముందుకు తెచ్చిన వాదనలు బూటకమైనవే అయినా, వాటికి నయా ఉదారవాదం అండ ఉంది. విలువ ఆధారిత పన్ను (వ్యాట్)-ఇదే తర్వాత జీఎస్‌టి అయింది-విధిస్తే అప్పుడు పన్ను మీద పన్ను విధించే పరిస్థితి ఉండదని, అంతేగాక, ప్రతీ వస్తువు మీదా దేశమంతటా ఒకే రేటులో పన్ను విధిస్తే దాని వలన జాతీయ మార్కెట్ అంతా ఐక్యంగా రూపొందుతుందని దీన్ని సమర్థించినవారు వాదించారు. ఇలా దేశమంతటా ఒకే రేటు పన్ను విధించడానికి వేరు వేరు రాష్ట్ర ప్రభుత్వాల నుండి పన్ను విధించే అధికారాన్ని వేరే ఒక సంస్థకు అప్పగించాలని, రాష్ట్ర ప్రభుత్వాలు పన్ను విధించే తమ అధికారాలను ఆ సంస్థకు కట్టబెట్టాలని వారు చెప్పారు. ఆ సంస్థే జీఎస్‌టి కౌన్సిల్. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రాతినిధ్యం కలిగివుంటుంది.

జీఎస్‌టి ని సమర్థిస్తూ చేసిన వాదనలు బూటకం అని చెప్పడానికి అమెరికా ఉదాహరణ చాలు. ప్రపంచంలోని అతి పెద్ద పెట్టుబడిదారీ దేశం అమెరికా. అక్కడ పన్ను రేట్లు రాష్ట్రాలను బట్టి మారుతూ వుంటాయి. అంటే అక్కడ సమాఖ్యతత్వం అమలు అవుతోందన్నమాట. అంతమాత్రాన అమెరికాలో ఏకీకృతమైన మార్కెట్ లేదని ఎవరూ అనలేరు. అలాగే వేర్వేరు రాష్ట్రాలలో వేర్వేరు పన్ను రేట్లు ఉండడం అమెరికా బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఆటంకం కాలేదు.

జీఎస్‌టి అంటే రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాన్ని అవి ఒదులుకోవడమే. అయితే అలా ఒదులుకోడానికి ఒక హామీ ఇచ్చి రాష్ట్రాలను ఒప్పించారు. జీఎస్‌టి అమలు మొదలైన సంవత్సరం నుండి పన్ను ఆదాయంలో ఆ యా రాష్ట్రాలకు కలిగే వృద్ధి గనుక 14 శాతం కన్నా తక్కువ ఉంటే ఆ కొరవను ఐదేండ్లపాటు కేంద్రం భర్తీ చేస్తుందన్నదే ఆ హామీ. నిజానికి జీఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత కాలాన్ని ఆ ముందు కాలంతో పోల్చుకుంటే రాష్ట్ర జీఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) నుండి వచ్చే ఆదాయం, కేంద్రం నుండి వచ్చే నష్ట పరిహారం కలిపి పెరిగిన రేటు కన్నా జీఎస్‌టి ద్వారా వచ్చిన ఆదాయం పెరిగిన రేటు ఎక్కువగా ఉంది. అంటే జీఎస్‌టి వర్తించే సరుకుల మీద పాత విధానం ప్రకారమే రాష్ట్రాలు పన్నులు విధించివుంటే వాటికి ఎక్కువ ఆదాయం లభించి వుండేదన్నమాట. కేంద్రం ఇచ్చే నష్టపరిహారాన్ని కలుపుకున్నా, ఇంకా రాష్ట్రాలు నష్టపోతున్నాయి. అంతకన్నా ముఖ్యంగా రాష్ట్రాలు తమకు రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కును కోల్పోయాయి. ఇప్పుడు కేంద్రం ముందు అడుక్కు తినేవాళ్లుగా మిగిలి పోయాయి. ఫెడరల్ స్వభావానికి ఇది తీవ్ర విఘాతం.

వనరుల కేంద్రీకరణతోబాటు అధికారాల కేంద్రీకరణ కూడా సాగుతోంది. ఇందుకు కేంద్రం నియమించే గవర్నర్లు ఒక సాధనంగా ఉపయోగపడుతున్నారు. నమ్మకమైన హిందూత్వవాదులో, లేకపోతే కేంద్రం చెప్పు చేతల్లో మెలిగే అధికారులో మాత్రమే ఈ మధ్య గవర్నర్లుగా నియమించబడుతున్నారు. దీనిని మొదట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. గవర్నరు పదవి అనేది గౌరవ సూచకమైనదని, నామక: అధికారాలు మాత్రమే ఉంటాయని, ఆ పదవిలో రిటైరైన



> వనరుల కేంద్రీకరణతోబాటు అధికారాల కేంద్రీకరణ కూడా సాగుతోంది. ఇందుకు కేంద్రం నియమించే గవర్నర్లు ఒక సాధనంగా ఉపయోగపడుతున్నారు. నమ్మకమైన హిందూత్వవాదులో, లేకపోతే కేంద్రం చెప్పు చేతల్లో మెలిగే అధికారులో మాత్రమే ఈ మధ్య గవర్నర్లుగా నియమించబడుతున్నారు. దీనిని మొదట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. గవర్నరు పదవి అనేది గౌరవ సూచకమైనదని, నామక: అధికారాలు మాత్రమే ఉంటాయని, ఆ పదవిలో రిటైరైన రాజకీయ నాయకులనో, అధికారులనో నియ మించడం వలన పెద్ద ప్రమాదం ఏమీ లేదని అనుకున్నారు. కాని ఈ మధ్య కాలంలో గవర్నర్లు అన్ని వ్యవహారాల్లో వేలు పెడుతూ ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వపు కార్యకలాపాలకు ఆటంకంగా తయారౌతున్నారు.

రాజకీయ నాయకులనో, అధికారులనో నియ మించడం వలన పెద్ద ప్రమాదం ఏమీ లేదని అనుకున్నారు. కాని ఈ మధ్య కాలంలో గవర్నర్లు అన్ని వ్యవహారాల్లో వేలు పెడుతూ ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వపు కార్యకలాపాలకు ఆటంకంగా తయారౌతున్నారు.

గవర్నర్లు ఈ విధంగా వ్యవహరిస్తున్న ఒక కీలకమైన రంగం విశ్వవిద్యాలయాలు. ఇక్కడ గవర్నర్లు చాన్సలర్లుగా వ్యవహరిస్తారు. అదొక గౌరవపూర్వకమైన హోదాయే. ఆ హోదాలో గవర్నరు వైస్ చాన్సలర్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేస్తారు. కాని ఇప్పుడు వైస్ చాన్సలర్ల నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా గవర్నర్లే తమకు నచ్చినవారిని నియమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌లో అందరూ కేంద్రానికి విశ్వాసంగా మెలిగేవారే ఉంటారు. ఆ సంస్థ ఇటీవల కొన్ని మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది. అవి అమలైతే దేశంలో ఉన్నత విద్య చాలా తీవ్రంగా దెబ్బ తింటుంది. అయితే ఇక్కడ ఒక్క విషయాన్ని మాత్రమే తీసుకుందాం. ఆ మార్గదర్శకాల్లో రాష్ట్రాల యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించడంలో రాష్ట్రాలకు ఏ పాత్రా లేకుండా పోయింది.

> రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా గవర్నర్లు స్వతంత్రంగా వ్యవహరించడం అనేది రాజ్యాంగంలో పేర్కొన్నదానికి, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా పూర్తి విరుద్ధం. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టల్లా వ్యవహరిస్తూ గవర్నర్లు రాజకీయ వ్యవస్థను కేంద్రీకరణ వైపు వేగంగా నెడుతున్నారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం మీద పెత్తనం చెలాయించడం ద్వారా గవర్నర్లు ప్రజల ఆదేశాన్ని తృణీకరిస్తున్నారు. ఎన్నికల ద్వారా నియామకం కాని గవర్నర్ ఎన్నికైన ప్రభుత్వాన్ని, దాని నిర్ణయాలను కాదని స్వతంత్రంగా వ్యవహరించడం అంటే అది ప్రజాస్వామ్యం మీద దాడి అవుతుంది. ఈ విధమైన దాడి కొనసాగితే దానికి ప్రతిచర్యగా వచ్చే పరిణామాలు దేశ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడవేస్తాయి.

ఇంతవరకూ అమలులో ఉన్న పద్ధతి ప్రకారం వైస్ చాన్సలర్‌ను నియమించడానికి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక సెర్చ్ కమిటీని ఏర్పాటు అవుతుంది. ఆ కమిటీలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఇద్దరు ఉంటారు. ఒకర్ని చాన్సలర్, అంటే గవర్నర్ నియమిస్తారు. మామూలుగా అయితే ఈ విషయంలో గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తారు. కాని ఇప్పుడు యుజిసి మార్గదర్శకాల ముసాయిదా ప్రకారం ముగ్గురు సెర్చ్ కమిటీ సభ్యులలో ఒకర్ని యుజిసి, ఒకర్ని గవర్నర్, ఒకర్ని యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియమిస్తారు. గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాల్సిన పనే లేదు. అంటే వైస్ చాన్సలర్ నియామకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్రా లేదు. ఆ యూనివర్సిటీలకు నిధులు మాత్రం రాష్ట్రమే సమకూర్చాలి. వైస్ చాన్సలర్‌ను మాత్రం యుజిసి రూపంలోను, గవర్నర్ రూపంలోను కేంద్రమే నిర్ణయిస్తుంది.

ఉన్నత విద్యా రంగంలో కేంద్రం రాష్ట్రాలమీద పగ సాధిస్తున్న రీతిలో కేంద్రీకరణకు పాల్పడుతోంది.

రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా గవర్నర్లు స్వతంత్రంగా వ్యవహరించడం అనేది రాజ్యాంగంలో పేర్కొన్నదానికి, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా పూర్తి విరుద్ధం. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టల్లా వ్యవహరిస్తూ గవర్నర్లు రాజకీయ వ్యవస్థను కేంద్రీకరణ వైపు వేగంగా నెడుతున్నారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం మీద పెత్తనం చెలాయించడం ద్వారా గవర్నర్లు ప్రజల ఆదేశాన్ని తృణీకరిస్తున్నారు. ఎన్నికల ద్వారా నియామకం కాని గవర్నర్ ఎన్నికైన ప్రభుత్వాన్ని, దాని నిర్ణయాలను కాదని స్వతంత్రంగా వ్యవహరించడం అంటే అది ప్రజాస్వామ్యం మీద దాడి అవుతుంది. ఈ విధమైన దాడి కొనసాగితే దానికి ప్రతిచర్యగా వచ్చే పరిణామాలు దేశ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడవేస్తాయి.

కేంద్రం, రాష్ట్రాల నడుమ వనరులను, అధికారాలను వేరు చేసి వుంచడంలో రాజ్యాంగం చాలా శ్రద్ధ చూపింది. ఒక స్వతంత్రమైన ప్రతిపత్తి ఉన్న ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పరచడం ఈ సమ తూకాన్ని పాటించడం కోసమే. ఆధునిక భారతదేశ ప్రజల ద్వంద్వ జాతీయ చైతన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాటు చేశారు. కేంద్రీకరణ అంటే రాష్ట్ర ప్రభుత్వాలను అణచివేయడం. అంటే భాషా-ప్రాంతీయ చైతన్యానికి విలువనివ్వకుండా నిరాకరించడమే. రాజ్యాంగపు ఈ స్ఫూర్తిని ఉల్లంఘించడం వలన చాలా తీవ్ర పరిణామాలు జరుగుతాయి. కాని ముందుచూపు లోపించిన ఈ కేంద్ర ప్రభుత్వానికి ఆ ప్రమాదాలేవీ కనిపించడం లేదు.

(స్వేచ్ఛానుసరణ)

బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలు ఎవరి కోసం?



జి.తిరుపతయ్య
9951300016

బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) శాతాన్ని 74 శాతం నుండి వందశాతానికి పెంచేం దుకు దేశ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మొన్న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో భాగంగా ప్రతిపాదించారు. అయితే వందశాతం ఎఫ్‌డీఐ అనుమతి కోరే కంపెనీలు తాము వసూలు చేయబోయే ఇన్సూరెన్స్ ప్రీమియంలను భారతదేశంలోనే పెట్టుబడులుగా పెట్టవలసి ఉంటుందని, ఆ నిబంధనను అమలు పరిస్తేనే అనుమతి స్తామని మంత్రి ప్రకటించారు. అతి జాతీయవాదాన్ని దూషణలో వ్యక్తీకరించే వారికి, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై వివిధ దఫాలుగా జరిగిన నిర్ణయాల పట్ల అవగాహన అంతగా లేనివారికి ఈ కండిషన్ (ప్రీమియంలను భారత్‌లో పెట్టుబడులుగా వినియోగించాలన్న) సంతోషాన్ని కలిగించవచ్చు. కానీ 2015లోనే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతాన్ని 26శాతం నుండి 49శాతానికి పెంచినప్పుడే అంతకుముందు నుండే అమల్లో ఉన్న రీపాట్రియేషన్ క్లాజ్ (విదేశీ కంపెనీలు ఆర్జించిన లాభాలను కనీసం మూడేండ్ల వరకు దేశ సరిహద్దులు దాటకుండా ఇక్కడే పెట్టుబడులుగా వినియోగించాలనే నిబంధన)ను తొలగించేశారు. రిపాట్రియేషన్ క్లాజ్ తొలగించిన తర్వాత యథేచ్ఛగా ఎప్పుడైనా కంపనీలు తామర్జించిన సొమ్ములోని మిగులు నిధులను విదేశాలకు తరలించుకుపోయే అవకాశమున్న తర్వాత ప్రీమియంలు మాత్రమే ఈ దేశంలో వినియోగించాలని పెట్టే నిబంధన నామమాత్రమైనదే. ఇన్సూరెన్స్ రంగం దీర్ఘకాలిక కాంట్రాక్టును అమలు పరిచే నమ్మకమైన స్థితిలో ఉండాలి. గనుక ఆ రంగం ప్రభుత్వ రంగంలోనో లేదా దేశీయ భాగస్వాములతోనో కలిసి ఉంటేనేనో మేలు అన్న అభిప్రాయం ఇన్సూరెన్స్ రంగాన్ని 2000 సంవత్సరంలో ప్రయివేటు కంపెనీలకు బార్లా తెరవక ముందు నుండి ఆ తర్వాత కూడా వ్యక్తమవుతూనే ఉన్నది. అందుచేతనే ఉన్నఫలంగా ఎఫ్‌డీఐ లిమిట్‌ను 74శాతం నుండి వంద శాతానికి పెంచితే విమర్శనాస్త్రాలు పెరుగుతా యని తమను తాము కాస్త విమర్శలనుండి రక్షించుకునే ప్రక్రియలో భాగమే బడ్జెట్‌లో ఒక చిన్నమెలిక లాంటి వెసులుబాటును పెట్టుకున్నారు.

భారత ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డిఐలు వందశాతం అనుమతించబడిన తరువాత ఇప్పటి వరకు దేశీయ కంపెనీలతో భాగస్వాములుగా ఉంటూ నడిచిన అనేక కంపెనీలు తమకు తాము వంద శాతం ఎఫ్‌డీఐని తెచ్చుకుని దేశీయ భాగస్వామ్య కంపెనీలను కాలదన్నడం ఖాయం. అంటే ఇకనుండి భారతదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో అన్నీ విదేశీ కంపెనీలే ఉండే అవకాశాలకు ఇది నాంది. ఇదివరకే ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ చట్ట సవరణలలో ఒక బీమా కంపెనీని నెలకొల్పడానికి కావాల్సిన కనీస మూలధనాన్ని కూడా తగ్గించాలనే ప్రతిపాదన ఉన్నది.వంద శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి దొరికిన తర్వాత విదేశీ కంపెనీలు అత్యంత తక్కువ మూలధనంతో తమ దుకాణాలను ఇక్కడ తెరుచుకోవడానికి మార్గం మరింతసుగమం అయినట్లే! దీంతో పాటు ఇన్సూరెన్స్ చట్ట సవరణలలోబీ మల్టిపుల్ ఏజెన్సీ అనగా ఒక ఏజెంట్ అనేక కంపెనీలతో ఏజెన్సీ ని కలిగి ఉండడం; ఏజెన్సీ పోర్టబిలిటీ అనగా ఓ ఏజెంట్ ఒక కంపెనీనుండి మరో కంపెనీకి బదిలీ అయ్యే అవకాశం; పాలసీ పోర్టబిలిటీ అనగా ఒక పాలసీదారుడు ఒక కంపెనీనుండి మరో కంపెనీకి మారిపోవడం.. వంటివన్నీ చకచకా జరిగిపోయేందుకు బీమా సుగమ్ అనేపేరున మూలధన ఆవశ్యకత లేకుండానే ఇంటర్నెట్ కెఫెలు లాంటి దుకాణాలు తెరుచుకునే వెసులుబాటును కూడా పొందుపరిచారు. బీమా చట్ట సవరణలన్నీ రూపుదాల్చి, వందశాతం ఎఫ్‌డీఐ అనుమతి చట్టరూపమైతే అత్యంత ప్రధానమైన, దీర్ఘ కాలంలో నమ్మకంతో సేవలందించే అవసరమున్న బీమా రంగం పూర్తిగా విదేశీ సంస్థల హస్తగతమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

1956కు ముందు భారతదేశంలో విదేశీ స్వదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలన్నీ కలగలిసి చేసిన మోసాలు చరిత్ర సాక్ష్యాలుగా ఉండబట్టి ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆర్థిక మంత్రి సిడి దేశ్‌ముఖ్ పూనుకుని 245 ప్రయివేటు కంపెనీలు అన్నింటినీ కలిపి జాతీయకరణ చేసి పాలసీదారులకు భద్రత కల్పించడమే కాకుండా సేకరించబడిన చిన్న మొత్తాలన్నింటి ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ఉపయోగపడ్డారు. ఈరోజు గుత్త సంస్థలు లాభాపేక్ష కోసం పెరుగుతున్న ఆ కాస్త మధ్యతరగతి వ్యక్తుల ఆదా యాలపై కన్నేసి లాభాలు ఆర్జించడానికి వేసిన పన్నాగంలో ప్రభుత్వాలు ప్రజలను సమిధలుగా మారుస్తున్నాయి. ఇది చాలా దురదృష్టకరం. ఆర్థిక ముఖ్య సలహాదారు శ్రీ అనంత నాగేశ్వరన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో స్పష్టంగా చెప్పబడిన అంశం ఏమంటే ప్రభుత్వరంగ



> ఇన్సూరెన్స్ రంగం సృష్టిస్తున్న సంపద చాలా పెద్దమొత్తంలో ఉంటుంది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను 8లక్షల కోట్ల రూపాయల పైనే ఇన్సూరెన్స్ వ్యాపారం దేశంలో జరిగింది ఒక్క ఎల్ఐసీ ఆఫ్ ఇండియా 4లక్షల75వేల కోట్ల ప్రీమియంను సేకరించగలిగింది. ఇది మరింత విస్తరించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీని మౌలిక స్వభావమైన కోపరేటివ్ వెంచర్ ద్వారా ఒకరికి జరిగిన నష్టాన్ని మిగతా వారందరూ భర్తీచేసే విధానం లాభాపేక్షకు తావులేనిచోట మాత్రమే సక్రమంగా ఉండగలదు. లాభాపేక్షకు అవకాశం ఉండే ప్రయివేటు కంపెనీల వ్యాపార చట్రంలోకి ఇది నెట్టివేయబడ్డప్పుడు ఫలితాలు ప్రజా సంకటంగానే మారుతాయి.

ఎల్ఐసీ మూలంగానే ఈరోజు దేశంలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ పెరిగింది అని, అనగా ఈ 24 ఏళ్ల ప్రయివేటు కంపెనీల ప్రయాణ పరంపరలో దేశంలో ఇన్సూరెన్స్ రంగ అభివృద్ధికి అవి ఇచ్చిన తోడ్పాటు ఏమీ లేదని ఈ ఆర్థిక సర్వే ద్వారా స్పష్టమైంది. దీన్ని బట్టి అర్థమైంది ఏమంటే గతంలో మాదిరిగానే ఆర్థిక సర్వేలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ప్రధాన రంగాలను వదులుకోవడానికి ప్రభుత్వాలు మొగ్గుచూపుతున్నాయి. ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిపాదించ బడుతున్న సంస్కరణల్ని ప్రజలకు మరింత ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించడానికి లేదా పొదుపు మొత్తాలను సేకరించి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించడానికి అన్ని ఆశయం కన్నా బహుళజాతి కంపనీలు తమ వ్యాపారాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగకరంగా ఉండటమే లక్ష్యంగా ఉన్నవి. ఏ సంస్కరణలైన జరిగిన నష్టాన్ని పూడ్చాలి, అభివృద్ధి పథంలోకి అడుగులు వేయించాలి. కానీ ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిపాదించబడుతున్న సంస్కరణలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నటువంటి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్య పరిచి పెట్టుబడులకు పెద్దగా ఆస్కారం లేని సేవారంగంలోకి వచ్చి హామీలను మాత్రమే ఇచ్చి సొమ్ము చేసుకోవడానికి గుత్త, బహుళజాతి సంస్థలకు అనుమతులు ఇవ్వడానికి మాత్రమే చోటుచేసుకుంటున్నాయి.

నిజానికి ఇన్సూరెన్స్ రంగంపై అత్యధిక మంది భారత పార్లమెంటేరియన్లకు అంతగా అవగాహన లేదు. పౌర సమాజంలోనూ దీనిపైన విస్తృతమైన విషయ సంగ్రహణ ఉండదు. ఇన్సూరెన్స్ ఒక అవసర వస్తువు కాదు. ఇన్సూరెన్స్ లేని లోటు కనపడదు. కానీ సమగ్రమైన పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ ప్రజలందరికీ ఉంటే కుటుంబాల ఆర్థిక స్థితిగతుల కొనసాగింపుకు ఎలాంటి ఢోకా ఉండదు. ఇంతటి సూక్ష్మమైన ప్రధాన అంశం ఆర్థికవేత్తలకు ఆర్ యా సామాజిక దృక్కోణంలో ఆలోచించేవారికి మాత్రమే అవగతమవుతోంది. అయితే ఈ ఇన్సూరెన్స్ రంగం సృష్టిస్తున్న సంపద చాలా పెద్దమొత్తంలో ఉంటుంది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను 8లక్షల కోట్ల రూపాయల పైనే ఇన్సూరెన్స్ వ్యాపారం దేశంలో జరిగింది ఒక్క ఎల్ఐసీ ఆఫ్ ఇండియా 4లక్షల75వేల కోట్ల ప్రీమియంను సేకరించగలిగింది. ఇది మరింత విస్తరించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీని మౌలిక స్వభావమైన కోపరేటివ్ వెంచర్ ద్వారా ఒకరికి జరిగిన నష్టాన్ని మిగతా వారందరూ భర్తీచేసే విధానం లాభాపేక్షకు తావులేనిచోట మాత్రమే సక్రమంగా ఉండగలదు. లాభాపేక్షకు అవకాశం ఉండే ప్రయివేటు కంపెనీల వ్యాపార చట్రంలోకి ఇది నెట్టివేయబడ్డప్పుడు ఫలితాలు ప్రజా సంకటంగానే మారుతాయి. అందుచేత ప్రభుత్వ రంగంలోనే ఉండవలసిన ఇన్సూరెన్స్ రంగాన్ని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే సరైనది కానప్పుడు దాన్ని పూర్తిగా విదేశీ సంస్థల హస్తగతం చేయడం మరింత ప్రమాదకరం.

బాలుడు సేఫ్

- చెన్నయిలోని హోటల్‌లో బాలుడిని గుర్తింపు
- పోలీసురాకను పసిగట్టి బాలున్ని వదిలి నిందితులు పరారీ
- గంగాధర మహిళ మర్డర్‌కేసులో తెలియరాని కారణాలు, దొరకని నిందితుల ఆచూకీ
- మరికొద్ది రోజుల్లో నిందితులను పట్టుకుంటామన్న పోలీసులు


బాలుని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / గంగాధర

కరీంనగర్‌జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో ఓ మహిళకు హత్యకుగురికాగా.. ఆమె వెంట ఉన్న బాలుడు మిస్ అయిన విషయం తెలిసిందే. సదరు మహిళ వివరాలను రెండు రోజులకు గుర్తించి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించిన పోలీసులు ఆమె వెంట ఉన్న బాలుని ఆచూకీ సైతం కనుగొన్నారు. ప్రత్యేక బృందాలు సదరు బాలుడిని తమిళనాడులోని చెన్నయి హోటల్‌లో గుర్తించి తిరిగి బంధువులకు అప్పగించారు. అప్పటికే పోలీసుల రాకను పసిగట్టిన నిందితులు పరారయ్యారు. నిందితులు ఎవరనేది, హత్యకుగల కారణాలు ఇంకా పోలీసులు తేల్చలేకపోయారు. కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ శుభం ప్రకాష్ తెలిపిన వివరాలప్రకారం...

కొండన్నపల్లి శివారులో గత నెల 27న హత్యకు గురైన మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు ఆ గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగేల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మీడియా, సోషల్‌మీడియా ద్వారా ఆ మహిళ ఫొటోను ప్రచురించగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కాసీంపేటకు చెందిన మమత(25)గా గుర్తించారు. ఆమె భర్త, బంధువులకు మమత మృతదేహాన్ని ఈనెల 29న అప్పగించగా, వారు అంత్యక్రియలు నిర్వహించారు. ఆరేండ్ల క్రితం మమత, అదే ప్రాంతానికి చెందిన భరత్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేండ్ల కొడుకు ఉన్నారు. నాలుగు నెలలుగా భార్యాభర్తలిద్దరి మధ్య మనస్పర్ధల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో కొడుకుతోకలిసి మమత మంచిర్యాలలోని ఆమె బంధువుల ఇంట్లో ఉంటోంది. గత నెల 25న మంచిర్యాలలోని బంధువుల ఇంటి నుండి బయటకెళ్లి వస్తానని బాలుడితో సహా వెళ్లిన మమత రెండు రోజులకు 27న కొండన్నపల్లిలో హత్యగురై కనిపించింది. రెండు రోజుల తరువాత ఆమె వివరాలు కనుగొన్న పోలీసులు ఆమె వెంట ఉన్న బాలుడు అదృశ్యమయినట్టు గుర్తించారు. గంగాధార ఎస్ఐ నరేందర్‌రెడ్డి, చొప్పదండి సీఐ ఆర్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో మరికొంత సిబ్బంది తో కలిసి ప్రత్యేక బందంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు ఐదు రోజులపాటు శ్రమించి తమిళనాడులోని చెన్నయిలో ఒక హెూటల్ నందు నిందితులు తలదాచుకున్నారని, వారితో పాటే బాలుడు కూడా ఉన్నాడని గుర్తించారు. ఆదివారం పథకం ప్రకారం వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. అది గ్రహించి అప్రమత్తమైన నిందితులు బాలుడు అక్కడే హోటల్ గదిలో వదిలేసి పారిపోయారు. బాలుడుని తీసుకొచ్చిన పోలీసులు కరీంనగర్ రూరల్ ఏసీపీ ఏఎస్పీ శుభం ప్రకాష్, చొప్పదండి సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ఆ బాలుడిని నానమ్మ మేడ లక్ష్మి, తాతయ్య రాంచందర్‌కు అప్పగించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇంకా కొనసాగుతున్నదని, ఈ హత్యకు కారణమైన నిందితులని త్వరలో పట్టుకుంటామని, ఘటనకు సంబందించిన పూర్తి వివరాలు మీడియా ద్వారా ప్రజలకు తెలుపుతామని సిఐ ఆర్ ప్రకాష్ గౌడ్ తెలిపారు.

మైనర్ లైంగిక దాడి కేసులో దోషికి 20 ఏండ్ల కారాగార శిక్ష

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

జగిత్యాల పట్టణంలో ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన దోషికి 20 ఏండ్ల కారాగార శిక్ష విధిస్తూ జగిత్యాల న్యాయస్థానం తీర్పునిచ్చింది. దోషికి రూ.2వేల జరిమానా సహా బాధిత బాలికకు రూ.2లక్షల పరిహారం చెల్లించాలని చెప్పింది. జగిత్యాలపట్టణ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన సుంకల శ్రీనివాస్ వయస్సు (21) లైంగికదాడి చేశాడు. ఈ కేసులో నిందితునిపై పోక్సో, ఎస్,ఎస్టీ(పీఓఏ) సవరణచట్టం కింద జగిత్యాల పట్టణ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ జయేశ్ రెడ్డి కేసు నమోదు చేశారు. డీఎస్పీ వెంకట రమణ, డీఎస్పీ ప్రకాశ్ కేసు విచారించి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు ఆధారాలు సమర్పించారు. పిపి, కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి నీలిమ సోమవారం దోషి శ్రీనివాస్‌కు 20 సంవత్సరాల కఠిన కారగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. బాధిత బాలికలకు రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని అన్నారు.

ఈ కేసులో నిందితునికి శిక్ష పడటంలో కషి చేసిన పీపీ రామకష్ణ రావు, విచారణాధికారులు డీఎస్పీలు వెంకట రమణ, ప్రకాశ్, ఇన్స్పెక్టర్ జయేశ్‌రెడ్డి ,ఎస్.ఐ శ్రీకాంత్ , కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ కిరణ్, శ్రీధర్‌లను ప్రత్యేకంగా అభినందించారు..

అట్టహాసంగా ఎస్‌ఎఫ్‌ఐ 18వజిల్లా మహాసభలు

- కళాభారతి వేదికగా బహిరంగసభ
- భవిష్యత్ ఉద్యమకార్యాచరణకు ప్రతినిధుల సభకు రెడీ
- నేడు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్న డెలిగేట్స్
- విద్యారంగసమస్యలపై నిరంతపోరులో ఎస్‌ఎఫ్‌ఐ
- రాష్ట్ర మహాసభలనంతరం ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు
- భవిష్యత్ పోరాటాల్లో విద్యార్థులు కలిసిరావాలని పిలుపు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు


బహిరంగసభలో మాట్లాడుతున్న నాగరాజు, హాజరైన విద్యార్థులు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి / కరీంనగర్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా 18వ మహాసభలు సోమవారం జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభల సందర్భంగా తొలిరోజు నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి బహిరంగ సభ వేదిక ఏర్పాటు చేసిన కళాభారతి వరకు విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 'ఎస్ఎఫ్ఐ జిందాబాద్', 'ఇంకిలాబ్ జిందాబాద్' అంటూ విద్యార్థిలోకమంతా నినదిస్తూ ర్యాలీగా సాగారు. అనంతరం కళాభారతిలో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వచ్చిన ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ విద్యా కాషాయికరణ ప్రోత్సహిస్తూ మతకల్లోలలు సృష్టిస్తోందన్నారు. నూతనంగా తీసుకు వస్తున్న యూనివర్సిటీలలో మార్గదర్శకాలను రద్దు చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని వివరించారు. కనీసం కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా అటు కాలేజీలు నిర్వహణ కష్టంగా మారిందని, ఇటు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. విద్యారంగ సమస్యలపై నిరంతరమూ రాజీలేని పోరాటాలు చేసే ఎస్ఎఫ్ఐ నాయకులపై పాలకవర్గాలు అక్రమ కేసులు పెట్టి జైళ్లో పెడుతోందని, అటువంటి చర్యలకు భయపడే సంఘం కాదని అన్నారు. ఎన్నో ఉద్యమపోరాటాలు చేసి అనే సమస్యలకు పరిష్కారం చూపగలిగామని, ఇప్పుడు సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో భవిష్యత్‌లోరాబోయే సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ అంటేనే మతం, ప్రాంతాలకు అతీతంగా పని చేసే సంఘమని, రాష్ట్రంలో 10లక్షల మంది విద్యార్థుల సభ్యత్వాలతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ భవిష్యత్ పోరాటాలకు విద్యార్థులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. నేడు జరగబోయే ప్రతినిధుల సభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, అందుకు విద్యార్థి లోకం సిద్ధం కావాలని అన్నారు. నేడు నూతన కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్టు తెలిపారు. ఈబహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు అభిలాష్, రోహిత్, ఈశక్, సహాయ కార్యదర్శులు బొగేశ్, శ్రీజ, నాయకులు రాజు,సన్నీ, రిషికేశ్ ,ఆకాష్, సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజు 13 సెట్ల నామినేషన్లు

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఆరుగురు.. టీచర్స్ స్థానానికి ముగ్గురు..



టీచర్స్‌ఎమ్మెల్సీకి నామినేషన్ వేస్తున్న కూర రఘోత్తమ్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

మెదక్ - నిజామాబాద్ - కరీంనగర్ - అదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం సోమవారం ప్రారంభమైంది. కరీంనగర్ కలెక్టరేట్లో ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్ స్థానానికి ఆరుగురు, టీచర్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇందులో ఇద్దరు అభ్యర్థులు గ్రాడ్యుయేట్, టీచర్స్ స్థానానికి రెండిట్లోనూ నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 13సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఛాంబర్లో నామినేషన్లను స్వీకరించారు.

సోమవారం నాడు రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ నామినేషన్ల స్వీకరణ అనంతరం మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు తాను రిటర్నింగ్ అధికారిగా, వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 3 నుండి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడం వల్ల నామినేషన్లు స్వీకరించబోమని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు తీసుకోనున్నట్టు చెప్పారు. ఈ నెల 11న నామినేషన్ల పరిశీలన, 13 న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని చెప్పారు. మార్చి3న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా సందేహాలను నివత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులు రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు వారి సందేహాలను నివత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి తూ.చ తప్పకుండా పాటించాలని, ర్యాలీలు, సమావేశాలు, సభలు తదితర వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె కోరారు .నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు తగిన సూచనలు, సలహాలు అందించేందుకు అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి..

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సిలివేరు శ్రీకాంత్ ఇటు గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు రెండు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన దూడ మహిపాల్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడెంకు చెందిన గవ్వల లక్ష్మి, మేడ్చల్ కు చెందిన కంటే సాయన్న గ్రాడ్యుయేట్ స్థానానికి ఒక్కొక్క సెట్ నామినేషన్ వేశారు. హైదరాబాద్ కు చెందిన చాలిక చంద్రశేఖర్ గ్రాడ్యుయేట్ స్థానానికి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అదిలాబాద్ కు చెందిన మంచికట్ల ఆశమ్మ ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

టీచర్స్ ఎమ్మెల్సీ కి ముగ్గురు..

టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. కూర రఘోతంరెడ్డి, చాలిక చంద్రశేఖర్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఒక్కొక్క సెట్టు నామినేషన్, సిలివేరు శ్రీకాంత్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఆయా అభ్యర్థుల నుంచి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి నామినేషన్లను స్వీకరించారు. పోలీసులు ఈ మేరకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా అధికారులు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కలెక్టర్ పమేలా సత్పతితో పాటు డిఆర్ఓ వెంకటేశ్వర్లు, పవన్ కుమార్ ఆర్డిఓ కే మహేశ్వర్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

5న దేశవ్యాప్త నిరసన విజయవంతం చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు



నవతెలంగాణ - కరీంనగర్

జాయింట్ ఫ్లాట్‌ఫార్మ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సంయుక్త మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న నిర్వహించనున్న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలువురు కార్మిక, రైతు నాయకులు పాల్గొని దేశవ్యాప్త నిరసనపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపడుతామని వెల్లడించారు. మండల కేంద్రాలు, పట్టణాల్లో కూడా అంబేద్కర్ విగ్రహాల ముందు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిరసనలను శాంతియుతంగా చేపట్టేందుకు పోలీసు, అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి కేంద్రం అమలు చేయాలని చూస్తున్న నాలుగు కార్మిక లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తాయని విమర్శించారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో కార్మికవర్గ డిమాండ్లను పక్కన పెట్టి, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మడానికి మార్గం సుగమం చేసినట్టు తెలిపారు. బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐని అనుమతించడం, ప్రభుత్వ రంగ సంస్థలను కొంతమంది కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. దేశంలో ఉత్పత్తి రంగంలో కీలకమైన రైతులు, వ్యవసాయ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం కల్పించని బడ్జెట్‌ను వ్యతిరేకించేందుకు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకర సంపత్, రాయికంటి శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోయిని అశోక్, కోహెడ సృజన్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండ రాజిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న


పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్

నవతెలంగాణ - జమ్మికుంట

రైతులు పండించిన పత్తిని నేరుగా మార్కెట్ యార్డ్‌కి తీసుకువచ్చి అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న అన్నారు. సోమవారం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి నాణ్యతను మార్కెట్ సెక్రటరీ ఆర్.మల్లేశంతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీసీఐకి అమ్ముకొనే రైతులు మీ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, తీసుకొని వచ్చి జమ్మికుంట పరిధిలో వున్నా సీసీఐకి కేటాయించిన 8 జిన్నింగ్ మిల్లుల్లో అమ్ముకోవాలని సూచించారు. రైతులకు మార్కెట్ యార్డ్‌లో ఏ ధర పలికిందో మిల్లుల వద్ద కూడా అదే ధరలు ఉంటాయని, తేడా వస్తే మా దృష్టికి తీసుకొని వస్తే మిల్లులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పత్తిని నీళ్ల చల్లకుండా, తేమ శాతం తక్కువ వచ్చేల తీసుకొని వస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానుకూల బడ్జెట్‌గా సవరించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శీలం అశోక్



నవతెలంగాణ - జమ్మికుంట : కేంద్రం ప్రకటించిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని.. దాన్ని సామాన్య, పేద బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే విధంగా ప్రజానుకూల బడ్జెట్‌గా సవరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శీలం అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. దేశ బడ్జెట్లో 25.2 శాతం వడ్డీ చెల్లించడానికి కేటాయించడం చూస్తుంటే దేశం అప్పుల కుప్పగా మారిపోయిందన్నారు. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8మంది ఎంపీలు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న అధిక నిధులు రాబట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిధులు కేటాయించే విధంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

మానకొండూర్ పిహెచ్‌సీని సందర్శించిన పీఆర్‌సీ బృందం



నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అన్నారం సబ్ సెంటర్‌ను సోమవారం పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ బృందం అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, బిపి, డయాబెటిక్, క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రతి రోజు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌సీ బృందం అధికారులు డాక్టర్ సరవన్ కుమార్, డాక్టర్ సన జవేరియా, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సల్మాన్, డీపీఓ స్వామి, డాక్టర్ మానస, సీహెచ్‌వో రాజు నాయక్, సూపర్‌వైజర్ జుబేర్, స్నేహలత, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్‌షాప్‌లపై మున్సిపల్ అధికారుల దాడులు



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని పలు వైన్‌షాప్‌లపై మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైన్స్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడం పట్ల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగేంద్ర వైన్స్, మందాకిని వైన్స్ యజమానులకు రూ.5వేల జరిమానా విధించారు. మరోసారి పారిశుధ్యం సక్రమంగా లేకపోతే షాపులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె.సమ్మయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఆర్.భూపాల్‌రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ యం.కిషన్‌రావు, వార్డు అధికారులు ఆర్.బాలగంగాధర్ తిలక్, సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పి.వినయ్, సానిటరీ జవాన్లు ఆర్.సుధీర్, ఎ.రమేష్, పి.అనిల్ కుమార్, టి.కుమారస్వామి పాల్గొన్నారు.


ఇద్దరు మంత్రులు ఉన్నా వచ్చింది గుండు సున్నా..

డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి



నవతెలంగాణ-కరీంనగర్ : రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధుల కేటాయింపులో దక్కింది గుండు సున్నా. అని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి అన్యాయం చేయడం పట్ల పీసీసీ పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక కోర్టు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులుగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కామిడి రామిరెడ్డి, పంజాల స్వామి గౌడ్ పాల్గొన్నారు.

హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ పరిధిలోని హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ 2025 క్యాలెండర్‌ను సిఐటియు జిల్లా కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు ఎడ్ల రమేష్ సోమవారం కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గట్టు సతీష్‌తోపాటు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఉద్యోగులు క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. 2025 ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో రద్దుకోసం నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేయాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో కూడా కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని, ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కూడా కనీస వేతన సవరణ చేయక 14 సంవత్సరాలు అవుతుందన్నారు. షెడ్యూల్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాల జీవోలను సవరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మరో పారిశ్రామిక విభాగం రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు పాల్గొనడం కార్మికుల ఐక్యతకు నిదర్శనం అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని గ్రానైట్ ఇండస్ట్రీ, సీడ్ అండ్ రైస్ మిల్స్ ఇండస్ట్రీ, ఫీడ్ ఇండస్ట్రీ మిల్క్ ప్రొడక్షన్ కంపెనీలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మడిపల్లి మహేందర్, కోశాధికారి పోలు సంపత్, ఉపాధ్యక్షులు గుమ్మడి మహేందర్, రాగుల తిరుపతి, దుడ్డేల సమ్మయ్య, రాకం అశోక్, సహాయ కార్యదర్శి వెంకటరమణ, సల్ల పవన్, గంప మధు, కాసర్ల రాజు, కార్యవర్గ సభ్యులు కొత్త రాజు, గురు భూషణ్, ఎల్లోజి, గిరివేని శ్రీనివాస్, కీసర శ్రీనివాస్, పెద్ది హరీష్, 100మంది కార్మికులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలని బాధిత కుటుంబాల రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ - జమ్మికుంట : అధికారులు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు రిలే నిరాహార దీక్ష మండల కేంద్రంలో వారి సొంత స్థలమైన 465/బి/4లో సోమవారం చేపట్టారు. వారికి సామాజిక కార్యకర్త సాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాటిపల్లి లక్ష్మి బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడారు. తమకు జరిగిన అన్యాయం పట్ల ఐదు రోజుల క్రితం మీడియా ముఖంగా బహిర్గతం చేసిన తర్వాత సంబంధిత భూ కబ్జాదారుడు అయిన పోలీసు మాజీ అధికారి ఏనుగు జయపాల్‌రెడ్డి తమకు సంబంధించిన భూమిలోపల మొరాన్ని తరలించి అక్రమంగా కట్టడం నిర్మించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కబ్జాదారుడికి స్థానిక నాయకులు సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన పత్తి కృష్ణారెడ్డి



నవతెలంగాణ - జమ్మికుంట

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా టిపిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి కలిసారు. ఆయన్ని శాలువాతో సన్మానించారు.

కరీంనగర్ బ్లడ్ సెంటర్‌ను సీజ్ చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ బ్లడ్ సెంటర్‌ను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగంధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిల్వ చేసిన రక్తనిల్వలను ప్రయివేటు బ్లడ్ సెంటర్ నిర్వాహకులకు బ్లడ్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. సెంటర్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని యుగంధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్, మహేశ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో వోవెల్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - కరీంనగర్ : విశ్వం ఎడ్యు టెక్ సంస్థ, అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీలను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకుకు చెందిన పాఠశాలల నుండి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో కరీంనగర్‌లోని వోవెల్స్ స్కూల్ విద్యార్థులు జె.రితిక్‌రెడ్డి- 7వ తరగతి, ఎస్.అశ్విన్‌రెడ్డి -4వ తరగతి పాల్గొన్నారు. ఎస్.అశ్విన్‌రెడ్డి జూనియర్ లెవెల్ - 3లో ప్రోత్సాహక బహుమతి గెలుపొందారు. విద్యార్థులకు విశ్వం ఎడ్యుటెక్ సంస్థ నిర్వాహకులు ట్రోఫీలను, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో వోవెల్స్ పాఠశాల నిర్వాహకులు, అబాకస్ ట్రైనర్ స్రవంతి, మాధురి పాల్గొన్నారు.

రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దశరథ్ రెడ్డి



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎలాల దశరథ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నేమూరి సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో అప్పుల బాధతో చనిపోయిన రైతు కుటుంబాన్ని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గొని రైతులతో మాట్లాడుతారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, నాయకులు ఆరేళ్ల రాజ గౌడ్ పాల్గొన్నారు.

బావాజీపల్లిని జీపీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండల వెల్దుర్తి హామ్లెట్ గ్రామం బావాజీపల్లిని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఆ గ్రామస్తులు కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

జిల్లాలో 100శాతం

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నవతెలంగాణ జగిత్యాల టౌన్

సరస్వతీ దేవి ఆశీస్సులతో జగిత్యాల జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ తదితర పరీక్షలు రాసే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వసంత పంచమిని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల పట్టణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కొలువై ఉన్న మహా సరస్వతి దేవికి సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

డ్రైవర్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. మండలంలోని గోదూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. డివిజన్ డ్రైవర్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గులావత్ శివలాల్, గుట్టయ్య, సంపత్‌గౌడ్, గంగాధర్, రాజయ్య, నరసయ్య, మోహన్, గంగారెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ- జగిత్యాల టౌన్

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్లను మర్యాద పూర్వకంగా కలిసి తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, నాగభూషణం, నాయకులు గాజంగి నందయ్యా రాజేందర్, నేహాల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిసి తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు అడువల లక్ష్మణ్, బాల ముకుందం, దుమల రాజ్‌కుమార్, బోనగిరి నారాయణ, ప్రభాత్ సింగ్‌ఠాగూర్, మతీన్, పోతునుక మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలో

సత్తచాటిన మెట్‌పల్లి విద్యార్థి

నవతెలంగాణ - మెట్‌పల్లి



హైదారాబాద్‌లోని కూకట్ పల్లిలో వేదిక్ మ్యాథ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో మెట్‌పల్లి ఒక్లే ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని ఏలేటి పూర్ణిరెడ్డి గ్రేడ్-3 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ సుమలత రెడ్డి, కరస్పాండెంట్ రాకేష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని పెంపొందిం చడానికి పాఠశాలలోని విద్యార్థులకు అబాకస్‌పై ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నట్టు కరస్పాండెంట్ తెలిపారు.

గ్రీవెన్స్ డే తో బాధితుల

సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

ధర్నాలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-కోరుట్ల



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ధర్నాలో పాల్గొన్నారు.

పోతారంలో క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ- మల్యాల

మండలంలోని పోతారం గ్రామంలో జరుగుతున్న విలేజ్ టూ విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌లో బల్వంతాపూర్ గ్రామానికి చెందిన అల్ జాజీరా క్రికెట్ యూత్ క్రీడాకారులకు జెర్సీలను మండల కాంగ్రెస్ నాయకులు నక్క అనిల్ ప్రదానం చేశారు. క్రీడలు శరీర ధృఢత్వానికి ఎంతోగానో ఉపయోగ పడుతాయని తెలిపారు.



కొత్త రేషన్ కార్డులకు బియ్యం

- జగిత్యాల జిల్లాలో 554 కొత్త రేషన్ కార్డులు
- జిల్లాలో పంపిణీ ప్రారంభం

నవతెలంగాణ జగిత్యాల టౌన్

ఈనెల 26 గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా మండలానికో గ్రామం చొప్పున ఎంపిక చేసి లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు ఇచ్చిన విషయం విదితమే. ఆ కార్డుదారులకు ఫిబ్రవరి నెల నుంచి బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 554 మంది లబ్ధిదారులను ముందుగా ఎంపిక చేశారు. వీరే కాకుండా ఎంపిక చేసిన గ్రామాల్లోని గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుదారుల్లో అర్హులకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఆ కార్డులను ఆయా రేషన్ దుకాణాలకు కేటాయిస్తారు. అనంతరం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు.

కులగణన ప్రకారం సభ్యుల పేర్లు..

నూతన రేషన్ కార్డులను కుటుంబ యజమాని పేరుపై ఇచ్చారు. ఆ కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు? వారికి ఎన్ని కిలోల బియ్యం పంపిణీ చేయాలి అనే వివరాలు స్పష్టంగా తెలియదు. దీంతో అధికారులు గతేడాది నిర్వహించిన కుటుంబ కులగణన ప్రకారం ఆయా కుటుంబాల్లో నమోదై ఉన్న సభ్యుల పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేశారు. అనంతరం కొత్త కార్డులను రేషన్ దుకాణాలకు కేటాయించారు. ఈ నెల నుంచి మిగతా లబ్ధిదారుల మాదిరిగానే కొత్తవారికి రేషన్ అందనుంది.

నిరంతర ప్రక్రియ..

ఇకపై ప్రతి నెలా మృతుల పేర్లను రేషన్‌కార్డు నుంచి తొలగించనున్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హుల పేర్లను కార్డుల్లో చేర్చనున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ, సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించడం నిరంతరం ప్రక్రియ అని డీఎస్‌వో జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరికైనా కార్డు రాలేదనో, సభ్యుల పేర్లు చేర్చలేదనో ఆందోళన చెందవద్దని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రేషన్‌కార్డులను నిరంతరం జారీ చేస్తుందని చెప్పారు.



గతంలో కార్డుల వివరాలు..

జిల్లాలో జనవరి వరకు ఆహార భద్రత కార్డుల సంఖ్య 292441, అంత్యోదయ కార్డుల సంఖ్య 14505, అన్నపూర్ణ కార్డుల సంఖ్య 145, మొత్తం కార్డుల సంఖ్య 307091.

యూనిట్ల వారిగా ఆహార భద్రత కార్డులకు 844276, అంత్యోదయ కార్డులకు 37038, అన్నపూర్ణ కార్డులకు 155, మొత్తం కార్డుల సంఖ్య 881469.

బియ్యం పంపిణీ అన్ని కార్డులకు కలుపుకొని 5574781 కిలోలు.

ఫిబ్రవరి నుండి కార్డుల వివరాలు....

ఆహార భద్రత కార్డుల సంఖ్య 292997, అంత్యోదయ కార్డుల సంఖ్య 14504, అన్నపూర్ణ కార్డుల సంఖ్య 144, మొత్తం కార్డుల సంఖ్య 307645.

యూనిట్ల వారిగా ఆహార భద్రత కార్డులకు 850241, అంత్యోదయ కార్డులకు 37075, అన్నపూర్ణ కార్డులకు 156, మొత్తం కార్డుల సంఖ్య 887472.

బియ్యం పంపిణీ అన్ని కార్డులకు కలుపుకొని 5610526 కిలోలు.

అంత్యోదయ కార్డులు, అన్నపూర్ణ కార్డులు గతంలో కంటే తగ్గగా ఆహార భద్రత కార్డులు పెరిగాయి. జనవరి వరకు అన్ని కార్డులకు సంబంధించి మొత్తం 5574781 కేజీల బియ్యం పంపిణీ చేయగా, ఫిబ్రవరిలో 5610526 కేజీల బియ్యం పంపిణీ చేయనున్నారు. అనగా 35745 కేజీల బియ్యం అదనంగా పంపిణీ చేయనున్నారు.

కలెక్టర్‌తో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సమావేశం

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధ్యక్షతన నేషనల్ డిజాస్టర్ రిస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) బృందం జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ, తక్షణ చర్యలు, సహాయ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ప్రకృతి విపత్తులు, ముఖ్యంగా వరదలు, భూకంపాలు, తుపాన్లు వంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, మునిసిపల్, విద్యుత్, రోడ్లు-భవనాలు, తాగునీరు,



పౌర సరఫరా తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ "జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సమన్వయం అత్యంత కీలకం అన్నారు. విపత్తు సమయంలో వేగంగా స్పందించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ముందస్తు ప్రణాళికలు, అప్రమత్తతతో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం త్వరలో జిల్లాలో విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ (అభ్యాసం) నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ముఖేష్‌కుమార్, ఆర్డీవో మధుసూదన్, కలెక్టరేట్ ఏవో హనుమంతరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకం

- జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సాయుధ బలగాల డీ-మొబిలైజేషన్ పరేడ్
- పాల్గొన్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ప్రధాన విభాగాలతో పాటు ఏఆర్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నో సమస్యాత్మక పరిస్థితులు, ఎన్నికల నిర్వహణ, గణేష్ నిమజ్జనం ఊరేగింపు వంటి విధుల నిర్వహణలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కృషి ఎంతో ఉందని అభినందించారు. సోమవారం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో 15 రోజుల పాటు సాగిన



జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో జిల్లా అశోక్ కుమార్ పాల్గొని జిల్లా ఆర్మ్‌డ్ సిబ్బంది నుచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. 05 ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్‌నకు అడ్మిన్ ఆర్ఐ. కిరణ్‌కుమార్ ప్లటూన్ కమాండెర్‌గా వ్యవ హరించారు. 15 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔట్డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారని ఏఆర్ అదనపు ఎస్పీ బీమ్ రావు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ మట్లాడుతూ.. ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొత్తం ఒకే దగ్గరకు వచ్చి శిక్షణా సమయంలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకునే అవకాశం మోబిలైజేషన్ ద్వారా కలుగుతుందని అన్నారు. పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, రిజర్వ్‌సబ్ ఇన్స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ మాత జన్మదినమైన వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక శ్రీ జ్ఞాన సరస్వతీ మాత ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు గౌతం శర్మ, వినయ్‌శర్మ వైదిక నిర్వహణలో సరస్వతీ అమ్మ వారి మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాసం, పుస్తక పూజ, విజయ కంకణ ధారణ నిర్వహించారు.. అమ్మవారికి విక్టరీ సెల్ పాయింట్ అధినేత మచ్చ వెంకటరమణ - వాణి దంపతులు 21 గ్రాముల బంగారు కిరీటాన్ని బహుకరించారు.

మండలంలోని సంగెం గ్రామంలో సంఘ మహేశ్వర సరస్వతి ఆలయం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సుదవేణి భూమయ్య, తోట రాజు, జుంబర్తి రమేష్, గట్ల ఆనంద్, కాసు క్రాంతి, గెల్లె గంగాధర్ చలిగంటి వినోద్ 'పమార్, గడ్డం మధు, బెజ్జారపు రాజు, గాజంగి లక్ష్మీపతి, అల్వాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్యాల :మండలంలోని అర్బన్ హౌసింగ్ కాలనీ నూకపల్లిలో గల శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయంలో



మల్యాల మండలంలో...

వసంత పంచమి పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉదయం నుండి సాయంత్రం వరకు దాదాపు 500 మందికి పైగా అక్షరాభ్యాసం 5000 మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆలయ అధ్యక్షుడు శ్ర బండారి కమలాకర్ రావు తెలిపారు. వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసిన మల్యాల సీఐ నీలం రవికి పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-రాయికల్:

పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో జ్ఞాన స్వరూపిణి సరస్వతీ మాత జన్మదినాన్ని పురస్కరించుకొని వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.సరస్వతీ మాత విగ్రహానికి



రాయికల్: మండలంలో...

పూలమాలలు, వీణతో అలంకరించి, సరస్వతి దేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. విద్యార్థినులు సరస్వతీ మాత వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలె శేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం బాలె జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్‌కుమార్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి :పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు సాకేత్ శాఖిల్ శాస్త్రి ఆధ్వర్యంలో పిల్లలకు అక్షర అభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం, సముద్రాల భానుమూర్తి, బేతు భాస్కర్, ఉడుత శ్రీనివాస్, ఆడెపు రమణ, పలువురు పాల్గొన్నారు.

గాయత్రి నిర్భయ సేవింగ్

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు గాయత్రి నిర్భయ సేవింగ్ ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందించారు. మెట్‌పల్లి గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన ఇబ్రహీంపట్నం మండలం, కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్ల నర్సయ్య బైకు యాక్సిడెంట్ లో చనిపోగా ఖాతాదారుడికి గాయత్రి నిర్భయ సేవింగ్ క్రింద ఒక లక్ష రూపాయల ఇన్సూరెన్స్ ఉండగా బ్యాంక్ అధికారులు,నామిని అయినా ఖాతాదారుని భార్య పిట్ల జయలక్ష్మికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బ్యాంకు



అధికారులతో కలిసి ఇన్సూరెన్స్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కేశ శివకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ బోండ్ల మధు, కావ్య ,నందు. తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు

అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

నవతెలంగాణ జగిత్యాల



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, గౌతమ్‌రెడ్డితో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారన్నారు. అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్‌లో ఉంచ కుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు మధు సుధన్, జివాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్య వేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని నెల రోజుల (ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహిచొద్దని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి 20 ఏండ్ల జైలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలికపై సుంకల శ్రీనివాస్ లైంగిక దాడి చేసిన కేసులో కోర్టు 20 ఏండ్ల జైలు, జరిమానా విధించింది. పోక్సో, ఎస్సీఎస్టీ (పీవోఏ) అమ్మెండమెంట్ యాక్ట్ చట్టం క్రింద జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ జయేశ్ రెడ్డి కేసు నమోదు చేయగా డీఎస్పీ వెంకట రమణ, డీఎస్పీ ప్రకాశ్ కేసును విచారించారు. ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ఆధారాలు సమర్పించగా పీపీ , కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి 20 ఏండ్ల జైలు, 2000 జరిమానా, బాధిత బాలికలకు 2 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది .

గీతాపారిశ్రమిక సంఘం అధ్యక్ష

ఎన్నికకు నోటిఫికేషన్

నవతెలంగాణ-మెట్ పల్లి

మెట్‌పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష ఎన్నికకు సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. నూతన సహకార ఎన్నిక ఫిబ్రవరి 17న ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ నుండి 10వరకు నామినేషన్‌ల స్వీకరణ, 11 తేదీన నామినేషన్‌ల పరిశీలన ఉంటుందని ఎలక్షన్ అధికారి మల్లేష్ తెలిపారు.

జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరండి


నవతెలంగాణ-జగిత్యాల



రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరడానికి అధ్యాపకులు ప్రచార కార్యక్రమం నిర్వహించాలనే సదుద్దేశ్యంతో సోమవారం తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్ రెడ్డి జగిత్యాల మహిళా, ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను సందర్శించి అధ్యాపకులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యావంతులు అర్హులైన అధ్యాపకుల బోధనలో అన్ని మౌలిక సదుపాయాలతో వెలసిల్లుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు చేరడానికి అందరూ అధ్యాపకులు ప్రచార కార్యక్రమం నిర్వ హించాలన్నారు. కార్యాచరణ రూపొందించుకొని మండలాల వారీగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు, మోడల్ స్కూలు జూనియర్ కళాశాలలో, కస్తూర్బా జూనియర్ కళాశాలలను సందర్శించాలన్నారు. గతంలో సంఘం ప్రచార కార్యక్రమం వలన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 25 వేల నుండి 62 వేల వరకు పెరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఏ. శ్రీనివాస్, లేడీ సెక్రటరీ సంగీత రాణి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు రామకృష్ణ, శ్రీనివాస్, చంద్రయ్య, వరప్రసాద్,ఎస్. వాసవి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

నవతెలంగాణ-మేడిపల్లి



సామజిక సేవ కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలు మల లావణ్య లక్ష్మణ్, టీ పీసీసీ గల్ఫ్ కన్వీనర్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ తెలు నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగం రాజేష్, మార్గం నర్సారెడ్డి, బద్దం వినయ్‌రెడ్డి, భూమేష్, రాజు, మతీన్, మధుకర్, రాజేందర్, శంకర్‌రెడ్డి , శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో మరణించిన ఎస్ఐ

కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



2012 పోలీస్ ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన తోటి మిత్రుడు రాజమౌళి 2018లో క్యాన్సర్‌తో మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని ఆదుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో విధులు నిర్వహిస్తున్న 2012 పోలీస్ ఎస్ఐ బ్యాచ్ మేట్స్ అందరూ కలిసి రూ.4 లక్షలు సమకుర్చారు. వాటిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా రాజమౌళి సతీమణి, కూతురుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, వేణుగోపాల్, కృష్ణరెడ్డి, రవి, వేణు, రహీమ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ఉద్యోగులకు నిరాశ

నవతెలంగాణ-కోరుట్ల

కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో ఉద్యోగులకు గోరంత ఉపశమనం కనపడుచున్న కొండంత నిరాశ నిస్పృహలు మిగిల్చాయని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గంగుల రణధీర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో రూ.12 లక్షల ఆదాయం పైన వారికి తిరిగి 4 లక్షల నుండే ట్యాక్స్ రాబట్టడం వల్ల నష్టపోవడం జరుగుతుందని, దీనిని రూ.5 లక్షలకు పెంచి డీడక్షన్ ఇంకా రూ.2 లక్షలకు పెంచాలని కోరారు.

విగ్రహాప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మెట్‌పల్లి

మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోనీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
రాజన్న సిరిసిల్ల
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ
- లేబర్ ఆఫీసర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్లలో పనిచేస్తున్న స్థానిక భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం లేబర్ అధికారికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యకుడు జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వలస వచ్చిన కార్మికుల వల్ల స్థానికంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. సంబంధిత లేబర్ అధికారులు వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి, స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సిరిసిల్ల లేబర్ అడ్డ వద్ద కార్మికులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని, లేబర్ కార్డులు లేని కార్మికులందరికీ కార్డులు అందజేయాలన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ , యూనియన్ అధ్యక్షులు కోల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్ల సమస్యలు పరిష్కరించాలని ఏటియుసి ప్రభుత్వ పాఠశాల స్లీపర్స్ , స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పనిచేస్తున్న స్వీపర్స్ స్కావెంజర్స్ వేతనాలు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కానుండ నేరుగా కార్మికుల ఖాతాలోనే జమ చేయాలన్నారు. ఆరు నెలల నుండి జీతాలు రాక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనాలు కాకుండా అందరికి ఒకే రకమైన వేతనం రూ.15వేలు చెల్లించాలని కోరారు. బ్లీచింగ్ పౌడర్ మాస్కులు,సేఫ్టీ బ్లౌజులు, యూనిఫామ్ ప్రభుత్వమే సమకూర్చాలన్నారు. ఇన్సూరెన్స్ కలిపించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం డిఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవయ్య, లింగంపల్లి జ్యోతి, లింగంపల్లి తేజశ్రీ, రాధ బొడ్డు నరసవ్వ, నడిగొట్టు లక్ష్మి, లత, లింగం వెంకటేశ్వర్, రాజు,సాయి కృష్ణ, నాగరాజు, లచ్చవ్వ నరసవ్వ, వజ్రవ్వ, లావణ్య పాల్గొన్నారు.

ప్రజావాణితో సమస్యలు పరిష్కారం

సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : ప్రజావాణిలో వచ్చే సమస్యలు పరిష్కరిస్తున్నామని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. మొత్తం 122 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 67, సిరిసిల్ల మున్సిపల్ 18, జిల్లా పంచాయతీ అధికారి2, జిల్లా వైద్యాధికారి 2, జిల్లా సంక్షేమ అధికారి 4, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ 3, ఎస్సీ కార్పొరేషన్ 1, ఎస్సీ సంక్షేమ అధికారి 4, ఎస్ డి సి 5, డిఆర్డిఓ, వ్యవసాయ శాఖకు 2 చొప్పున, పౌరసరఫరా శాఖకు 3, విద్యాశాఖ, మత్స్యశాఖ, నీటిపారుదల శాఖ, ఎస్పీ ఆఫీస్, ఉపాధి కల్పన శాఖ, ఎంపీడీవో కొనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట తంగళ్లపల్లికి ఒకటి చొప్పున, వచ్చాయి. ప్రజావాణిలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని భవన నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు


అక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని బండలింగం పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 368లో దాదాపు 5 గుంటల ప్రభుత్వ భూమిని జంగారెడ్డి అనే వ్యక్తి, కులుస్తులతో కలిసి దౌర్జన్యంగా ఆక్రమించి అందులో కుల భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామ యువజన సంఘాల సభ్యులు కె.రాజు తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి అనుమతులు లేవని ఆ భూమికి సంబంధించినటువంటి భూపత్రాలు లేకుండా దౌర్జన్యంగా ఇష్టరాజ్యంగా జంగారెడ్డి కుల సంఘాన్ని నిర్మించారు. ఆ భవన నిర్మాణాన్ని కూల్చివేసిన ప్రభుత్వ భూమిని కాపాడాలని అదేవిధంగా బండలింగంపల్లిలో బస్టాండ్ లేదని, చదువుకున్న యువతీ, యువకుల కోసం ఆ స్థలాన్ని లైబ్రరీ కోసం, బస్టాండ్ కోసం, గ్రామ అభివృద్ధి కోసం కేటాయించాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చినట్లు కె.రాజు తెలిపారు.

వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రశంసా పత్రం పొందిన సెలెస్టియల్ హైస్కూల్ విద్యార్థులు


సర్టిఫికెట్ను విద్యార్థులకు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్
ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు అన్నారు. పట్టణంలోని స్థానిక సెలెస్టియల్ హై స్కూల్ లో వసంత పంచమి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతి దేవికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా "అంతరిక్షంలో మొక్కలు పెంచవలసి వస్తే" అనే అంశంపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆన్లైన్ ఎగ్జామ్ లో సెలెస్టియల్ హై స్కూల్ విద్యార్థినులు తాళ్లపల్లి అక్షర, సాప మేఘన, బండారి లావణ్య మొదటి మూడు స్థానాలలో నిలిచారు. విద్యార్థులకు వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్లను మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు, పాఠశాల కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు రాజు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి రాబోయే పబ్లిక్ పరీక్షలలో 10 జిపిఎ సాధించాలన్నారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ నిలిపి తదనంతరం విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్ బత్తిని సంతోష్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలు


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాఘవేంద్ర, మహర్షి, నవజ్యోతి, శ్రీవాణి, బచ్‌పన్, న్యూశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలల కరస్పాండెంట్లు జలజ రామ్‌మనోహర్‌రావు, ప్రకాష్, నరేష్, రవీందర్, బాలయ్య, రాజు, ప్రధానోపాధ్యాయులు మంజుల, పద్మ, అపర్ణ, సుధా పాల్గొన్నారు.

పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు..

- నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల :
రాబోయే స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గ్రామ పంచాయతీలలో 2వ సప్లిమెంట్ ఓటర్ జాబితా నమోదు, మండలాలకు ఎంపిటిసిల కేటాయింపు, ఎంపిటిసి, జడ్పిటిసి ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మ్యాన్ పవర్, బ్యాలెట్ బాక్సుల సన్నద్ధత, సిబ్బందికి అవసరమైన శిక్షణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపిడీఓలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సిబ్బంది ఎన్నికల సమయంలో ఏ బాధ్యతలను నిర్వర్తించాలో స్పష్టమైన ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎన్నికలు వస్తే చేయాల్సిన పనులను మండల పంచాయతీ అధికారి, ఎంపిడిఓ కలిసి లిస్ట్ ఔట్ చేసుకోవాలని, ప్రతి పనికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించాలని, అవసరమైన సిబ్బంది, మెటీరియల్ వివరాలు అందించాలని సూచించారు. స్థానికత పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను విభజించాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ ప్రణాళికలు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు కోసం అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పరిశీలనకు అవసరమైన బృందాలు ఏర్పాటు చేసుకునే సన్నద్ధంగా ఉండాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎంపిటిసి, జడ్పిటిసి ఓటర్ జాబితా తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 2వ దశ సప్లిమెంట్ ఓటర్ జాబితా తయారు చేయాలని, పోలింగ్ కేంద్రాల ఓటర్లను మ్యాప్ చేయాలని, దివ్యాంగ ఓటర్లకు కల్పించాల్సిన వసతుల పై ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో మొదటి దశలో 137 గ్రామాల్లో 1188 వార్డులలో, రెండవ దశలో 123 గ్రామాల్లో 1080 వార్డులలో ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని, సిరిసిల్ల జిల్లాలో అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డిప్యూటీ జెడ్పీ సీఈవో గీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీ టీం, పోలీస్ అక్క భరోసా..

- విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహనా సదస్సులు
- మహిళలను వేధిస్తున్న వారిపై మూడు కేసులు, 8 పెట్టి కేసులు నమోదు
- సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


మాట్లాడుతున్న ఎస్పీ

నవతెలంగాణ - సిరిసిల్ల :
జిల్లాలో మహిళల, విద్యార్థినుల రక్షణే లక్ష్యంగా షీ టీం, పోలీస్ అక్క ఏర్పాటు చేసినట్లు సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో, ర్యాగింగ్, ఈవ్ టీసింగ్, వేధింపులకు గురైతే ఎవరిని సంప్రదించాలి అనే మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తూ భరోసా కల్పిస్తున్నామని ఎస్పీ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో పోలీస్ అక్క అనే కార్యక్రమం ద్వారా జిల్లాలోని విద్యాసంస్థల లో 134 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విద్యార్థినులు, మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై 3 కేసులు, 8 పెట్టి కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అభద్రత భావానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీంకి లేదా పోలీస్ అక్కకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు. లైంగిక వేధింపులకు గురౌవుతున్నా, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విద్యార్థినులు, బాలికలు మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యాసంస్థలల్లో ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పని చేసే ప్రదేశాల్లో అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 లేదా మీ పరిధిలోని పోలీస్ అక్కకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాసంస్థల వద్ద షీ టీం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి బైక్‌లపై ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మల్కాపేట రిజర్వాయర్ నుండి నీటి విడుదలపై హర్షం


ప్రభుత్వ విప్‌కు సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :
రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మల్కాపేట రిజర్వాయర్ నుండి 9వ ప్యాకేజీ కింద నీటి విడుదలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అంగీకరించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య సోమవారం తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సోమవారం ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు రైతుల పంట పొలాల కోసం తొమ్మిదవ ప్యాకేజి కింద కెనాల్‌కు నీటిని ఇవ్వాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారం, దేవుని గుట్ట తండా, చింతకింది తండా, రాచర్ల తిమ్మాపూర్, రాజన్నపేట, గొల్లపల్లి, అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా, కిష్టునాయక్ తండాకు చెందిన సుమారు 800 ఎకరాల వరి పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. బోర్లలో కూడా నీటి శాతం తగ్గడంతో రైతులు దిక్కుతోచకుండా దిగులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య తీర్చడానికి కేవలం మల్కాపేట రిజార్వాయర్ నుండి 9వ ప్యాకేజీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తే పంటలను రక్షించినట్లు అవుతుందని సిరిసిల్ల నియోజవకర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డి ఆదివారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఎలాగైనా రైతుల పంటలను కాపాడాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడి త్వరలోనే నీటిని విడుదల చేయించి రైతుల పంటలు కాపాడుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబేర బేగం, వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే సాహెబ్, నాయకులు ఎండి మహబూబ్, గంట బుచ్చగౌడ్, చెన్ని బాబు, మిండే శ్రీనివాస్ యాదవ్, బండారి బాల్‌రెడ్డి, గొల్లపల్లి మల్లేశం, నంది కిషన్, మూర్తి వెంకటేష్, శ్రీపాల్‌రెడ్డి, నవీన్ నాయక్, మల్లారెడ్డి, వడ్నాలి దేవయ్య పరుశరాములు, లక్ష్మణ్, సతీష్ పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు


సిరిసిల్ల రూరల్: నారాయణ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :
పట్టణంలోని సోమవారం పలు పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు జరిగాయి. నారాయణ పాఠశాలలో, శ్రీ శబరి విద్యానికేతన్ పాఠశాలలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి సరస్వతి పూజ జరిపారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, డిజిఎం రమణారెడ్డి, ఏజీఎం చైతన్యరావు, ఆర్ఐ సత్యంరావు, ప్రిన్సిపాల్ జీమోల్, కోఆర్డినేటర్‌లు శ్రావణి, రవళి ప్రియ, అకాడమిక్ డీన్ మహేష్, ఏవో రాజేష్, విపి రజిత, చైతన్య శ్రీ శబరి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ యేల్లె శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చందుర్తి:
మండలంలోని బండపల్లిలో అంగన్ వాడి కేంద్రంలో వసంత పంచమి సందర్భంగా సోమవారం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ రేణుక, గ్రామస్తులు పాల్గొన్నారు.


చందుర్తి : అంగన్వాడిలో అక్షర అభ్యాసం



వేములవాడ: చిన్నారులకు అక్షరాభ్యాస నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ - వేములవాడ :
వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపుగా 80 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేసుకున్నారు.

ఎక్కడ ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రానికే ఎక్కువ బడ్జెట్

నిరసనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నిరసన తెలుపుతున్న ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నేతలు

నవతెలంగాణ - సిరిసిల్ల :
ఎన్నికలు ఎక్కడ ఉంటే ఆ రాష్ట్రానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం అధిక బడ్జెట్‌ను కేటాయిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం అనా పైసా ఇవ్వకుండా విస్మరించిందని, బీహార్, ఢిల్లీలో ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రాలకే పెద్ద పీట వేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిసారి తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపెడుతుందని, రాష్ట్రంలోని 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా కేంద్రప్రభుత్వం చేసిన దానికి సిగ్గుపడాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు బేషాజాలకు పోకుండా ఒక సభలో నరేంద్ర మోడీని తెలంగాణ రాష్ట్రానికి పెద్దన్న పాత్ర పోషించాలని కోరారని గుర్తుచేశారు. పేదలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా బిజెపి ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళా అధ్యక్షురాలు వెలుముల స్వరూప, సంగీతం శ్రీనివాస్, కల్లూరి చందన, ఎల్లే లక్ష్మీనారాయణ, చంద్రగిరి శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, గోనె శరణ్య, ఆడెపు చంద్రకళ, గోనె ఎల్లప్ప, గోలి వెంకటరమణ, సుర దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

'కబ్జా భూములు స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలి'


తహశీల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న బిసి సంఘ నాయకులు

నవతెలంగాణ - చందుర్తి :
కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని బిసి సంఘ నాయకులు అన్నారు. సోమవారం ప్రజావాణిలో తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలం లోని పలు గ్రామాల్లో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. వాటిని వెంటనే స్వాధీన చేసుకొని పేదలకు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా నాయకులు పర్షరాం, రమేష్, ప్రసాద్ ఉన్నారు.

మహిళా అఘోరి హల్‌చల్..

- తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఉద్రిక్తత
- వేములవాడకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



అఘోరిని అడ్డుకొని ఆమెతో మాట్లాడి ప్రయత్నం చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి :
రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళా అఘోరి హల్‌చల్ చేసింది. వేములవాడ రాజన్న దేవాలయంలో ఉన్న మసీదును కూల్చేందుకు సోమవారం వస్తానని ప్రకటించడంతో పోలీసులు రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దులోని జిల్లెల గ్రామంలో భారీగా మోహరించారు. గ్రామ శివారులో అడ్డుకున్నారు. దాదాపు మూడు గంటలకుపైగా అఘోరి తన వాహనం నుండి దిగలేదు. తిరిగి పంపించే ప్రయత్నం చేశారు. అయితే కారులో నుండి అఘోరి కిందకు దిగకపోవడంతో పోలీసులు వాహనానికి టోషన్ ఏర్పాటు చేసి సిద్దిపేట జిల్లా సరిహద్దు వరకు తీసుకువెళ్లారు.

జర్నలిస్టుల మహాసభను విజయవంతం చేయండి



వాల్ పోస్టల్ ఆవిష్కరి స్తున్న జర్నలిస్టులు

నవతెలంగాణ - ముస్తాబాద్ :
వేములవాడ పట్టణంలో ఈ నెల 9న నిర్వహించే టియుడబ్ల్యూజేహెచ్ 143 మూడు జిల్లాల మహాసభ పోస్టర్‌ను మండల కేంద్రంలో సోమవారం నాయకులు ఆవిష్కరించారు. జర్నలిస్టుల ఐక్యతను సాధించడం కోసం నిర్వహిస్తున్న కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

'బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మొండిచేయి'


మాట్లాడుతున్న స్వామి

నవతెలంగాణ - ముస్తాబాద్ :
కేంద్ర బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మొండిచేయి చూపారని జాతీయ బిసి సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పేదల, మధ్యతరగతి ప్రజల నుండి పన్నుల రూపేనా రూ.52లక్షలా 65వేలా 300 కోట్ల రూపాయలు వసూలు జేసి అందులో 12లక్షల కోట్లు పేదలకు బడ్జెట్‌లో పెట్టి మిగతా లక్షల కోట్లను కార్పొరేట్ శక్తులకు అనేక విధాలుగా అండగా కేంద్రం నిలుస్తుందని ఆరోపించారు. తెలంగాణకు ప్రత్యేక బడ్జెట్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష డప్పులు.. వేల గొంతుకలు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి :
వీర్నపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ లక్ష డప్పులు.. వేల గొంతుకలు పోస్టరు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 7న జరిగే భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, దేవయ్య, రాజం, అశోక్, దేవరాజు, రాములు, శంకర్, రంజిత్, పోషయ్యా రాజారాం, ఎల్లయ్య, మల్లయ్య, తోట రాజు, దేవయ్య, భూమయ్య పాల్గొన్నారు.

నిర్లక్ష్యం అధికారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వీర్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలను నిరోధించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రతినెల ఏర్పాటు చేస్తున్న పౌర హక్కుల దినోత్సవానికి కొందరు అధికారులు హాజరవడం లేదన్నారు. ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అధికారులే హాజరు కాకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రగఢ్బంధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, అంబేద్కర్ సంఘం యువజన సంఘం యూత్ అధ్యక్షుడు మాసం సుమన్, నరేష్, స్వామి, సురేష్, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ వార్తకు స్పందన


క్లినిక్ ను సీజ్ చేస్తున్న అధికారులు..

పీఎంపీ క్లినిక్ సీజ్


అధికారులు ఇచ్చిన వివరణ పత్రం.

నవతెలంగాణ - రుద్రంగి : నవతెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'పిఎంపి వైద్యం వికటించి బాలికకు సెప్టిక్' అనే కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్పందించారు. ఆర్ఎంపీలు, పిఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి కానీ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎంపి వేసిన ఇంజక్షన్ ద్వారా సెప్టిక్ అయిన బాలిక గాయాన్ని తొలగించి వైద్యం అందిస్తామని కుటుంబ సభ్యులు తెలిపినట్టు జిల్లా వైద్యాధికారులు వారి వివరణలో పేర్కొన్నారు. ఇంజక్షన్ వికటించి బాలికకు సెప్టిక్ కావడానికి కారణమైన పీఎంపీ శీలం మినయ్యకు సంబంధించిన క్లినిక్‌ను మండల వైద్య, రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ క్లినిక్‌ను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రంలో మండల వైద్యాధికారి వేదాచారి, ఆర్ఐ, పోలీస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య.. ఐదు రోజులకు శవం లభ్యం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :
ఎల్లారెడ్డిపేట మండలంలోని కిష్ట నాయక్ తండా గ్రామానికి చెందిన భానోత్ సురేష్ అనే వ్యక్తి ఐదు రోజుల కిందట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి మృతదేహం లభ్యమైంది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహ్యకు కారణాలు తెలియలేదు.

గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

అల్లంకి శ్రీనివాస్ విద్యా సంస్థల చైర్మన్

నవతెలంగాణ పెద్దపల్లి టౌన్



గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం జరిగిందని, విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ అన్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని సోమవాం పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి పలువురు బాలబాలికలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించామన్నారు. ఈ సందర్భంగా అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ సరస్వతీ దేవి ఆశీస్సులు ఉన్న వారి జీవితాల్లో అజ్ఞానమనే చీకట్లు తొలగిపోయి జ్ఞానమనే వెలుగులు నిండుతాయని నమ్మకం. అందుకే వసంత పంచమి రోజున సంగీతం, కళల దేవత, విద్యా దేవత అయిన సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-రామగిరి



కల్వచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, బేగంపేటలోని సాయి ప్రగతి విద్యానికేతాన్ లో చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినం పురస్కరించుకొని వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 65 మంది విద్యార్థులకు అక్షరా భ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల. శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీధర్, అనిల్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-ఓదెల


గాయపడిన గీత కార్మికుడు బుర్ర అంజి గౌడ్

ఓదెల మండల గ్రామానికి చెందిన బుర్ర అంజిగౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజువారి పనులు భాగంగా అంజి తాడిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో గాయాల పాలయ్యాడు. గమనించిన సహచర గీతకార్మికులు మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

నవతెలంగాణ-ఎలిగేడు



ఎలిగేడు మండలం శివపల్లిలో శ్రీమల్లిఖార్జున స్వామి నూతన దేవాలయ నిర్మాణం కోసం సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సతీసమేతంగా భూమి పూజ చేశారు. ప్రత్యేక పూజలు చేసి శిలాన్యాసం, శంఖుస్థాపన వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-ఎలిగేడు



మండలంలోని సుల్తాన్‌పూర్‌లో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వసంత పంచమి వేడుకలు నిర్వహించి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు, శివజ్యోతి, అంగన్‌వాడి టీచర్‌శోభ, జూనియర్ గాయకుడుఅభిరామ్, చిన్నారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి సన్మానం

నవ తెలంగాణ-ఎలిగేడు



మండల కేంద్రానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యా యుడు గ్యాజంగి సత్యనారా యణను సోమవారం ఎలిగే డులో మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 31 ఏళ్లుగా పనిచేసి ఎందరో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం మల్లేశం గౌడ్, కెక్కెర్ల చందు గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రముఖ డాన్సర్ సందీప్ సన్నికి ఘన సన్మానం

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ



8వ కాలనీకి చెందిన ప్రముఖ డాన్సర్ కొండపల్కల సందీప్ కి రిథమ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ యూట్యూబ్ స్టార్ టోనీ,జబర్దస్త్ వెంకీ మంకీ చేతుల మీదుగా ఘన సన్మానం నిర్వహించారు.అకాడమీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ అకాడమిలో శిక్షణ పొందిన సందీప్ కి సన్మానం నిర్వహించినట్లు సంస్థ బాద్యులు సది మాస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఈ అకాడమీలో శిక్షణ పొందిన ఎంతో మంది పెద్ద షోస్ లో ప్రదర్శన ఇస్తూ మంచి స్థాయిలో ఉన్నారని సినిమా ఇండస్ట్రీ లోకి వెళ్ళడానికి రిథమ్ డాన్స్ అకాడమీ ఓ ప్లాట్ ఫామ్ కావాలని అభిలాషించారు.ఈ కార్యక్రమంలో జబర్దస్త్ వెంకీ,బండి లక్ష్మణ్,సాగర్,బంటి తదితరులు పాల్గొన్నారు.

కొమురంభీం పోరాటం దేశానికే స్ఫూర్తి

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ఆనాడు అనేక జాతులను మనుషులుగా చూడలేని పరిస్థితుల్లో జాతులు, మనుషులు వారి హక్కుల కోసం బ్రిటిష్‌వాళ్లతో కొము రం భీం చేసిన పోరాటం దేశానికి స్ఫూర్తిగా నిలి చిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కన్నాయిగూడెం కేంద్రంలో ఆది వాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజనుల ఆరాధ్య దైవం కొము రంభీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి,యువ నాయకుడు జక్కురాకేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ ఆదివాసీ హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో కొమురంభీం పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు.తమ దేవుడిని ప్రతి రోజు చూడాలనే తపన,ఆలోచనతో గిరిజనులు కన్నాయిగూడెంలో కొమురంభీం ఆవిష్కరణకు శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. మహనీయుడి విగ్రహావిష్కరణలో పాల్గొనడం తన అదృష్టమని ఆయన అన్నారు.

గుంతలు పూడ్పించిన కాంగ్రెస్ నాయకుడు

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం-మంథని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుదాటి సంపత్ రావు పూడ్పిం చారు. సోమవారం జెసిబి సహాయంతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో మట్టి పోయించి చదును చేశారు. ప్రయాణికులు, వాహనదారులు ప్రయాణం చేసే క్రమంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలతో పడుతున్న ఇబ్బందులను చూసి గుంతలను పూడ్పించినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- **ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-పెద్దపల్లి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో గద్దెనెక్కిందని, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీబీజీకేఎస్ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బిల్లు పెట్టి కేంద్రంపై ఒత్తిడి తేవాలి కానీ కాంగ్రెస్ కొట్టినట్టు బిజెపి ఏడ్చినట్టు చేస్తున్నాయని, రెండు పార్టీలు ఒకటేనని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా కు సంబంధించిన డీఎమ్ ఎఫ్‌టీ నిధులు ఇక్కడ అభివృద్ధి పనులకు వాడకుండా కొడంగల్‌కు తీసుకుపోయిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. రైతు భరోసా మండలానికి ఒక్కరికి కూడా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను, సింగరేణి కార్మికులను, రైతులను మోసం చేసిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. మేడిగడ్డ నుండి నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తీసుకువచ్చి రైతులకు సాగు నీరు అందించాలని జిల్లా మంత్రి శ్రీధర్ బాబును డిమాండ్ చేశారు. వివక్షతో పాలన చేయవద్దని నిజాయితీ పాలన కావాలని, సీఎం నెలకు మూడుసార్లు ఢిల్లీ టూర్ వెళ్తున్నారు తప్ప రాష్ట్ర అభివృద్ధి పై ఏమాత్రం పట్టింపు లేదని ఆరోపించారు.

దుర్మార్గమైన పాలన కొనసాగుతుంది

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కొనసాగిస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ పట్టుదలతో కృషి చేశారని, 60 ఏళ్ల సమస్యలకు పరిష్కారం చూపిన నేత కేసీఆర్ అని కొనియాడారు. హామీలు నెరవేర్చని అసమర్థత ప్రభుత్వం కాంగ్రెస్ అని 80శాతం ప్రజలు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, టీఎస్‌టీఎస్‌సీ మాజీ చైర్మన్ చిరుమిళ్ళ రాకేష్ కుమార్,మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ రామగుండం డిప్యూటీ మేయర్ అభిషేక రావు, మురళీధర్ రావు, కార్పొరేటర్లు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-పెద్దపల్లి

వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి లోకి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని, రంగంపల్లిలోని మైనారిటీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయుష్మాన్ భారత్ ఓపీ రిజిస్ట్రేషన్, నూతనంగా నిర్మించే ఆసుపత్రి భవనాన్ని, కూల్చివేతకు సిద్ధంగా ఉన్న మూడువార్డులను, డయాలసిస్ జరుగుతున్న మిషనరీలను, స్కానింగ్ ఓపీ రూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆఫ్టల్ ఓపీ సర్జరీలు బాగానే జరుగుతున్నాయని ఇవి కాకుండా ఇంకా సర్జరీలు పెరగాలని,కొత్తగా నిర్మించే ఆసుపత్రి బిల్డింగ్ పూర్తి అయ్యే లోపు ప్రస్తుతం ఉన్న వార్డులను తీసివేసే క్రమంలో వాటిని ఎక్కడికి మార్చాలో వాటిపై వెంటనే సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడి సాయింత్రం సమావేశం ఏర్పాటు చేయాలని, వాటిలో బిల్డింగ్ కు సంబంధించిన వివరాలు మరియు కూల్చివేతకు సిద్ధంగా ఉన్న వార్డుల సంబంధిత సమాచారం తీసుకు రావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం రంగంపల్లిలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య



నవతెలంగాణ-గోదావరిఖని:

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధమైనదిగా ఉందని, ఈ బడ్జెట్ సంపన్నులకు దోచి పెట్టే విధంగా ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ(ఎం) కార్యాలయం, శ్రామిక భవన్ నుండి మెయిన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.యాకయ్య మాట్లాడుతూ విద్య, వైద్యం, రైతు, సంక్షేమం తదితర రంగాలను ఈ బడ్జెట్ విస్మరించిందని అన్నారు. ఈ బడ్జెట్ సామాన్యులను దోచి సంపన్నులకు పెట్టినట్టు ఉందని అన్నారు. ఇలాంటి బడ్జెట్‌తో పేదలకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఇప్పటికైనా బడ్జెట్‌ను సవరించాలని, ప్రాధాన్యత రంగాలకు అధిక కేటాయింపులు జరిగేలా చూడాలని, లేని పక్షంలో భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, గోదావరిఖని పట్టణ కార్యదర్శి ఎ.మహే శ్వరి, కమిటీ సభ్యులు వి.నాగమణిలతోపాటు నవీన్, భాస్కర్, అనూష, రజిత, మణెమ్మ, అరుణ జ్యోతి, సరిత, లక్ష్మీ, లావణ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

నవతెలంగాణ-గోదావరిఖని:



ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాధవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సమాచార హక్కు చట్టం 2005పై రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. మొదటి రోజైన సోమవారం జరిగిన శిక్షణ తరగతుల్లో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టపరచడానికి, రాష్ట్రంలోని ప్రతి పౌరుడు సమాచార చట్టంహక్కు ద్వారా ఏమేమి సమాచారం పొందవచ్చో తెలుసుకోవడా నికి, అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అవకతవకలను సమాచార హక్కు ద్వారా ప్రశ్నించడానికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవడానికి ఈ హక్కులు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ హక్కులను సాధించడానికి ప్రతి పౌరుడు విధిగా సమాచార హక్కు గురించి తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కంపెనీలో పనిచేసిన ఉద్యోగులు, అదేవిధంగా విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రావాల్సిన గ్రాట్యుటీ, పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, సెటిలింగ్ అలవెన్స్ తదితర చెల్లింపులపై సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-ముత్తారం:



సీఈఐఆర్ పోర్టల్ సేవలను సద్వినియోగం చేసుకో వాలని ముత్తారం పోలీసులు అన్నారు. ముత్తారం మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన ఉప్పు శ్రీనివాస్ తన ఫోన్ గత రెండు నెలల క్రితం పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడికి పోలీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఆ ఫోన్ వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలపాలని, సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి, పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి, తిరిగి అప్పగించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్

నవతెలంగాణ-మంథని




పట్టణంలోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో సీపీఐ (ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను ప్రజా సంఘాల నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి,కార్మికులకు అట్టడుగు వర్గ దళిత జాతులకు,విద్యార్థి లోకానికి తీరని నష్టం జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని,ఈ బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని సీపీఐ(ఎం), ప్రజా సంఘాలైన వ్యవసాయ కార్మిక సంఘం,ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ,కెవిపిఎస్, హమాలీ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. దేశంలోని 67శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని,దేశంలోని రైతాంగం మొత్తంఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు చేసినా కూడా మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గొర్రెఇంకల సురేష్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగయ్య,దళిత నాయకులు బూడిద తిరుపతి,సీఐటీయూ నాయకులు, పాల్గొన్నారు.

వేసవికాలం తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

మిషన్ భగీరథ ఏఈ శివ ప్రసాద్

నవతెలంగాణ-జూలపల్లి



రాబోయే వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ ఏఈ శివ ప్రసాద్ అన్నారు. జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో ఓఎచ్ఎస్ఆర్ నీటి ట్యాంకులను, చేతిపంపులను మంచినీటి బావులను పరిశీలించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటిని అందించాలని అధికారులను సూచించారు. ఆయన వెంట ఎంపీవో అనిల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ మహిమిన్, కారోబార్ మల్లేశం, మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్

నవతెలంగాణ-ముత్తారం:


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ అన్నారు. ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో సీసీ కెమెరాల ఉపయోగంపై గ్రామస్తులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల ఏదైనా నేరం జరిగితే నేరస్తులను గుర్తించేందుకు సులువుగా ఉంటుందని, తద్వారా నేరాలు తక్కువ ముఖం పడుతాయని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమన్నారు.

ప్రాక్టికల్స్,ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతం

ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లాలో 33 కేంద్రాలలో బాటని, ఫిజిక్స్, కెమిస్ట్రీ,ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో సోమవారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలో 370 మంది విద్యార్థులకు గాను 367 మంది విద్యార్థులు, ఒకేషనల్ ఎగ్జామ్ కు 780 మంది విద్యార్థులకు గాను 716 మంది విద్యార్థులు ఉదయం హాజరు కాగా మధ్యాహ్నం జరిగిన పరీక్షలో ప్రాక్టికల్స్ కు 204 మంది విద్యార్థులకు గాను 203 మంది విద్యార్థులు, ఒకేషనల్ ఎగ్జామ్ కు 686 మంది విద్యార్థులకు గాను 640 మంది విద్యార్థులు హాజరైనట్టు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన ప్రకటనలో తెలిపారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-గోదావరిఖని:



వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని డి టైప్ క్వాటర్ అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. రామగుండం అర్బన్ సీడీపీవో ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్ కే.సుజాత అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు పుష్ప, యువరత్న పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జనగామ తిరుపతి, పేరెంట్స్ మిట్టపెల్లి మౌనిక, జీల మౌనిక, సతీష్, జిమ్మిడి పద్మ,పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండంలో 8 కోట్ల రూపాయలతో 108 అతి పెద్ద దాసాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. రాముని గుండాల కొండపై వసంత పంచమి సందర్భంగా 108 అడుగుల దాసాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు పనులను శుక్రవారం చేపట్టారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మనాలీ ఠాకూర్ దంపతులు హాజరై విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం ప్రాంతంలో ఇప్పటికే రాముని గుండాల పేరిట ఆధ్యాత్మిక కేంద్రం ఉండగా, 1800 సంవత్సరాల క్రితం నాటి పురాతన ఆంజనేయ స్వామి విగ్రహం రాముని గుండాల కొండపై బయటపడిందని అన్నారు. ఈ క్రమంలో విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ ప్రాంతంలో 108 అడుగుల దాసాంజనేయ స్వామి విగ్రహాన్ని నిర్మించటంతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేస్తామని అన్నారు.

కృష్ణవేణిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి హైస్కూల్‌లో సోమవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. సరస్వతి మాత కటాక్షం కొరకు చిన్న పిల్లల చేత పలక, బలపం పట్టుకొని వేదమంత్రాలతో అక్షరాభ్యాస చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరు కాగా, వేద పండితులైన సంతోష్ శర్మ ఆధ్వర్యంలో పాఠశాలలో గల సరస్వతీ మాత విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అక్షరాభ్యాసం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు వారి పిల్లల చేత వేద పండితులైన సంతోష్ శర్మ అవధానులు చేత పలక బలపం పట్టుకొని సామూహికంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-జూలపల్లి/ధర్మారం



ధర్మారం మండలంలోని కటికనపల్లి గ్రామంలో ఈతామాత వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాల యంలో కృష్ణ గాయత్రి విద్యా ఆధ్యాత్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 52వ సంవత్సర వీరబ్రహ్మేంద్రస్వామి జగద్గురు బ్రహ్మోత్సవాలు, మహా జాతర నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించారు.స్వామివారి రథోత్సవంలో ఒగ్గుడోలు, కోలాటం కళాకారులచే నృత్య ప్రదర్శన చేశారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, ఒగ్గుడోలు కళాకారులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవ తెలంగాణ-రామగిరి : వసంత పంచమి పురస్కరించుకొని ఓసీపీ-1 ఫేస్-2లోని శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కలష పూజ, గణపతి పూజ, నవగ్రహ, అష్టది క్పాలక ప్రత్యేక పూజలు, చండీ హెూమం, తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ నిర్వహించారు. ఆర్జీ-3 ఓసీ-1 గనిలో రక్షణతో కూడిన ఉత్పత్తివృద్ధి, ఉద్యోగుల సంరక్షణ, వారి కుటుంబసభ్యుల బాగోగులకై ప్రతి ఏడు ఆనవాయితీగా వసంత పంచమి రోజున నిర్వహించే ఆలయ వార్షికోత్సవం వేడుకను ఆలయ అర్చకులు సముద్రాల విజయ సారథి, తిరుమల వాసుదే వచార్యులు, కాసార్ల శ్రీనివాసచారి గార్ల వేద మంత్రాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావ్ దంపతులు, ఓసీ-1 ప్రాజెక్టు అధికారి జంగేటి రాజశేఖర్-సంధ్య దంప తులు, గని మేనేజర్ ఉదయ హరిజన్, రక్షణ అధికారి పేరాల శ్రీనివాసరావు-శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను సవరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

నవతెలంగాణ డెస్క్



నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని కెనాల్ వద్ద ప్లే కార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ కార్పోరేట్లకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని 50 లక్షల 65 వేల 345 కోట్ల రూపాయలతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర విషయం, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించే ప్రస్తావన, వ్యవసాయ కూలీలకు కనీస వేతన నిర్ణయం, పని రోజుల పెంచడం, పట్టణ ప్రాంతాలకు విస్తరించడం తదితర అంశాలను విస్మరించారు. విభజన హామీల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ఏవి కేటాయించకపోవడం తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల సీఐటీయూ కన్వీనర్ తాండ్ర అంజయ్య, రైస్ మిల్లు గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, అబ్బాస్. కొమురయ్య, రాజేశం పాల్గొన్నారు

9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



నవతెలంగాణ - కరీంనగర్

ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గైనకాలజిస్ట్ అసోసియేషన్, ఉమెన్ డెవలప్మెంట్ వింగ్ కరీంనగర్ సహకారంతో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, ప్రత్యేక క్యాన్సర్ హెచ్పీవీ వ్యాక్సినేషన్పై అవగాహన శిబిరం, ఉచిత నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ తెలిపారు. కళాభారతి ప్రాంగణంలో ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ ముఖ్య అతిథిగా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ విశిష్ట అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషించిన మున్సిపాలిటీ మహిళ పారిశుధ్య కార్మికుల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాప్స్మియర్ టెస్ట్ ద్వారా సర్విక్స్ క్యాన్సర్ (గర్భాశయ క్యాన్సర్) నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నాట్లు తెలిపారు. మహిళా పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గుర్తిస్తే కాపాడొచ్చు..

- అధునాత చికిత్సతో క్యాన్సర్కు క్యూర్
- జీవన శైలి మార్పుల వల్లే తీవ్రత
- మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లు
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే..

నవతెలంగాణ - కరీంనగర్

ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో క్యాన్సర్ బారిన పడి మృతి చెందుతున్న వారి సంఖ్య రెండో స్థానంలో ఉంది. డబ్ల్యూహెచ్వో లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మూడోవంతు క్యాన్సర్ మరణాలు ఆహారపు అలవాట్లు, జీవనశైలి వల్లే సంభవిస్తున్నాయి. పొగాకు ఉత్పత్తులు వాడే వారి సంఖ్య ఎక్కువ, ప్రతి ఆరుగురిలో ఒకరు క్యాన్సర్ బారిన పడే మృతిచెందుతున్నారు. క్యాన్సర్ వ్యాధిపై ఓ అపోహ ఉంది. మరణం తథ్యమనే భావన చాలా మందిలో నాటుకపోయింది. అందుకే ఒకవేళ క్యాన్సర్ను తొలిదశలో గుర్తించినా డబ్బులు ఖర్చు తప్ప బతికి బట్టకట్టలేమని చాలా మందిచికిత్సకు దూరంగా ఉండేవారు. దీంతో మరణాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీన్ని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలతో యూనియన్ ఆఫ్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డేను నిర్వహించాలని నిర్ణయించింది. క్యాన్సర్ పూర్తిగా క్యూరబుల్.. క్యాన్సర్ వస్తే జీవితం అయిపోయినట్లే అనే అపోహ నుంచి బయట పడాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం క్యాన్సర్ను సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ విధానాల ద్వారా క్యూర్ చేస్తున్నారు. సరికొత్త టెక్నాలజీతో కూడిన రోబోటిక్ సర్జరీ, సైబర్ నైఫ్ వంటి ట్రీట్మెంట్స్ అందుబాటోలకి వచ్చాయి. క్యాన్సర్ లక్షణాలు శరీరంలో మొదలవ్వకముందే వ్యాధిని గుర్తించే క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా అందుబాటులో ఉంది. క్యాన్సర్ పూర్తిగా క్యూరబుల్ అని వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

మన శరీరంలో కణ విభజన అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. ఇది అన్ని భాగాలలో జరగదు. మన శరీరంలో కన్ను, మెదడు, గుండె, మూత్ర పిండాలు వంటి ప్రత్యేక క్రియల కోసం ఏర్పడ్డ అవయవాలు పుట్టినప్పుడు ఏ విధంగా ఉంటాయో జీవితాంతం అదే విధంగా ఉంటాయి. వీటిలో కణవిభజన జరగదు. వయసుతో పాటు వీటిలో సంఖ్య తగ్గుతుంది, కానీ పెరగదు. మరి కొన్ని కణాలు అవసరాన్ని బట్టి పుడుతూ చనిపోతూ ఉంటాయి. ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు నిరంతరం విభజన చెందుతూనే ఉంటాయి. వాటి జీవితకాలం అయిపోగానే అవి చనిపోయి వాటి స్థానంలో కొత్త కణాలు వస్తుంటాయి. కొన్నిసార్లు కణంలో జన్యువులలో వచ్చే మార్పుల వల్ల కొన్ని అవసరంలేని కణాలు ఒక పద్ధతి ప్రకారం కాకుండా నిరంతరం విభజన చెందుతూ ఆరోగ్యకరమైన కణాలను నాశనం చేస్తాయి. వీటికి మరణం లేకుండా నిరంతరం విభజన చెందుతూ అరోగ్యకరమైన కణాలను నాశనం చేస్తాయి. వీటికి మరణం లేకుండా నిరంతరం విభజన చెందుతూనే ఉంటాయి. ఫలితంగా చుట్టు పక్కల ఉన్న కణాలు వాటి విధులు నిర్వర్తించక జీవక్రియలు తగ్గిపోయి క్రమంగా మరణానికి దారి తిస్తోంది. క్యాన్సర్ కణాలు ఒక భాగంలో పుట్టి అక్కడే ఉండవచ్చు లేదా రక్తనాళాల ద్వారా ఒక చోటి నుండి మరో చోటికి వ్యాపించి మిగితా కణాలను నాశనం చేస్తాయి.

అవగాహన మొదటి మెట్టు..



ఫిబ్రవరి 4న ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ డేను పాటించటం ఎంతో ముఖ్యమైనది. ఈ రోజును మనం క్యాన్సర్పై అవగాహన పెంచేందుకు, నిర్ధారణ, చికిత్స, నివారణ మార్గాల గురించి చర్చించేందుకు ఉపయోగించాలి.క్యాన్సర్ ఒక భయంకరమైన వ్యాధిగా కనిపించినప్పటికీ, ముందస్తు నిర్ధారణ, తగిన చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా దాన్ని నివారించచవచ్చు. ఈ సంవత్సరం థీమ్ ఆరోగ్య సంరక్షణలో ఉండే తేడాలను తగ్గించండి. సమానమైన ఆరోగ్య సంరక్షణ అందరికీ అందుబాటులో ఉండాలి. జనరల్ చెకప్లు, స్క్రీనింగ్ పరీక్షలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా పొగ తాగడం, మద్యం సేవించడం వంటి అలవాట్లను విడిచిపెట్టడం, శారీరక వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటివి క్యాన్సర్ను నివారించడంలో సహాయపడతాయి. క్యాన్సర్పై మౌనంగా ఉండకండి. అందరికీ అవగాహన కల్పిద్దాం, ముందస్తు పరీక్షలు చేయించుకోండి, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

- డాక్టర్ శ్రీవంశీచేతన, ప్రముఖ డీఎం మెడికల్ ఆంకాలజీ, సాగర్ హస్పిటల్, క్యాన్సర్ కేర్

జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్

10శాతం క్యాన్సర్లకు జన్యుపారమైన కారణమైతే.. మిగిలిన 90శాతం వారి జీవనశైలే కారణం. ఆహారపు అలవాట్లతో పాటు వాతావారణ కాలుష్యం, హానికర రసాయనాలు, విషపదార్థాల రేడియేషన్ బారిన పడి క్యాన్సర్కు గురవుతున్నారు. ఆధునిక జీవనశైలి కూడా క్యాన్సర్కు ఒక కారకం. చుట్టా, బీడి, సిగరెట్ పొగ తాగడం, గుట్కా, తంబాకు వంటి టోబాకో నమలడం, స్థూలకాయం, అధికబరువు, శారీరక శ్రమ తగ్గడం, మద్యం సేవించేవారు వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. శరీరంలో ఏదైనా అవయవానికి క్యాన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధారణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి.

ముందుగా గుర్తిస్తే మేలు..

మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు.. స్థూలకాయం, కూరగాయలు మితంగా తినడం, శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం.. ఇలాంటి వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదముంటుంది. నాలుగు దశల్లో క్యాన్సర్ను గుర్తించవచ్చు. మొదటి దశలో శరీరంలోని క్యాన్సర్ కణాల్ని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి సరైన చికిత్స అందించవచ్చు. ఇలా చెయ్యడం ద్వారా 95 నుంచి 100శాతం వరకూ వ్యాధి నయం చేయవచ్చు. రెండో దశలో క్యాన్సర్ కణాలు ఒక భాగం నుంచి ఇతర భాగాలకు కొంచెం కొంచెంగా విస్తరించడం ప్రారంభమవుతుంది. వీటికి రేడియో థెరపీ అందితే 70 నుంచి 80శాతం వరకూ పూర్తి స్థాయిలో నయం అవుతుంది. ఇక మూడో దశలో ఇతర భాగాలకు పూర్తిగా విస్తరిస్తుంది. రేడియేషన్, కీమోథెరపి ఇస్తే 50 నుంచి 60శాతం మందికి వ్యాధి తగ్గుముఖం పడుతుంది. ఇక చివరి దశలో క్యాన్సర్ కణాలు కీలకమైన అవయవాలకు సోకుతాయి. ఇలాంటి వారికి వైద్యం అందించినా.. ఆశించిన ఫలితం ఉండదు. కేవలం 5 నుంచి 10శాతం మంది మాత్రమే బతికే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పిల్లి రవియాదవ్

నవతెలంగాణ - వీణవంక



తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్ విమర్శించారు. రాష్ట్రం నుండి ఇద్దరు మంత్రులున్నా ఒక్క ప్రాజెక్ట్కు జాతీయ హోదా, వెనుకబడిన జిల్లాల జాబితాలో పేరు రాలేదని అన్నారు. రైతులు, కార్మికులుకు తీవ్ర నష్టం చేకూరేలా బడ్జెట్ ఉందన్నారు. మరోవైపు ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా బీజేపీ ప్రభుత్వానికి దేశం మీద ప్రేమ ఉంటే పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసే విధంగా బడ్జెట్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలం

యువజన కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు శ్రీకాంత్

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడగే శ్రీకాంత్ అన్నారు. కేంద్ర బడ్జట్లో తెలంగాణపై వివక్ష చూపారని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ కొమురయ్య, బిజిగిరి శ్రీకాంత్, యేభూషి అజయ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'



నవతెలంగాణ - వీణవంక

వీణవంక మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్బివిఆర్ఆర్ కార్యవర్గ సభ్యుడు నల్ల కొండాల్రెడ్డి, మండల అధ్యక్షుడు మూల పుల్లారెడ్డి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఒక విద్యావంతుల సభకు ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న పదేపదే ఓసిలను కించపరుస్తూ మాట్లాడటం తగదన్నారు. బిసిలకు మీరు నిజంగానే న్యాయం చేయాలనివుంటే ముందుగా అధికార పార్టీకి రాజీనామా చేసి కొట్లాడాలని, ఏదో వారి మెప్పుకోసం ఇతర సామాజిక తరగతుల వారిని తిడితే సహించరని అన్నారు. ఆర్య వైశ్య మండల ఉపాధ్యక్షుడు పల్లెర్ల కిరణ్, జిల్లా నాయకులు పోరెడ్డి తిరుపతిరెడ్డి, గూటం సమ్మిరెడ్డి, కంతాల కొండల్రెడ్డి, నాగిడి మధుసూదన్రెడ్డి, అల్లుగవెళ్ళి మోహన్రెడ్డి, ఉపేందర్రెడ్డి, శభరీశ్వేర్రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న గుడికి భూమిపూజ

నవతెలంగాణ - వీణవంక



వీణవంక మండలంలోని మల్లన్నపల్లి గ్రామ శివారులో పురాతన కాలం టేకుల మల్లన రాతి విగ్రహస్థానంలో గుడి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. పోతరవేన రవీందర్, పోతరవేన మహేందర్, గడల శ్రీనివాస్, మండల కిష్టయ్య మాట్లాడుతూ విరాళాలతో గుడి నిర్మిస్తున్నట్టు తెలిపారు.

పత్తి క్వింటాల్ కు గరిష్ట ధర రూ.7,170

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్కు కాటన్ విడిపత్తి 77 క్వింటాళ్లు 13 వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకు వచ్చారు. గరిష్ట ధర రూ.7,170, మోడల్-7,100, కనిష్ట -6,900 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో మండల కళాకారులు



నవతెలంగాణ - చిగురుమామిడి

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ చౌరస్తాలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చిగురుమామిడి మండలానికి చెందిన కళాకారులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, లంబాడిపల్లె గ్రామాల భజన బృందాలు స్వామివారి కీర్తనలు ఆలపించారు. కళాకారులను నిర్వాహకులు ప్రశంస పత్రంతో పాటు మెమెంటో, శాలువాతో సత్కరించారు. చిగురుమామిడి కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, గందె కొమురయ్య, జవ్వాజి రాములు, చందబోయిన పరశురాములు, పెనుకుల తిరుపతి, మొగిలి బొందయ్య, దుడ్డెలా రవి, మెడబోయిన రాజయ్య, చిట్టంపల్లి మురళి, గూళ్ళ కొమురయ్య, పెసరి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



నవతెలంగాణ - వీణవంక

వీణవంక మండలం చల్లూరు గ్రామంలో బిఆర్ఎస్ మైనార్టీ నాయకుడు, మజీద్ కమిటీ సదర్ ఎండీ.నసీరోద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు ఎండీ.సాహెబ్ హుస్సేన్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ ఇజాజ్ పాషా, నాయకులు అలె మధుసూదన్, నారాయణదాసు కార్తీక్, సోహెల్ హైమద్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

నవతెలంగాణ - హుజురాబాద్

రాష్ట్రంలో సగానికిపైగా ఉన్న బీసీలను తప్పుడు లెక్కలు చూపి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, ప్రభుత్వ నివేదిక తప్పులతడక అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ ప్రెస్క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ కుల గణన వివరాలు వెల్లడించగా తప్పుల తడకగా వుందన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మాటూరి శ్రీనివాస్గౌడ్, ఐలయ్యగౌడ్, సదానందంగౌడ్, ఐలయ్య యాదవ్, ప్రవీణ్, క్రాంతి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్లో నిర్వహించే లక్ష డప్పులు - వేల గొంతుల మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన వాల్ పోస్టర్ను మాదిగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం నాయకులందరూ డప్పుల దరువుతో ఊరంతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ కుల సంఘం గౌరవ అధ్యక్షుడు పారునంది జలపతి, అధ్యక్షుడు పార్నంది మల్లేష్, ఉపాధ్యక్షుడు పర్నంది పోచమల్లు, సంయుక్త కార్యదర్శి పార్నంది కిషోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయాలి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కమాన్ ఫార్మసీ ప్రారంభం

నవతెలంగాణ - కరీంనగర్



రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం కరీంనగర్ నగరంలో కమాన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కమాన్ ఫార్మసీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఫార్మసీ రంగంలో రాణించాలని, ఈ ఫార్మసీ ద్వారా ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్సింగ్, మాజీ ఎమ్మెల్సీ నారదసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, సుడా మాజీ ఛైర్మెన్ జివి.రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

'దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ - జమ్మికుంట

ప్రభుత్వం దూదేకుల కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని, నాలుగు నుండి ఆరు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని ఆల్ బీసీ మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకుష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. నాయకులు మహమ్మద్ రియాజ్, మహమ్మద్ ఇలియాజ్, మహమ్మద్ మహమూద్, మహమ్మద్ ఖాదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పార్టీ అభ్యర్థి వి.నరేందర్రెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిచ ప్రముఖ విద్యా సంస్థ అల్ఫోర్స్ ఛైర్మన్ డాక్టర్ వి.నరేందర్రెడ్డి పార్టీ నాయకుల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నంలో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా రామగుండం శాసనసభ్యుడు మక్కన్సింగ్ రాజ్ ఠాకూర్ను కలుసుకుని తన అభ్యర్థిత్వానికి మద్దతు కోరారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీలు టి.జీవన్రెడ్డిని, కోదండరాం కలుసుకొని వారి ఆశీస్సులు పొందారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, పట్టభద్రుల మద్దతుతో తన గెలుపు ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యావేత్తగా విద్యా రంగానికి చేసిన సేవలను ఓటర్ల ముందుకు తీసుకెళ్లేలా ఆయన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



హుజురాబాద్ : వేడుకల్లో న్యూ కాకతీయ మోడల్ స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. రంగనాయకుల గుట్ట సమీపాన పాటిమీద ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో సరస్వతీ మాత ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్, విజ్ఞాన్ నెక్ట్ జెన్, పలు పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ గందె శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, అపరాధ ముత్యంరాజు, పూజారులు తిరునగరి తిరుమలేష్, తిరునగరి సత్యనారాయణస్వామి, లలిత్ కుమారాచార్యులు, కుర్జీ ప్రదీప్, ప్రసాద్ పాల్గొన్నారు.

అచీవర్స్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్



కరీంనగర్ : అచీవర్స్ పాఠశాలలో

నగరంలో కోతి రాంపూర్లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యాసంస్థల్లో



స్థానిక మంకమ్మతోట, సీతారాంపూర్లోని సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్లో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని బంతిపూలు, మామిడితోరణాలు, రంగవల్లులు అలంకరించారు. శ్రీ సరస్వతీ దేవి పూజ, హోమం నిర్వహించగా, పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ చేతులమీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీణవంక



వసంత పంచమి సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో వీణవంక వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్షరాభ్యాసం చేసిన పిల్లలకు పుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్నులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు హరిబాబు, స్వాతి, శ్రీధర్, నారాయణ, రమేష్, విశ్వంభర్ పాల్గొన్నారు.

గీత విద్యాలయంలో సామూహిక అక్షరాభ్యాసం



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని గీత విద్యాలయం పాఠశాలలో వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ గుర్రం ఆనందరెడ్డి, డైరెక్టర్ ఆర్.లింగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జమ్మికుంటలో

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. 100మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

చిన్న పరిశ్రమలపై చిన్నచూపు

2025-26 బడ్జెట్‌లో ఉద్దీపనల ఊసెత్తని కేంద్రం

- మూసేసిన పరిశ్రమలపై విధానం కరువు
- ఏడేండ్లుగా రాష్ట్రంలో నిలిచిన రూ.4 వేల కోట్ల సబ్సిడీలు
- ఎన్నికల ముందిచ్చిన హామీపై నోరెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- తెలంగాణలో కుదేలవుతున్న చిన్న పరిశ్రమల రంగం

భారత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక (ఎమ్ఎస్ఎమ్ఈ) రంగానికి 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలే చేపట్టింది. దీర్ఘకాలంలో బతికి బట్టకట్టేలా ఉద్దీపనలు ప్రకటించకుండా కేవలం వాటి స్థాయిని పెంచి చేతులు దులుపుకుంది. మార్కెట్ అవకాశాలు, ప్రోత్సాహకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడడం. ఏడేండ్లుగా ఈ రంగానికి రావాల్సిన రూ.4 వేల కోట్లకుపైగా సబ్సిడీలు చెల్లించకపోవడం, మూసేసిన పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్రంలో కుదేలైంది. ఫలితంగా వేలాది పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారు.



ఊరగొండ మల్లేశం

"మేక్ ఇన్‌ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా" అని గొప్పలు చెప్పుకునే మోడీ సర్కార్ 2025-26 బడ్జెట్‌లో ఎమ్ఎస్ఎమ్ఈ రంగం గుర్తింపు పెంచి చేతులు దులుపుకుంది. సూక్ష్మ పరిశ్రమలకు రూ.కోటి నుంచి 2.5 కోట్లు, చిన్న పరిశ్రమలకు రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లు, మధ్యతరహా పరిశ్రమలకు రూ.50 కోట్ల నుంచి 125 కోట్లకు పెట్టుబడి మొత్తాన్ని పెంచింది. స్టార్టప్‌ల పెట్టుబడి మొత్తాన్ని రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచింది. అలాగే టర్నోవర్ మొత్తాన్ని సైతం రెండింతలకు పైగా పెంచింది. కేటగిరీల వారీగా ఈ రంగం స్థాయిని పెంచారే తప్ప వాటికి ఎలాంటి ప్రోత్సాహకాలు ప్రకటించలేదు. విద్యుత్, పెట్టుబడిపై రాయితీలు, ముడిసరుకు దిగుమతి, ఉత్పత్తుల ఎగుమతిపై సుంకాల తగ్గింపు లాంటి ఉద్దీపనలు బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. మార్కెట్ అవకాశాలు, ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణపై ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు వెల్లడించలేదు. ఎమ్ఎస్ఎమ్ఈ రంగానికి ఏదో చేశామని చెప్పుకునేందుకే వాటి స్థాయిని పెంచారే తప్ప ఆదుకునేందుకు నిర్దిష్టమైన నిర్ణయాలు బడ్జెట్‌లో లేవు.

కుదేలవుతున్న చిన్న పరిశ్రమలు

తెలంగాణలో 2024 గణాంకాల ప్రకారం ఎమ్ఎస్ఎమ్ఈ రంగంలో దాదాపు 80 వేలకు పైగా పరిశ్రమలు ఉన్నాయి. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సగానికిపైగా ఉండగా, మిగిలిన సగం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. గత ఏడేండ్లలో రాష్ట్రంలో ఈ రంగానికి చెందిన దాదాపు 10 వేలకు పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. ఇందులో ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 5వేలు, మిగతా జిల్లాల్లో 5 వేలు ఉన్నాయి. మార్కెటింగ్, నైపుణ్యలేమి, ప్రోత్సాహకాలు సకాలంలో అందించక పోవడం, ప్రభుత్వ నిర్ణయాలు స్థిరంగా లేకపోవడం, పథకాలను అమలు పరిచే అధికార యంత్రాంగం వైఫల్యం మూలంగా ఈ రంగం తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

పెండింగ్‌లో రూ.4వేల కోట్ల సబ్సిడీలు

కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా విరివిగా ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళుతుందనే భావనతో ప్రభుత్వం వీటికి వివిధరకాల రాయితీలు అందిస్తోంది. కొత్తగా పరిశ్రమ ఏర్పాటు చేసేటప్పుడు స్టాంప్‌డ్యూటీ రిఫండ్ 20 నుంచి 25 శాతం వరకు చెల్లిస్తారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధారణ రాయితీతో పాటు అదనంగా 10 శాతం ఇస్తారు. షెడ్యూల్ కులాలు, తెగల వారికి ప్రత్యేక రాయితీలను అందిస్తారు. దీర్ఘకాల రాయితీ అయిన విద్యుత్ వాడకంపై యూనిట్‌కు రూ.1 అన్ని కేటగిరీలకు వర్తింపజేస్తారు. ఇవి కాకుండా జిల్లా, మండల స్థాయిలో పరిశ్రమల వారీగా, ప్రాంతాల వారీగా కొన్ని అదనపు రాయితీలను కూడా అందిస్తారు. అయితే ఏడేండ్లుగా ఈ రంగానికి చెల్లింపులు నిలిచిపోయాయి. 2017 నుంచి ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఎంపిక చేసిన కొన్ని పరిశ్రమలకు మాత్రమే రూ.300 కోట్ల వరకు చెల్లించారు. మిగతా రూ.4.000 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

మాట తప్పుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీటి బకాయిలను అణా పైసాతో సహా చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఏడాదిగా పైసా విదిల్చలేదు. గత సర్కార్ హయాంలో ఉన్న రూ.3,500 కోట్లకు మరో రూ.500 కోట్లు అదనంగా పేరుకుపోవడంతో బకాయిల చెల్లింపులు రూ.4,000 కోట్లకు చేరుకున్నాయి. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక విధానానికి కొన్ని మార్పులు చేసి తెలంగాణ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీ-24 పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.

రాయితీలు, భూముల కేటాయింపును కొంత సరళతరం చేసింది. అలాగే మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు ప్రాతినిధ్యం కల్పించింది. పాలసీ పరంగా కొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ వాటి అమలుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత సర్కార్ కూడా చిన్న పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి రెడ్ కార్పెట్ పరుస్తామని చెప్పినా.. ఆచరణలో విఫలమైంది. 2017 నుంచి ఈ రంగానికి చెల్లించాల్సిన బకాయిలే ఇందుకు నిదర్శనం. రేవంత్ సర్కార్ సైతం అదే బాటలో నడుస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పునరుద్ధరణపై చర్యలు శూన్యం

రాష్ట్రంలో మూత పడ్డ పరిశ్రమలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2018లో తెలంగాణ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. పరిశ్రమల శాఖ కమిషనర్, టీఎస్ఐఐసీ ఎమ్‌డీలతో పాటు బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన నిపుణుల సారథ్యంలో ఈ క్లినిక్ పనిచేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మూతపడ్డ పరిశ్రమలకు రుణాలు, మార్కెటింగ్ నైపుణ్యం, ఉత్పత్తిలో ఆధునిక మెళకువలను అందిస్తుంది. సరైన ప్రచారం లేకపోవడంతో మూతపడ్డ పరిశ్రమలను తెరిచేందుకు సహాయం కావాలంటూ ఎవరూ హెల్త్ క్లినిక్‌ను సంప్రదించడం లేదు. 2017 నుంచి దాదాపు 10 వేలకు పైగా పరిశ్రమలు మూత పడితే ఈ సంస్థ ఎంపిక చేసిన 350 పరిశ్రమలకు మాత్రమే సహాయం అందించింది. ఈలెక్కన వందేండ్లు గడిచినా ఖాయిలా పరిశ్రమలు తిరిగి పునరుద్ధరణకు నోచుకోవు. గతంలో జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన, పరిశ్రమల మేనేజర్, బ్యాంక్ మేనేజర్లు సభ్యులుగా పునరుద్ధరణ కమిటీలు ఉండేవి. ఈ కమిటీలు ప్రతి నెలా సమావేశమై జిల్లాలో మూత పడ్డ పరిశ్రమలపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకునేవి. స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉండేవి. 2018లో తెలంగాణ హెల్త్ క్లినిక్ ప్రారంభమైనప్పటి నుంచి జీరో సక్సెస్ రేట్ కన్పిస్తోందని స్వయంగా అధికారులే వాపోతున్నారు.

అభయాలు...ఆశీర్వాదాలు

- ఎమ్ఎస్ఎమ్ఈకి కేంద్ర బడ్జెట్‌లో దక్కింది ఇదే
- అటకెక్కిన ఆత్మనిర్భ భారత్..
- గతేడాది ఎంతమందికి...ఎంతిచ్చారో లెక్కాపత్రం లేదు
- వచ్చిన ఉద్యోగాలెన్నో చెప్పే నాథుడు లేదు
- ఆత్మనిర్భర్ భారత్, స్టాండప్, స్టార్టప్ ఇండియాలను సమీక్షించాలి
- నిర్మలమ్మ బడ్జెట్‌లో అన్నీ శుష్కవాగ్దానాలే : ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎమ్ఈ) జాతీయ అధ్యక్షులు ఏపీకే రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎమ్ఎస్ఎమ్ఇ) అభయాలు, ఆశీర్వాదాలు మాత్రమే దక్కాయి. రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు క్రెడిట్ సౌకర్యం పెంపు అనేది కేవలం రాజకీయ హామీనే తప్ప, క్షేత్రస్థాయిలో అమలయ్యేది కాదు. ఇంతకుముందు ప్రకటించిన ఆత్మనిర్భర్ భారత్‌ను కూడా ఆరంభ శూరత్వంగా ఫేస్-1 కొంత వరకు అమలు చేశారు. ఆ తర్వాత ఫేస్-2ను పూర్తిగా అటకెక్కించారు. ఎమ్ఎస్ఎమ్ఇకి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే బ్యాంకర్ల సమావేశాల్లో (ఎస్ఎల్‌బీసీ) బ్యాంకర్లు చెప్పే లెక్కలన్నీ గందరగోళంగా, తప్పుల తడకగా ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఎమ్ఎస్ఎమ్ఇ యూనిట్లకు రాయితీలతో కూడిన రుణాలు ఇచ్చారు? కొత్తగా వచ్చిన యూనిట్లు ఎన్ని? వాటి ద్వారా ఎంతమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయనే గణాంకాలను వెల్లడించాలి. అలాంటి పున్షశ్చరణ లేకుండా, కేవలం కాగితాలకే పరిమితమయ్యే ఆకర్షణీయ పథకాలు ప్రకటిస్తే ఏ ప్రయోజనం ఉండదు. క్షేత్రస్థాయిలో పారిశ్రామిక శాఖ కార్యాలయాలు బూజు పట్టి, కూలిపోయే భవనాలు, విరిగిన కుర్చీలతో దరిద్రంగా ఉన్నాయి. పరిశ్రమల శాఖలో ఖాళీలు భర్తీ చేసి ఏండ్లు గడుస్తున్నాయి. రిటైర్ అయిన వారి స్థానాల్ని భర్తీ చేయట్లేదు. కేంద్రం ప్రకటించిన విశ్వకర్మ గ్రాంట్ పథకం కేవలం మొక్కుబడి మాత్రమే. అమలులో చిత్తశుద్ధి లేదు. పర్యవేక్షణ అసలే లేదు. గత అనుభవాలు ఈ మాటలు చెప్పేలా చేస్తున్నాయి. పారిశ్రామికవేత్తలకు ఎగ్జిట్ పాలసీనే లేదు. ఎమ్ఎస్ఎమ్ఇ వృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వం ఒక్కో రాష్ట్రానికి కనీసం రూ.5వేల కోట్ల నిధులను గ్రాంటురూపంలో ఇవ్వాలి. భూముల అభివృద్ధి కోసం ఆయా రాష్ట్రాల్లోని పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థలకు రూ.1,500 కోట్లు ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో సూక్ష్మ చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తల ఇబ్బందులను తెలుసుకోకుండా, కేవలం ఆర్భాట ప్రకటనలు చేస్తే, ఆ తర్వాత కేంద్రమే అభాసుపాలు కావల్సి వస్తుంది. దేశంలో భవన నిర్మాణ రంగం తర్వాత అత్యంత ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేది ఎమ్ఎస్ఎమ్ఇ రంగమే. పారిశ్రామికవేత్తలకు రాయితీల రీయింబర్స్‌మెంట్ విధానం వద్దు. వాటిని నేరుగా కేంద్ర ప్రభుత్వమే ఆయా శాఖలకే చెల్లించేలా విధాన నిర్ణయం తీసుకొని, దానికి చట్టబద్ధత కల్పించాలి. ఆత్మనిర్భర్ భారత్, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా పథకాలను ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి సమీక్షించాలి. ఇవి కేవలం ప్రకటనలే. విశ్లేషిస్తే వాస్తవాలు వెల్లడి అవుతాయి. ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కెపాసిటీ బిల్డింగ్ అనేది గతంలో ఉండేది. ఇప్పుడు ఏ రాష్ట్రంలోనూ సరైన కంప్యూటర్, మౌలిక సౌకర్యాలు లేవు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐ-ఎమ్ఎస్ఎమ్ఇ), రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎమ్ఎస్ఎమ్ఈ పెరఫార్మెన్స్ (ర్యాంప్), చేతి వృత్తులు, కళాకారులను 18 ట్రేడ్లలో ప్రోత్సహిం చడం కోసం ఉద్దేశించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం వంటి వాటికి అరకొర నిధులు కేటాయించారు. దీనివల్ల ఆశించిన ప్రగతి, పురోగతి సాధ్యం కాదు. ఎమ్ఎస్ఎమ్ఇకి కేవలం మొక్కుబడిగానే నిధుల కేటాయింపు జరిగింది.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్ (వీహబ్)ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్‌ను ఊహించలేము. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. మహిళాశక్తి, మహాలక్ష్మి పథకాలు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా వారికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి వచ్చిన మహిళలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ హబ్ సీఈఓ సీతా పల్లచోల్లాతో పాటు పలువురు మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు

- తొలి రోజు కరీంనగర్‌లో 9 మంది, నల్లగొండలో ఒకరు



నవతెలంగాణ - కరీంనగర్, నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధులు

మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో తొలి రోజు 9 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 6 నామినేషన్లు, ఉపాధ్యాయ స్థానానికి 3 నామినేషన్లు వచ్చాయి. కాగా, ఇద్దరు అభ్యర్థులు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి రెండింట్లోనూ నామినేషన్లు వేశారు. మొత్తం 13 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులకు తగిన సూచనలు సలహాలు అందించేందుకు కలెక్టరేట్ ఆవరణలోనే అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ తొలి నామినేషన్ దాఖలు

వరంగల్- ఖమ్మం-నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తొలి నామినేషన్ దాఖలైంది. ప్రజావాణి పార్టీ తరపున లింగిడి వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ వేశారు.

విద్యార్థులపై అభ్యంతరాల భారం

(మొదటిపేజీ తరువాయి)

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం ఐసెట్, పీజీ ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం పీజీఈసెట్, బీఎడ్‌లో ప్రవేశాల కోసం ఎడ్‌సెట్, లాటరల్ ఎంట్రీలో ప్రవేశాల కోసం ఈసెట్, బీపీఈడీ, డీపీఈడీ ప్రవేశాల కోసం పీఈసెట్, లా కోర్సుల్లో ప్రవేశాల కోసం లాసెట్‌ను ఏటా ఉన్నత విద్యామండలి నిర్వహిస్తుంది. ఈ ఏడు ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రం ప్రాథమిక కీపై అభ్యంతరాలకు ఫీజు వసూలు చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. రాష్ట్రంలో ఉన్నత వర్గాలు, సంపన్నుల పిల్లలు ఐఐటీలు, ఎన్ఐటీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారు జేఈఈ రాస్తున్నారు. మెడికల్ సీట్ల కోసం నీట్ రాస్తున్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, పేద విద్యార్థులే ఇంజినీరింగ్ సహా ఇతర వృత్తి విద్యాకోర్సుల్లో చేరేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. వారిపై ప్రాథమిక కీపై అభ్యంతరాల కోసం ఫీజు వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఎప్‌సెట్ సహా ఇతర ప్రవేశ పరీక్షల దరఖాస్తు ఫీజు కట్టడానికే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత విద్యామండలి నిర్ణయంతో విద్యార్థులపై మరింత భారం పడనుంది. ఈ విధానం అమల్లోకి వస్తే ఎక్కువ మంది అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆలోచన చేసే ప్రమాదమున్నది. ఉద్యోగాల భర్తీ కోసం టీజీపీఎస్సీ, డీఎస్సీ, ఇతర నియామక సంస్థలు కూడా అభ్యంతరాలకు ఫీజును నిర్ణయించే అవకాశం లేకపోలేదు. అయితే అభ్యంతరాలు నిజమైతే ఆ ఫీజును వాటిని పంపిన విద్యార్థులకు తిరిగి చెల్లిస్తారని అధికారులు చెప్తున్నారు. ఒకవేళ లేవనెత్తిన అభ్యంతరం తప్పు అయితే ఆ ఫీజును తిరిగి చెల్లించే అవకాశం లేదు. ప్రాథమిక కీపై అభ్యంతరాలకు ఫీజు చెల్లించాలని నిర్ణయించడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు : ఖమ్మంలో మంత్రి తుమ్మల



నవతెలంగాణ-విలేకరులు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 -26 బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, సీఎం రేవంత్.. ఢిల్లీలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలసి విజ్ఞప్తి చేసినా వివక్ష చూపారని తెలిపారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మోడీ సర్కార్ బడ్జెట్‌లో రాజకీయ ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. పోలవరం మాదిరి తెలంగాణలో సాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వలేదని, తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, విమానాశ్రయాలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో అంబేద్కర్ విగ్రహం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఇల్లందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇచ్చారు. సంగారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ బస్టాండ్ సెంటర్‌లో ప్రధానమంత్రి మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

కులగణనపై కాంగ్రెస్‌వి కాకి లెక్కలు

- బీసీ రిజర్వేషన్ పెంపుపై అసెంబ్లీలో బిల్లు తేవాలి
- సింగరేణి డిపెండెంట్ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- మా హయాంలో కార్మికుల జీవితాలు మార్చితే...
- కాగితాలు మార్చుతున్న కాంగ్రెస్ సర్కారు : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

'కుల గణనపై కాంగ్రెస్ సర్కారు కాకి లెక్కలు చెప్పింది. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీకు సరైన వాటా ఇవ్వాల్సిందే. బీసీ రిజర్వేషన్ పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో కార్మికుల జీవితాలు మార్చితే.. కాంగ్రెస్ మాత్రం కాగితాలు మార్చుతోంది. సింగరేణిలోని డిపెండెంట్ అసియాస్ సమస్య పరిష్కారంలో పూర్తిగా విఫలమైంది. కొద్దిరోజుల్లోనే సింగరేణి ఎన్నికలు రాబోతున్నాయి. అందులో బీఆర్ఎస్ కార్మికసంఘం విజయం ఖాయమం" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో సోమవారం పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు. 2011 జనగణన ప్రకారం రాష్ట్రంలో 83 లక్షల ఇండ్లు ఉండగా, 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.03 కోటి ఇండ్లు, 3.68 కోట్ల మంది జనాభా గుర్తించామని తెలిపారు. అప్పుడు నాలుగేండ్లలో 20లక్షల ఇండ్లు పెరిగితే, ఈ పదేండ్లలోనే జనాభా ఎంత పెరగాలని ప్రశ్నించారు. 2014-2024 మధ్యలో దాదాపు 60 లక్షల కుటుంబాలు పెరగాల్సిన పరిస్థితిలో 20 లక్షలకుపైనే లెక్కలో చూపించకపోవడం ఏంటని ప్రశ్నించారు. 2011లోనే 50-52శాతం బీసీలు ఉన్నట్టు లెక్క ఉంటే ఇటీవల ప్రభుత్వ లెక్కల ప్రకారం 46.2శాతం ఉండటమేంటని అన్నారు. ఈ లెక్కలన్నీ కాకి లెక్కలేనన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కుల గణన మళ్లీ నిర్వహించి సమగ్ర లెక్క తీయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీ సంఘాలను సమీకరించి, బీసీ సాధికారత కోసం ఉద్యమిస్తామని చెప్పారు.

కొడంగల్‌కు సింగరేణి నిధులు

సింగరేణి నిధులను డీఎంఎఫ్టీ పేరుతో కొడంగల్‌కు తరలించుకుపోతున్నారని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో బోనస్‌ను 32శాతానికి పెంచి తాము కార్మికుల జీవితాలు మార్చితే కాంగ్రెస్ వాళ్లు కాగితాలు మార్చుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో 13 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చినట్టు తెలిపారు. 'డిపెండెంట్ అలియాస్' సమస్యపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు ఆ సమస్య కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సింగరేణిలో త్వరలోనే ఎన్నికల సైరన్ మోగుతుందని, అందులో బీఆర్ఎస్ అనుబంధ సంఘం విజయం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో 8మంది కాంగ్రెస్, మరో 8మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రామగుండానికి సింగరేణి మెడికల్ కాలేజీ వచ్చిందని గుర్తు చేశారు. ఇకపై రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. రాత్రికల్లా రైతుభరోసా డబ్బులు వేస్తామని చెప్పిన రేవంత్ ఏ గ్రామంలో ఒక్క మూలకు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సింగరేణి కార్మికులను, విద్యార్థులను, మహిళలను, రైతులను అందరినీ కాంగ్రెస్ మోసం చేస్తోందన్నారు. ఈ పర్యటనలో ఆమె వెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ సివిల్ సప్లై కమిషనర్ సర్దార్ రవీందర్‌సింగ్, గ్రంథాలయ మాజీ చైర్మెన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సత్తినేని శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

కాంట్రాక్టర్ దానయ్య నిరసన

- రూ. 50 లక్షలతో నిర్మించిన జడ్పీ గెస్ట్‌హౌస్‌లోనే కార్యాలయం
- నిర్మాణం పూర్తి చేసినా బిల్లులు రాని వైనం
- పలుమార్లు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఘటన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి (ఇబ్రహీంపట్నం)

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం జడ్పీ గెస్ట్ హౌస్‌లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయానికి కాంట్రాక్టర్ తాళం వేశాడు. భవన నిర్మాణం పూర్తి చేసి ఏండ్లు గడుస్తున్నా బిల్లులు విడుదల చేయడం లేదని నిరసన తెలిపాడు. గతంలో కూడా పలుమార్లు కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశాడు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో సోమవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేశాడు. దాంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ సునీతారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నాలుగేండ్ల కిందట రూ.50 లక్షలతో జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవన నిర్మాణం పనులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ దానయ్యకు అప్పగించారు. ఎలాంటి ప్రోసిడింగ్ పత్రాలు లేకుండానే కాంట్రాక్టర్ దానయ్యతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన భవన నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించారు. ఇదిలా ఉంటే తహసీల్దార్ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలోనే కొత్తది నిర్మించాలని భావించారు. అప్పటి వరకు పూర్తయిన జడ్పీ గెస్ట్‌హౌస్‌లో తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగించాలని అక్కడికి మార్చారు. ఈ క్రమంలో జడ్పీ గెస్ట్‌హౌస్ నిర్మించిన కాంట్రాక్టర్ దానయ్యకు ప్రభుత్వం కొన్ని నిధులను విడుదల చేసింది. మిగిలిన బిల్లులు ఇప్పించాలని ఆయన పలుమార్లు ఆందోళనకు దిగారు. కానీ బిల్లులు విడుదల చేయలేదు. అప్పులు చేసి భవన నిర్మాణం చేపట్టినందున వడ్డీలు పెరిగిపోతున్నాయని బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కాంట్రాక్టర్ వేడుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. దాంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం 9 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశాడు. కార్యాలయంలోకి అధికారులు వెళ్లకుండా అడ్డుకున్నాడు. తనకు ఇంజినీరింగ్ అధికారుల ద్వారా హామీ రావాలని వేడుకున్నాడు. తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాంట్రాక్టర్ దానయ్యతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించు కోవాలని, రెవెన్యూ కార్యాలయానికి తాళం వేయడం సరికాదని పోలీసులు సూచించారు. ఇంజినీరింగ్ అధికారితో హామీ ఇప్పిస్తేనే నిరసన విరమిస్తానని కాంట్రాక్టర్ తెలిపాడు. దాంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత తహసీల్దార్ సునీతారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు.



పాల వ్యాపారంలో దూసుకుపోతూ..

అనారోగ్యంపాలైన తండ్రి స్థానంలో కుటుంబానికి అండగా నిలబడింది. పశువుల కొట్టంలో అడుగుపెట్టింది. వ్యాపారం అనే పదానికి అర్థం తెలియని పసివయసులో.. పాలవ్యాపారానికి సంబంధించి పాఠాలు నేర్చుకుంది.. చదువుకుంటూనే, యువ వ్యాపారవేత్తగా మారింది. ఆమే 24 ఏండ్ల శ్రద్ధా ధావన్. ఇప్పుడు యువతకు వ్యాపార పాఠాలు చెబుతున్న ఆమె పరిచయం...





మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉండే నిఘోజ్ గ్రామానికి చెందిన సత్యాధావన్‌ది పాలవ్యాపారం. అతను పెద్దగా చదువుకోలేదు. అందుకే తన కూతురు శ్రద్ధాధావన్, కొడుకు కార్తీక్‌లను బాగా చదివించాలనుకున్నాడు. కానీ అనుకోకుండా వచ్చిన అనారోగ్యంతో వికలాంగుడయ్యాడు. అతని పాలవ్యాపారం కుంటుపడింది. చూసేవాళ్లు లేకపోవడంతో ఒక్క పశువుని మాత్రం తన వద్ద ఉంచుకుని, తక్కిన వాటిని అమ్మేశాడు. చూస్తుండగానే కుటుంబ పోషణతోపాటూ పిల్లల చదువులూ అతనికి భారంగా మారాయి.

పదకొండేండ్లకే...

తన తర్వాత తన కుటుంబాన్ని, ఉన్న చిన్నపాటి పాలవ్యాపారాన్ని ఎవరికి అప్పగించాలో ఆ తండ్రికి తెలియలేదు. ఆ సమయంలో అతని కండ్ల ఎదురుగా ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే కూతురు శ్రద్ధాధావన్ కనిపించింది. 'అమ్మా... నువ్వు మన పాలవ్యాపారాన్ని చూసుకోగలవా?' అని తండ్రి అడగ్గానే ఉత్సాహంగా ఊ కొట్టిందా పిల్ల. అప్పటికి ఆ చిన్నారి వయసు 11 ఏండ్లు మాత్రమే. అయినా పరిస్థితులను అర్థం చేసుకుని పశువుల కొట్టంలోకి అడుగుపెట్టింది.

ఎంతో ఓపికతో...

వ్యాపారం అనే పదానికి అర్థం కూడా తెలియని ఆ పసివయసులో తండ్రిని అడిగి ఎన్నో విషయాలు శ్రద్ధగా అడిగి తెలుసుకునేది శ్రద్ధ. కొట్టాన్ని శుభ్రం చేయడం, పాలు తీయడం వంటి పనులని ఎంతో ఓపికతో చేసేది. సైకిల్‌పై పాలకేంద్రాలకు పాలను తరలించేది. పశువులకు ఆరోగ్య సమస్యలొస్తే పశు వైద్యులను సంప్రదించేది. అన్నింటికంటే ముఖ్యంగా సేంద్రియపద్ధతిలో పెంచిన గ్రాసాన్ని మాత్రమే వాటికి ఆహారంగా వేసేది. దాంతో పశువులు ఆరోగ్యంగా ఉండి పాలు పుష్కలంగా ఇచ్చేవి. మిగిలిన పాలను గ్రామంలో అవసరమైనవారికీ అమ్మేది. బాధ్యతలు పెరిగేసరికి సైకిల్‌ని వదిలి బైకు నడపడం నేర్చుకుంది.

చదువుకుంటూనే...

గ్రామంలో బైకుపై తిరుగుతూ పాలను విక్రయించే మొదటి ఆడపిల్ల అయ్యింది శ్రద్ధా. అలాగని చదువుని నిర్లక్ష్యం చేయలేదామె. స్కూల్‌కు ఒక్కసారికూడా గైర్హాజరు అయ్యేదికాదు. హోంవర్క్‌కు ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయించుకుని ఆ పని పూర్తిచేసేది. శ్రద్ధా తమ్ముడు ఆమె కన్నా నాలుగేండ్లు చిన్నోడు. తను చదువుకు ఆటంకం లేకుండా సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకునేది. చదువులో తమ్ముడికి ఆదర్శంగా నిలిచింది. పాల వ్యాపారాన్ని అభివృద్ధి చేసి ఇప్పుడు యువతకూ స్ఫూర్తి నిస్తోంది.



సిగ్గుపడడం లేదు

'నేను బాగా చదివితేనే, మా తమ్ముడు నన్ను స్ఫూర్తిగా తీసుకుంటాడు. అందుకే ఓవైపు పాల వ్యాపారాన్నీ, మరోవైపు చదువును సమన్వయం చేసుకుంటున్నాను. ప్రస్తుతం డిగ్రీ పాసయ్యా. ఫిజిక్స్ అంటే ఇష్టం. అందుకే ఈ సబ్జెక్ట్‌లో మాస్టర్స్ చేశాను. నా చేతిలోకి ఈ పాల వ్యాపారం వచ్చేసరికి నా వయసు 11 ఏండ్లు. అప్పటికి మా పశువుల కొట్టంలో ఒక్క పశువు మాత్రమే ఉండేది. ఇప్పుడు 80 వరకు ఉన్నాయి. వీటికోసం రెండు అంతస్తుల్లో పశువుల కొట్టం ఏర్పాటు చేశాను. మా గ్రామంలోని రైతుల నుంచి సేంద్రియపద్ధతిలో పండించే గడ్డినే పశువులకు ఆహారంగా తీసుకుంటా. ఈ పదేండ్లలో అనుభవంతోపాటూ ఎన్నో మెలకువలనూ తెలుసుకున్నా. మావూర్లో అందరూ చదివి, పట్నాలకు వెళుతున్నారు. నేను మాత్రం ఈ పాలవ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తా. త్వరలో పాల ఉత్పత్తుల తయారీని ప్రారంభించాలనుకుంటున్నా. ఈ రంగంలో అడుగుపెట్టినందుకు నేను సిగ్గుపడటం లేదు. కుటుంబ బాధ్యతలను కాస్తంత ముందుగా తీసుకున్నా అంతే. ఇప్పుడు మా డైయిరీ నుంచి రోజుకి 450 లీటర్ల పాలను విక్రయిస్తున్నాం. వీటిని తరలించడానికి జీపు డ్రైవింగ్ కూడా నేర్చుకున్నా. నెలకు ముప్పై వేల కిలోల వర్మీకంపోస్టును ఉత్పత్తి చేసి అమ్ముతున్నాను. నెలకు ఆరులక్షల రూపాయల ఆదాయం వస్తోంది. యువత ఈ పరిశ్రమ లోకి అడుగుపెడితే మరిన్ని విజయాలు సాధించొచ్చు. ఈ రంగంపై అందరికీ అవగాహన కలిగించేదిశగా ఆన్‌లైన్‌లో పలు సంస్థల తరపున అతిథిగా ప్రసంగిస్తున్నా' అని చెబుతోంది శ్రద్ధాధావన్. ■

పెరుగుతో ఇలా...

పెరుగును మనం తినడానికి, వంటకానికి ఉపయోగించడమే కాకుండా మన చర్మానికి కూడా ఎంతో మంచిది. పెరుగులో ఉండే పోషకాలు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మానికి మేలు చేస్తాయని చర్మ నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు పెరుగుతో ముఖానికి ఫేస్ ప్యాక్ చేసుకోవడం ద్వారా ముఖంపై ఉండే మచ్చలు, మొటిమలు, నలుపు తగ్గి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

పెరుగులోని పోషకాలు

పెరుగులో ప్రొటీన్లు, కేల్షియం, విటమిన్ బి, విటమిన్ డి, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. ఇది ముఖంపై ఉండే మచ్చలను తగ్గించి చర్మాన్ని, శరీరానికి హానికరం కాకుండా సహజంగా శుభ్రపరుస్తుంది. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ కూడా చర్మంలోకి లోతుగా ప్రవేశించి సున్నితమైన చర్మాన్ని అందిస్తుంది.



పెరుగును ఎలా ఉపయోగించాలి..?

చర్మం జిడ్డు అయితే పుల్లటి పెరుగును వాడాలి, దానిలో ఎక్కువ నూనె ఉంటుంది. ఇది చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తుంది. పొడి చర్మం ఉన్న వారు తియ్యని మీగడ పెరుగును వాడటం మంచి ఆప్షన్. పెరుగులోని పోషకాలు అందంగా కనిపించే చర్మాన్ని ఇవ్వడంలో సహాయపడతాయి.

గోధుమ పిండి, పెరుగు

ఒక చిన్న గిన్నెలో ఒక టీస్పూన్ పెరుగును తీసుకోండి. దానిలో ఒక టీస్పూన్ గోధుమ పిండి కలపండి. గోధుమ పిండి ముఖానికి బ్లీచింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. ఇది ముఖంపై ఉండే నలుపుదనాన్ని తగ్గించి చర్మం ప్రకాశవంతంగా మారడానికి సహాయపడుతుంది. అయితే జిడ్డు చర్మం ఉన్న వారు ఇందులో నిమ్మరసాన్ని కూడా వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖంపై రాసి 10-15 నిమిషాలు ఉంచండి. తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయండి. ఇలా చేయడం వల్ల ముఖంపై మృత కణాలు తొలగిపోయి ముఖం అందంగా మారుతుంది.

డీప్ క్లీనింగ్

పెరుగులోని ప్రాకృతిక లక్షణాలు చర్మంలో డీప్ క్లీనింగ్ చేస్తూ.. చర్మ సమస్యలను తగ్గిస్తాయి. కాంతివంతమైన చర్మం కోసం రోజూ ఈ చిట్కాలు పాటించడం చాలా ముఖ్యం. పెరుగులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మాన్ని క్లీన్ చేసి చర్మంపై ఉండే మచ్చలు, మొటిమలు, నలుపుదనాన్ని తగ్గిస్తాయి. ■

20న ఎప్‌సెట్ నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ ఈనెల 20న విడుదల కానుంది. సోమవారం ఎప్‌సెట్ కమిటీ మొదటి సమావేశాన్ని హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉన్న జేఎన్టీయూ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ, ఎప్‌సెట్ చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఈ పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి, సభ్యులు ఎస్ తారాకళ్యాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 20న నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్‌ను ఉపయోగించి ఎప్‌సెట్ ప్రశ్నాపత్రాలను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఈనెల 20 నుంచి https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కుంభమేళా తొక్కిసలాటపై గరంగరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే తొక్కిసలాటలో మరణించిన వారి పూర్తి జాబితాను విడుదల చేయాలని నినదించారు. అనంతరం సభ్యులు సభలోని వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. విపక్షాల ఆందోళనపై స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. "ప్రజలు మిమ్మల్ని ఎంపీలుగా ఎన్నుకున్నది. నినాదాలు చేయడం, సభా కార్యకలాపాలకు భంగం కలిగించడం, బల్లలు పగలగొట్టేందుకా?" అని మండిపడ్డారు. మరోవైపు ప్రతిపక్ష ఎంపీలు 'తానాషాహీ నహీ చలేగీ' అని నినాదాలతో హోరెత్తించారు. మాకూ ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించాలని స్పీకర్‌ను పదేపదే కోరారు. దీంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా విపక్ష ఎంపీలకు విజ్ఞప్తి చేస్తూ..."దయచేసి ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలిగించకండి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ప్రతి ఎంపీ తమ అభిప్రాయం చెప్పేందుకు అవకాశం ఇస్తాం' అని అన్నారు. కాగా గందరగోళం మధ్యే లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయం ముగిసింది. ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ సహా ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

రాజ్యసభలో ఎంపీల వాకౌట్

మరోవైపు ఇటీవల మరణించిన ఎంపీలకు నివాళు లర్పిస్తూ రాజ్యసభ ప్రారంభ మైంది. అయితే కుంభమేళా ఘటనపై ప్రతిపక్షాల సభ్యులు నినాదాలు చేశారు. గత పార్లమెంట్ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దృష్టి సారించి దేశవ్యాప్తంగా రాజ్యాంగం, బిఆర్ అంబేద్కర్ పట్ల పెరుగుతున్న అగౌరవ సంఘటనలపై చర్చించడానికి కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ రణదీప్ సింగ్ సూర్జేవాలా సోమవారం మోషన్ నోటీసును సమర్పించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయం, సమానత్వ సూత్రాలను అణగదొక్కేందుకు ఉద్దేశపూర్వక ప్రయత్నం జరుగుతోందని తన నోటీసులో పేర్కొన్నారు. అయితే జీవో అవర్ ప్రారంభించే ముందు ధన్కర్ మాట్లాడుతూ రూల్ 267 కింద తొమ్మిది నోటీసులు వచ్చాయని, ఈ నోటీసులు మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని, వాటిని తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరం తొక్కిసలాట ఘటనపై యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.



వామపక్ష ఎంపీల నిరసన

బడ్జెట్ సమావేశాల్లో అన్యాయం జరిగిందంటూ..కేరళకు చెందిన వామపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కేంద్రం అనుసరిస్తున్న రాష్ట్రాలపట్ల వివక్షను ఆపాలంటూ నినదించారు.

రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కేటాయింపులు రూ.5,337 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక బడ్జెట్ సగటు వ్యయం రూ.886 కోట్లు మాత్రమేననీ, దీనితో పోలిస్తే రాష్ట్రానికి ఆరురెట్లు అధికంగా నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పదేండ్లలో రాష్ట్రంలోని వివిధ రైలు ప్రాజెక్టుల అభివృద్ధి కోసం మొత్తం రూ.41,677 పెట్టుబడి పెట్టామన్నారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ వందశాతం విద్యుదీకరణ చెందిందన్నారు. రైల్వే భద్రతలో భాగంగా కవచ్ ఏర్పాటులో కూడా రాష్ట్రమే ముందంజలో ఉందనీ, కవచ్ అభివృద్ధి కేంద్రం సికింద్రాబాద్‌లో ఉందని వివరించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో 1,465 కిలోమీటర్ల కవచ్ వ్యవస్థ ఏర్పాటుచేయబడిందనీ, తాజాగా కవచ్ 4.0 వెర్షన్ కోసం ట్రయల్స్ జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే ఆరేండ్లలో దేశవ్యాప్తంగా మొత్తం రైలు నెట్‌వర్క్‌లో కవచ్‌ను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ఏడు జిల్లాల నుంచి తొమ్మిది స్టాప్‌లతో ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మొత్తంగా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా 50 కొత్త నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు, 100 కొత్త అమృత్ భారత్ రైళ్లకు ఆమోదం లభించిందనీ, ఈ రైళ్ల రాకపోకలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడువేల కిలోమీటర్ల మేర పాత ట్రాక్‌లను పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ముఖ్యమైన రూట్లలో 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపేలా రైల్వేట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించామనీ, మరొకొన్ని మార్గాల్లో 130 కిలోమీటర్లు, మరికొన్ని చోట్ల 100 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపేలా ట్రాక్‌ల సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు.

ఏదీ పింఛన్..?

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు.

విడుదల కాగానే అందజేస్తాం
రవీందర్ రాథోడ్, డీఆర్‌డీఓ- ఆదిలాబాద్

కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తుల చేసిన విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇప్పటి వరకు అక్కడ్నుంచి తమకు ఎలాంటి ఆదేశాలూ అందలేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

బాధ వున్నా అమెరికన్లూ భరించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. వాణిజ్య మిగులు లేకపోతే కెనడా మనలేదు, ఇది కఠినంగా వున్నా వాస్తవం, కానీ అమెరికాకు కెనడా అవసరం లేదని ట్రంప్ చెప్పుకున్నారు. కెనడా,. అమెరికా 51వ రాష్ట్రంగా మారితే ఇక తక్కువ పన్నులు వుంటాయి, మరింత మెరుగైన సైనిక రక్షణ వుంటుంది, టారిఫ్‌లు వుండవని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

గందరగోళం మధ్య ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

సీజీజీ, ఇంటర్ బోర్డు మధ్య సమన్వయలోపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు గందరగోళం మధ్య సోమవారం ప్రారంభమయ్యాయి. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ), ఇంటర్ బోర్డు మధ్య సమన్వయం కొరవడింది. దీంతో ప్రాక్టికల్ పరీక్షల్లో గందరగోళం ఏర్పడింది. సర్వర్ సమస్య రావడంతో కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఆలస్యంగా ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లో ఒకేషనల్‌తో కలిపి 2,008 కేంద్రాలను ప్రాక్టికల్స్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈనెల 22 వరకు ఇవి జరుగుతాయి. మొదటి విడత సోమవారం నుంచి ఈనెల ఏడు వరకు, రెండో విడత ఎనిమిది నుంచి 12 వరకు, మూడోవిడత 13 నుంచి 17 వరకు, నాలుగో విడత 18 నుంచి 22 వరకు నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ప్రాక్టికల్ పరీక్షలకు 4,31,052 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 3,33,805 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి, 95,247 మంది ఒకేషనల్ విద్యార్థులున్నారు.

నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో బీసీ జనాభాను లెక్కించిన ప్రభుత్వం ఆ తరగతులకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. మరో కీలకమైన ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకున్న ప్రభుత్వం దానిపై చర్చించేందుకు సిద్ధమైంది. ఒకవేళ బీసీలకు ప్రభుత్వపరంగా స్థానిక సంస్థల్లో విద్య, ఉద్యోగాల వరంగా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతే యథావిధిగా ముందుకు వెళ్లాలని సర్కారు భావిస్తున్నది.

సమగ్ర ఇంటింటి సర్వే పేరిట కులాల వారీగా ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై సర్వే నిర్వహించిన ప్రణాళికా విభాగం.. సంబంధిత నివేదికను ఈ నెల 2న ఉత్తమ్ కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించింది. అలాగే ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య న్యాయ కమిషన్ కూడా ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘానికి సోమవారం నివేదిక ఇచ్చింది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై విశ్రాంత అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ సైతం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ మేరకు మంగళవారం నిర్వహించనున్న ప్రత్యేక అసెంబ్లీ, మండలి సమావేశంలో ఈ రెండు అంశాలపై అందిన నివేదికలపై చర్చించి వాటికి ఆమోదముద్ర వేయనుంది.

బీసీ కేటగిరీ ముస్లింలతో కలుపుకుని రాష్ట్రంలో బీసీ జనాభా 56.33 శాతం మేరకు ఉన్నట్టు సమగ్ర కులగణన సర్వే తేల్చింది. ఈ వివరాల ఆధారంగానే బూసాని వెంకటేశ్వరరావు కమిషన్ స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై నివేదిక ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. కులగణన సర్వే ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా 27.88 శాతం మేరకు ఉంది. అంటే వారికి స్థానిక సంస్థల్లో 27 నుంచి 28 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం బీసీలకు దక్కే రిజర్వేషన్ 22-23 శాతం మాత్రమే ఉంది. బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలంటే పార్లమెంటులో చట్ట సవరణ చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో పేర్కొనాల్సి ఉంటుంది. ఈ మేరకు సమగ్ర వివరణతో కూడిన నివేదికను బూసాని కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడానికి వీలుగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని మంత్రివర్గం కేంద్రాన్ని కోరనుంది. అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, కేంద్రానికి పంపనున్నది. పార్లమెంటు సమావేశాలు ఈ నెల 11 వరకు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ తీర్మానాన్ని బుధవారం కేంద్రానికి పంపాలని నిర్ణయించారు. అయితే ఈ అంశంపై అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులనూ భాగస్వాములను చేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయా పార్టీల సభ్యులను అసెంబ్లీకి ఆహ్వానించింది. బీసీ రిజర్వేషన్లపై చర్చలో పాల్గొనడం ద్వారా ఆ తరగతులపై తమ వైఖరిని తెలియజేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై ఇటీవల విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఎప్పటిలోగా ఎన్నికలు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే రేవంత్ సర్కార్ దీనికి సమాధానం ఇవ్వాల్సి ఉంది. మరోవైపు స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటు బడ్జెట్ తొలి సెషన్ ముగిసే వరకూ ప్రభుత్వం వేచి చూడనుంది. ఆలోగా స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం స్పందించకపోతే పాత రిజర్వేషన్ల ప్రకారమే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ప్రకారం అధికార పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తే మిగతా పార్టీలు సైతం వాటిని కచ్చితంగా అమలు చేయాల్సి వస్తుంది.

దాంతో ఇతర పార్టీలు కూడా బీసీ నినాదం ఎత్తుకోవడంతో పాటు కాంగ్రెస్ ఇచ్చినట్టే బీసీలకు సీట్లు కేటాయించడం ఖాయమనిస్తోంది. అన్ని అనుకున్నట్టుగా జరిగితే దేశంలోనే మొదటిసారి బీసీలకు తగిన స్థాయిలో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ క్రమంలో ఇప్పటికే ఈ విషయంలో ప్రచారం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం తరపున రిజర్వేషన్లు అమలు చేస్తే వచ్చే న్యాయపరమైన చిక్కులకు సంబంధించి ప్రత్యేక న్యాయ నిపుణుల బృందం ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్లు 50శాతం దాటడంపై ఏజీ నుంచి న్యాయ సలహా తీసుకున్నది.

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర సర్కార్ తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీని నియమించి అధ్యయనం పూర్తి చేసింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో ఆ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఏక సభ్య కమిషన్ క్యాబినెట్ సబ్ కమిటీకి ఎస్సీ వర్గీకరణ నివేదిక అందజేసింది. ఇందులో క్యాబినెట్ సబ్ కమిటీకి, ఏకసభ్య కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ భేటీలో ఉత్తమ్ కుమార్‌తో పాటు కమిటీ వైస్ చైర్మెన్ దామోదర రాజనర్సింహ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గతేడాది ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు అధ్యయనం కోసం రాష్ట్ర సర్కార్ 2024 అక్టోబర్ 11న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమించిన విషయం తెలిసిందే. రెండు నెలల్లో అధ్యయనం చేసిన కమిషన్ సోమవారం క్యాబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేసింది. నేడు జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో దీన్ని ఆమోదించే అవకాశం ఉంది.

మంత్రులపై సీఎం రేవంత్ సీరియస్

బీసీ కులగణన రిపోర్టుపై మీడియాతో మాట్లాడిన మంత్రులపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ అంశంపై పాత్రికేయులతో మాట్లాడిన విషయం విదితమే. రిపోర్టును క్యాబినెట్ సమావేశంలో పెట్టకుండా మీడియాకు వివరాలు వెల్లడించడమేంటంటూ సీఎం ఈ సందర్భంగా సీరియస్ అయినట్టు తెలిసింది. మరోవైపు కులగణన రిపోర్టు తప్పులతడకగా ఉందంటూ బీసీ సంఘాలు, బీసీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. గతంతో పోలిస్తే బీసీల జనాభా ఇప్పుడు భారీగా తగ్గిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ సమావేశం తర్వాత సోమవారం సాయంత్రం నిర్వహించాలనుకున్న ప్రెస్ మీట్‌ను మంత్రులు రద్దు చేసుకున్నారు.

అట్టడుగు వర్గాల్లో పని చేయాలి

బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలి

- పార్టీ స్వతంత్ర శక్తి, ప్రజా పునాది, ప్రభావాన్ని పెంచడానికి కృషి చేయాలి
- సీపీఐ(ఎం) ముసాయిదా రాజకీయ తీర్మానం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్వతంత్ర బలం, ప్రజా పునాది, ప్రభావాన్ని పెంచడానికి అట్టడుగు వర్గాల మధ్య పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని 24వ పార్టీ మహాసభ కోసం రూపొందించిన సీపీఐ(ఎం) ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. "గ్రామీణ ప్రాంతాల్లోని ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు చేసే పోరాటాలలోని బలహీనతలను పరిష్కరించాలి. అటువంటి పోరాటాలకు దారితీసిన అంశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలి. తయారీ, వ్యూహాత్మక పరిశ్రమలలో కార్మికులలో పార్టీ ప్రభావాన్ని పెంచాలి. కాంట్రాక్ట్ కార్మికులను వ్యవస్థీకరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కార్మిక, రైతు ఐక్యతను, సమన్వయ పోరాటాలను నిర్మించడంపై పార్టీ దృష్టి పెట్టాలి. మనం అట్టడుగు వర్గాలలో హిందూత్వ వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహించాలి. పోరాటంలో చేరే వారిలో రాజకీయ చైతన్యాన్ని నింపాలి. పార్టీ సొంత రాజకీయ ప్రచారాలు, ప్రజా ఉద్యమాలపై మరింత శ్రద్ధ వహించాలి. ఎన్నికల ఏకాభిప్రాయం లేదా కూటమి పేరుతో పార్టీ స్వతంత్ర ఉనికిని వదులుకోకూడదు. దాని స్వతంత్ర కార్యకలాపాలను తగ్గించకూడదు. ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని హిందూత్వ శక్తుల ఆలోచనలు, చర్యలను ఎదుర్కోవడానికి మనం సైద్ధాంతిక కార్యకలాపాలు, ప్రచారంపై దృష్టి పెట్టాలి. స్థానిక స్థాయిలో ప్రజా-వర్గ సమస్యలను చేపట్టడం ద్వారా స్థిరమైన పోరాటాలను నిర్వహించాలి. ఈ విషయంలో ఉన్న లోపాన్ని పరిష్కరించాలి. ఈ విషయంలో ఉన్నత కమిటీలు స్థానిక-శాఖ విభాగాలకు మద్దతు అందించాలి. సాంప్రదాయ పోరాట పద్ధతులకు బదులుగా, వినూత్నమైన, ఊహాత్మక పోరాట వ్యూహాలను అవలంబించాలి. సామాజిక, కుల అణచివేత, లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహించాలి. వీటిని వర్గ పోరాటాలతో అనుసంధానించాలి. పార్టీ రాజకీయ జోక్యాలు, డిమాండ్లు యువత సమస్యలను పరిష్కరించడానికి అనుకూలంగా ఉండాలి. "సోషలిజం ప్రత్యామ్నాయం" అనే ప్రచారానికి యువతను లక్ష్యంగా చేసుకోవాలి" అని పేర్కొంది.

"బెంగాల్, త్రిపురలో పార్టీ తన బలాన్ని తిరిగి పొందాలి. బెంగాల్‌లో సామూహిక సమీకరణలు నిర్వహిస్తున్నప్పుడు, గ్రామీణ పేదలను సంఘటితపరచాలి. టీఎంసీ, బీజేపీలను కలిసి వ్యతిరేకిస్తూనే, బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక పోరాటంపై మనం మరింత దృష్టి పెట్టాలి. త్రిపురలో మనం అట్టడుగు స్థాయి పనిని బలోపేతం చేయాలి. కేరళలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీని రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదుర్కోవడంలో ఉన్న బలహీనతను స్పష్టంగా వెల్లడించాయి. దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది. "కేంద్రం వైఖరి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రభుత్వం పేదలు, కార్మిక వర్గాల సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తోంది" అని ముసాయిదా తీర్మానం పేర్కొంది.

బీజేపీ ఆదేశాల మేరకే మీడియా పని చేస్తోంది

కొన్ని మీడియా సంస్థలు తప్ప, ప్రధాన స్రవంతి మీడియా సంస్థలన్నీ కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నాయని సీపీఐ(ఎం) ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. కార్పొరేట్ ఛానెళ్లన్నీ ప్రభుత్వంతో జతకట్టి మత విషాన్ని చిమ్ముతున్నాయి. అదే సమయంలో స్వతంత్ర మీడియా, డిజిటల్ మీడియాను అణచివేసే ఎత్తుగడలు కూడా ఉన్నాయి. 'న్యూస్ క్లిక్' అనే న్యూస్ పోర్టల్ పై పోలీసులు, కేంద్ర సంస్థలు చేసిన దాడి ఒక హెచ్చరిక లాంటిది. ప్రభుత్వం మీడియాను నియంత్రించడానికి, సెన్సార్ చేయడానికి '2023 ఐటీ సవరణ చట్టం' వంటి నిరంతర ప్రయత్నాలు చేస్తోంది. 2024 పత్రికా స్వేచ్ఛా సూచిక 180 దేశాలలో భారతదేశానికి 159వ స్థానంలో ఉంది" అని పేర్కొంది.

వర్గ ప్రజా సంఘాల ఐక్య వేదికల పోరాటాలకు మద్దతు

"వర్గ, ప్రజా సంఘాల ఐక్య వేదికల, సమన్వయ పోరాటాలకు సీపీఐ(ఎం) మద్దతు ఇస్తుంది. బూర్జువా పార్టీల వెనుక ఉన్న ప్రజలను ఇటువంటి ఐక్య పోరాటాలకు తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేయబడతాయి. కార్మిక, రైతు ఐక్యతను పెంపొందించడానికి, సమన్వయంతో ఆందోళనలు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అటువంటి ఆందోళనల్లో చేరేవారిని రాజకీయంగా బలోపేతం చేయడానికి, అట్టడుగు వర్గాలలో హిందూత్వ వ్యతిరేక ప్రచారాన్ని బలోపేతం చేయడానికి చేసే ప్రయత్నాలపై దృష్టి కేంద్రీకరించాలి. కన్నూర్ పార్టీ కాంగ్రెస్ తరువాత, జాతీయ స్థాయిలో అనేక సమ్మెలు, ఆందోళనలు జరిగాయి. అనేక ఆందోళనలను ట్రేడ్ యూనియన్ సహా సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయం చేసింది. కార్మిక, రైతు ఐక్యత లక్ష్యాన్ని ప్రోత్సహించడానికి ఇటువంటి సమన్వయ ఆందోళనలు అవసరం. తమిళనాడులో శామ్‌సంగ్ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును డిమాండ్ చేస్తూ 37 రోజుల సమ్మెను విజయవంతంగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, చండీగఢ్, మహారాష్ట్ర, పుదుచ్చేరిలలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నిరసనలు చేపట్టారు. పాక్షిక విజయం కూడా వచ్చింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకాలలో పాల్గొన్న కార్మికులు కూడా సుదీర్ఘ ఆందోళనలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకింగ్, బీమా, పోస్టల్, బొగ్గు, టెలికాం రంగాలలోని ఉద్యోగులు, కార్మికులు అనేక నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రైతు సంఘాలు కనీస మద్దతు ధరతో సేకరణ, పంటల బీమా, అటవీ హక్కులు, భూమి హక్కులు, వన్యప్రాణుల దాడులు, రబ్బరు ధరలు తగ్గడం వంటి అంశాలపై ఆందోళనలు కూడా నిర్వహించాయి. ఉద్యోగ భద్రత, వేతనాలు, కుల వివక్ష వంటి అంశాలపై వ్యవసాయ కార్మిక సంఘం కూడా ఆందోళనలో పాల్గొంది. మహిళలు, విద్యార్థి, యువజన సంఘాల కూడా వివిధ అంశాలపై ఆందోళనలు కార్యక్రమాలు నిర్వహించాయి" అని పేర్కొంది.



నందినికి అక్షర బాసట

రూ. లక్ష నగదు ప్రోత్సాహం అందజేత

నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ స్టార్ అథ్లెట్, ఆసియా క్రీడల పతక విజేత నందిని అగసారకు అక్షర్ విద్యా సంస్థలు ఆర్థిక తోడ్పాటు అందించాయి. సాధారణ మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నందిని.. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాలు సాధించింది. తాజా జాతీయ క్రీడల్లోనూ తెలంగాణ తరఫున బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో అక్షర విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు నందినికి రూ.1 లక్ష నగదు ప్రోత్సాహం అందించారు. 'యువ అథ్లెట్ నందిని స్ఫూర్తిగా విద్యార్థులు క్రీడల్లో రాణించాలి. 2028 ఒలింపిక్స్‌లో నందిని భారత్‌కు పతకం సాధిస్తుందని ఆశిస్తున్నాను. నందినికి అక్షర విద్యా సంస్థల తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని' జగన్‌మోహన్ రావు తెలిపారు.

పసిడి విజేతకు రూ.10 లక్షలు

జాతీయ క్రీడలకు భారీ నగదు బహుమతి

నవతెలంగాణ-హైదరాబాద్ : 38వ జాతీయ క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ నుంచి 205 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. జాతీయ క్రీడల్లో పతకం సాధించి, తెలంగాణ గర్వపడేలా చేసిన అథ్లెట్లకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తుందని శాట్ చైర్మన్ కే. శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. 'జాతీయ క్రీడల్లో మన అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. పతక వేటలో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారు. పసిడి పతకం సాధించిన అథ్లెట్లకు రూ. 10 లక్షలు, రజతం సాధిస్తే రూ. 5 లక్షలు, కాంస్యం సాధిస్తే రూ. 3 లక్షల నగదు బహుమతి అందించనున్నామని' శివసేనా రెడ్డి వెల్లడించారు. సోమవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో జాతీయ క్రీడల్లో పోటీపడుతున్న టెన్నిస్ క్రీడాకారులకు ఆ సంఘం తరఫున పది మందికి రూ. 25 వేలు చొప్పున అందజేశారు. జాతీయ క్రీడల్లో తెలంగాణ మహిళల టెన్నిస్ జట్టు గతంలో పోటీపడినా.. పురుషుల జట్టు తొలిసారి అర్హత సాధించింది. ఈ కార్యక్రమంలో శాట్ వీసీ ఎండీ సోనీబాలా దేవి, తెలంగాణ టెన్నిస్ సంఘం ఆఫీస్‌బేరర్లు తదితరులు పాల్గొన్నారు.



రెగ్యులర్‌గా కొట్టాలని..!

250-260 స్కోర్లపై గౌతం గంభీర్

ఎక్కువ రిస్క్.. ఎక్కువ రివార్డ్!. టీమ్ ఇండియా అన్ని ఫార్మాట్లలో పాటిస్తున్న ఫార్ములా ఇదే. కానీ టీ20ల్లోనే ఇది ఎక్కువగా ప్రతిఫలాలను అందిస్తున్నట్టు కనిపిస్తుంది. యువ క్రికెటర్లతో కూడిన టీమ్ ఇండియా టీ20ల్లో నిలకడగా భారీ స్కోర్లు సాధించాలనే వ్యూహంతో ఉన్నామని చీఫ్ కోచ్ గౌతం గంభీర్ అన్నారు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత్ 4-1తో సొంతం చేసుకుంది.

నవతెలంగాణ-ముంబయి

భయమెరుగని క్రికెట్‌తో దంచికొడుతున్న టీమ్ ఇండియా యువ క్రికెటర్లపై చీఫ్ కోచ్ గౌతం గంభీర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1తో దక్కించుకున్న అనంతరం గౌతం గంభీర్ మీడియాతో మాట్లాడాడు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో దారుణ పరాజయంతో స్వదేశానికి వచ్చిన గంభీర్.. పొట్టి ఫార్మాట్‌లోనూ విజయ పరంపర కొనసాగించాడు. ఇంగ్లాండ్‌తో చివరి రెండు టీ20ల్లో భారత్ సూపర్ ఎటాకింగ్‌తో మెప్పించింది. పుణెలో ఇంగ్లాండ్ పేసర్ సకిబ్ మహమూద్ ఒక్క ఓవర్లోనే మూడు వికెట్లతో దెబ్బకొట్టినా.. మనోళ్లు ఎదురుదాడి ఆపలేదు. దీంతో భారత్ 181/9 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఆ మ్యాచ్‌లో పరాజయం పాలైంది.



ముంబయిలోనూ అదే ప్రదర్శన పునరావృతం అయ్యింది. ఓ ఎండ్‌లో వికెట్లు పడినా.. అభిషేక్ శర్మ వెనక్కి తగ్గలేదు. దీంతో భారత్ టీ20ల్లోనే నాల్గో అత్యధిక స్కోరు 247/9 సాధించింది. ఇటువంటి భయమెరుగని బ్రాండ్ క్రికెట్‌తో రెచ్చిపోతున్న కుర్రాళ్లను గంభీర్ గొప్పగా ప్రశంసించాడు.

ఇలా ఆడాలనే ప్లాన్ :

'ఇటువంటి టీ20 క్రికెట్‌నే మేము ఆడాలని అనుకుంటున్నాం. వికెట్లు పోతాయనే భయంతో ఆడాలని అనుకోవటం లేదు. ఎక్కువ రిస్క్, ఎక్కువ రివార్డ్ మా ఫార్ములా. ఈ ప్రణాళికను యువ క్రికెటర్లు బాగా అలవర్చుకున్నారు. టీ20 జట్టు అంటేనే భయమెరుగని, స్వార్థంలేని మంత్ర. గత ఆరు నెలలుగా టీమ్ ఇండియా ఈ ఫార్మాట్‌లో ఇది అద్భుతంగా అనుసరిస్తోంది. 250-260 పరుగులను నిలకడగా సాధించాలని అనుకుంటున్నాం. ఈ క్రమంలో 120-130 పరుగులకు కుప్పకూలే సందర్భాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. టీ20 ఫార్మాట్ క్రికెట్ అంటే ఇదే. ఎక్కువ రిస్క్ తీసుకోకుంటే.. పెద్ద విజయాలు సాధించలేము. భారత టీ20 జట్టు ఈ విషయంలో సరైన మార్గంలోనే నడుస్తోంది' అని గౌతం గంభీర్ అన్నాడు.

జర్మనీ చిన్నారికి కెఎస్‌జి స్పాన్సర్‌షిప్

హైదరాబాద్ : జర్మనీ టెన్నిస్ సంచలనం, 8 ఏండ్ల చిన్నారి అరియా లాంక్రిసెంట్‌కు కెఎస్‌జి (కంకణాల స్పోర్ట్స్ గ్రూప్) స్పాన్సర్‌షిప్ ప్రకటించింది. ఎలక్ట్రికల్ బైక్ రేసింగ్ టీమ్ ఇండీ రేసింగ్, హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఫ్రాంచైజీలు కెఎస్‌జిలో భాగం కాగా తాజాగా టెన్నిస్‌లోనూ అడుగుపెట్టారు. పదేండ్ల కాలానికి అరియాతో స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కెఎస్‌జి యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి తెలిపారు. 'భారత్‌లో టెన్నిస్‌కు మంచి ఆదరణ ఉంది. గ్రాండ్‌స్లామ్ టోర్నీలకు ఐపీఎల్‌తో సమానంగా వీక్షణలు ఉంటాయి. అతి త్వరలోనే భారత్‌లోనూ టెన్నిస్‌కు ఊపు



రానుంది. యూరోప్‌లో ఎంతో మంది జాతీయ కోచ్‌లతో సంప్రదింపులు అనంతరం అరియాకు స్పాన్సర్‌షిప్ నిర్ణయం తీసుకున్నాం. చిన్న వయసులోనే అరియాలో గొప్ప ప్రతిభ ఉంది' అని అభిషేక్ తెలిపారు.

‘కె-ర్యాంప్’ షురూ..



యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా హాస్య మూవీస్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నంబర్ 7గా రాజేష్ దండ నిర్మిస్తున్న కొత్త ప్రాజెక్ట్‌కి 'కె -ర్యాంప్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. కొత్త డైరెక్టర్ జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం జరిగిన ఈ చిత్ర పూజా కార్యక్రమానికి దిల్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి క్లాప్ కొట్టారు. నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచ్చాన్ చేశారు. డైరెక్టర్స్ విజయ్ కనకమేడల, రామ్ అబ్బరాజు, యదు వంశీ, రైటర్ ప్రసన్న స్క్రిప్ట్ అందజేశారు. యోగి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి, సీనియర్ నరేష్ పాల్గొన్నారు. తాజాగా రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్ చూస్తుంటే నిజంగానే ర్యాంప్ ఆడించేలా ఉన్నారు. ఇదేదో యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన స్టిల్‌లా కనిపిస్తోంది. కిరణ్ అబ్బవరంను పూర్తిగా చూపించలేదు గానీ.. చుట్టూ ఆ మందిని చూస్తుంటే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసినట్టుగానే ఉన్నారు. ఈ చిత్రం కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది.

ఈ చిత్రానికి నిర్మాత : రాజేష్ దండ, సహ నిర్మాత : బాలాజి గుట్ట, ప్రభాకర్ బురుగు, రచన, దర్శకత్వం : జైన్స్ నాని, సంగీతం : చేతన్ భరద్వాజ్, కెమెరామెన్ : సతీష్ రెడ్డి మాసం, ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, ఆర్ట్ డైరెక్టర్: సుధీర్ మాచర్ల, ఎడిటర్ : చోటా కె. ప్రసాద్, యాక్షన్: పృథ్వీ.

‘సతీ లీలావతి’..



దేవ్ మోహన్, లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతున్న చిత్రం 'సతీ లీలావతి'.

ఆనంది ఆర్ట్స్ సమర్పణలో తాతినేని సత్య దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి నిర్మాతలుగా రూపొందుతోన్న ఈ చిత్రం సోమవారం రామోజీ ఫిల్మ్ సిటీలోని సంఘి హౌస్‌లో ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

ఈ కార్యక్రమంలో వరుణ్ తేజ్, చిత్ర సమర్పకులు జెమినీ కిరణ్, నిర్మాతలు హరీష్ పెద్ది, వి.ఆనంద ప్రసాద్, అన్నే రవి, డైరెక్టర్ తాతినేని సత్య తండ్రి, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీష్ పెద్ది క్లాప్ కొట్టారు. వరుణ్ తేజ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ, 'ఆహ్లాదాన్ని కలిగించే చక్కటి ఎంటర్‌టైనర్‌గా ఇది రూపొందుతుంది. మనస్ఫూర్తిగా నవ్వుకునే రొమాంటిక్ డ్రామాగా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలతో సినిమా తెరకెక్కుతుంది. సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ఈరోజు నుంచే ప్రారంభిస్తున్నాం' అని అన్నారు. 'డైరెక్టర్ తాతినేని సత్య స్క్రిప్ట్ చెప్పగానే నేటి తరం ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా అనిపించింది' అని నిర్మాతలు నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి చెప్పారు.



ప్రభాస్

ప్రళయ కాల రుద్రుడు..

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ సోమవారం 'కన్నప్ప' చిత్రంలోని ప్రతి పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇస్తూ వస్తున్నారు.

ఈ క్రమంలో తాజాగా సోమవారం ఈ సినిమా నుంచి ప్రభాస్ పాత్రను రివీల్ చేశారు. రుద్రుడిగా ఈ చిత్రంలో ప్రభాస్ అలరించబోతున్నారు.

'ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు.. శివాజ్ఞ పరిపాలకుడు' అంటూ ప్రభాస్ పోషిస్తున్న పవర్‌ఫుల్ పాత్రను మేకర్స్ అందరికీ పరిచయం చేశారు. ప్రభాస్ వేషధారణ, లుక్ చూస్తుంటే దైవత్వం ఉట్టి పడేలా కనిపిస్తోంది.

ఇందులో శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ నటిస్తున్నారు. అలాగే మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం వంటి హేమా హేమీలూ అందులో కనిపించబోతున్నారు.

నవచిత్రం

‘తండేల్’.. ఒక స్వచ్ఛమైన ప్రేమకథ

'మత్సలేశ్యం అనే ఊరుని బేస్ చేసుకుని తీసుకున్న కథతో 'తండేల్' చేశాం. ఇక్కడి వారు గుజరాత్ పోర్ట్‌కి ఫిషింగ్‌కి వెళ్తారు. అక్కడ బోట్లు ఉన్న వారికి బిరుదులు ఉంటాయి. మెయిన్ లీడర్‌ని 'తండేల్' అంటారు. ఇది గుజరాతీ పదం' అని నిర్మాత బన్నీవాసు అన్నారు.

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడిగా, అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత బన్నీవాసు సోమవారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



బన్నీవాసు

- నా క్లాస్ మేట్ భాను. తను కో ప్రొడ్యూసర్ కూడా. రైటర్ కార్తిక్ దగ్గర ఈ కథ విని, బావుందని నా దగ్గరికి తీసుకొచ్చాడు. కార్తిక్ చెప్పిన కథలో ఎసెన్స్ నాకు చాలా నచ్చింది. తనది కూడా మత్సలేశ్యం ఊరు పక్కనే. అక్కడ స్ఫూర్తి పొంది కథ రాసుకున్నాడు. పాయింట్ నాకు చాలా నచ్చింది. 'కార్తికేయ 2' తర్వాత చందుని ఈ కథ వినమన్నాను. తనకీ చాలా నచ్చింది. ఈ కథ కోసం చాలా రీసెర్చ్ చేశాం. ఇందులో భాగంగా కొందరిని కలిసినప్పుడు వారు చెప్పిన విషయాలు గూస్ బంప్స్ తీసుకొచ్చాయి. ఈ విషయాలన్నీ చెప్పడానికి రాజు, సత్య అనే ఫిక్షనల్ క్యారెక్టర్స్‌ని డైరెక్టర్ చందు డిజైన్ చేశారు. ఈ క్యారెక్టర్స్ ద్వారా జరిగిన కథ చెప్పాం.
- ఇది ప్యూర్ లవ్ స్టోరీ. రాజు, సత్య ప్రేమ కథ చాలా కీలకం. ఆ లవ్ స్టోరీ ద్వారా ఒరిజినల్‌గా జరిగిన స్టోరీని చూపించుకుంటూ వచ్చాం. ఇది యాభై శాతం ఫిక్షన్. యాభై శాతం నాన్ ఫిక్షన్.
- నాలుగేళ్ల క్రితం ఓ ఇన్విటేషన్ ఇవ్వడానికి చైతూ దగ్గరికి వెళ్లాను. ఈ మధ్య విన్న మంచి కథ ఏమిటని అడిగారు. అప్పుడు ఈ కథ గురించి చెప్పాను. ఆయనకి పాయింట్ చాలా నచ్చింది. భలే ఉంది, మనం చేస్తున్నామని అన్నారు. అయితే ఇందులో ఫిషర్ మ్యాన్ క్యారెక్టర్, సముద్రంలోకి వెళ్లిన తర్వాత నెలల పాటు స్నానం ఉండదు, అంతా ఒరిజినల్‌లా షూట్ చేయాలని అనుకుంటున్నాం. యాస కూడా ఉంటుందని చెప్పాను. 'నేను వర్క్ చేస్తా'నని చెప్పారు. ఆయన ఈ పాత్ర కోసం మౌల్డ్ అయిన విధానం అద్భుతం. ఆడియన్స్ అందరికీ ఈనెల 7న చైతు సర్‌ప్రైజ్ ఇస్తారు. చివరి అరగంట అయితే కుమ్మేశారు.
- సాయి పల్లవి రష్ చూసి 'నేను మామూలుగా చేసుకుంటూ వెళ్లాను. చైతు నాకు గట్టి కాంపిటేషన్ ఇచ్చారు'అని చెప్పి తనకి మ్యాచ్ అయ్యేలా నటించారు. శివుని పాటలో సాయి పల్లవి, చైతు డ్యాన్స్ థియేటర్స్‌లో పూనకం తెప్పిస్తుంది.
- ఇది రూటెడ్ స్టోరీ. నేచురల్‌గా షూట్ చేశాం. అంత నేచురల్‌గా మ్యూజిక్ కూడా ఉంటుంది. దేవిశ్రీ ఇచ్చిన మ్యూజిక్ అద్భుతం. ఇప్పటికే పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయి. ఈ సినిమా మూడు భాషల్లో రిలీజ్ అవుతుంది. మెయిన్ తెలుగు. హిందీ, తమిళ్ డబ్బింగ్. అరవింద్ సినిమా చూశారు. ఆయన చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

పాన్ ఇండియా రేంజ్‌లో ‘కర్మ స్థలం’

రాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్ తెరకెక్కించిన చిత్రం 'కర్మ స్థలం'. అర్చన శాస్త్రి, మితాలి చౌహాన్, వినోద్ అల్వా, కలకేయ ప్రభాకర్, బాలగం సంజయ్, నాగ మహేష్, దిల్ రమేష్, చిత్రం శ్రీను ముఖ్య పాత్రలు పోషించారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

హీరోయిన్ అర్చన మాట్లాడుతూ, 'మహిషాసుర మర్దిని కాన్సెప్ట్‌తో ఈ మూవీని తెరకెక్కించారు. ఇంత మంచి సబ్జెక్ట్‌ని, 'కర్మ స్థలం' వంటి అద్భుతమైన టైటిల్‌తో సినిమాను తెరకెక్కించిన రాకీకి థ్యాంక్స్. నిర్మాత శ్రీనివాస్ సహకారంతో దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. క్వాలిటీ పరంగా ఈ మూవీ పాన్ ఇండియ స్థాయిలో ఉంటుంది' అని తెలిపారు.

'పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది. నిర్మాత శ్రీనివాస్ నా వెన్నంటి ఉండి నడిపించారు. అర్చన ఈ సినిమా కోసం ఎంతో



కష్టపడ్డారు. ఆమె అందించిన సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. ఎం.ఎల్ రాజా మంచి సంగీతాన్ని అందించారు' అని దర్శకుడు రాకీ షెర్మన్ చెప్పారు.

నిర్మాత శ్రీనివాస్ సుబ్రహ్మణ్య మాట్లాడుతూ, 'ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని తెలిపారు.

ఆద్యంతం ఉత్కంఠభరితం

సాయిరామ్ శంకర్ నటించిన సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విహాన్ ఫిల్మ్స్ - విహారి సినిమా హౌస్ ప్రై. లిమిటెడ్ బ్యానర్స్ పై గార్లపాటి రమేష్‌తో కలిసి నిర్మిస్తూ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 7న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. శ్రీలక్ష్మి ఫిలిమ్స్‌పై బాపిరాజు ఈ మూవీని రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. రిలీజ్ సందర్భంగా దర్శక, నిర్మాత వినోద్ కుమార్ విజయన్ మీడియాతో ముచ్చటించారు.

- చాలా చిన్న వయసులో మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాను. నేను అక్కడ ప్రొడక్షన్ చేశాను. చాలా చిత్రాలను నిర్మించాను. దర్శకత్వం వహించాను. నేను చేసిన చిత్రాలకు జాతీయ అవార్డులు కూడా వచ్చాయి. ఫాహద్ ఫాజిల్‌ను, గోపీ సుందర్ వంటి వారిని ఇండస్ట్రీకి నేనే పరిచయం చేశాను. ఇప్పుడు మమ్ముట్టి, ఫాహద్ ఫాజిల్‌లతో ప్రాజెక్టులు కూడా చేస్తున్నాను.



వినోద్ కుమార్ విజయన్

- ఇది ఒక స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ. ప్రతీ శుక్రవారం ఎన్నో సినిమాలు వస్తుంటాయి. ఈ శుక్రవారం మాత్రం ప్రేక్షకులు చాలా కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను చూడబోతున్నారు. తెలుగు ఆడియెన్స్‌కు ఇది చాలా కొత్తగా అనిపిస్తుంది. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సీటు అంచున కూర్చోబెట్టేలా ఉంటుంది. ఇంటర్వెల్‌లోనే విలన్ ఎవరో కనిపెట్టండని ముందే సవాల్ విసురుతున్నాం. ఇంటర్వెల్ తరువాత విలన్ ఎవరో కనిపెడితే పది వేలు ఇస్తామని అంటున్నాం. 50 థియేటర్ల నుంచి.. థియేటర్‌కి ఒకరు చొప్పున 50 మంది విజేతలకు 10 వేల రూపాయల చొప్పున బహుమతిని అందిస్తాం. ఈ చిత్రంలో సాయి రామ్ శంకర్ చాలా కొత్తగా కనిపిస్తాడు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.